ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా అలంఫీర్ ఎన్నిక



07

సంపుటి 09, సంచిక: 262 | శుక్రవారం | 21-08-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## పోలీస్ హింసపై 'సుప్రీం' దర్యాప్తు కమిటీ





రిటైర్డ్ జడ్జి ఆర్.సుభాష్ రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఏర్పాటు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురాగతాలు, పోలీసులు, భద్రతా సిబ్బందిపై జరిగిన హింసాకాండ ఆరోపణలను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు ఒక ఉన్నతస్థాయి కమిటీ(హెచ్‌పిఇసి)ని ఏర్పాటుచేసింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి నేతృత్వంలోని ఐదుగురు సభ్యులతో కూడిన హైపవర్డ్ కమిటీని నియమించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, తరువాయి 12లో

## కమ్యూనిస్టులు తలవంచరు : డి.రాజా

ఢిల్లీ 'బద్లావ్' ర్యాలీ జయప్రదానికి సిపిఐ ప్రధాన కార్యదర్శి పిలుపు



**న్యూఢిల్లీ:** నిరంకుశత్వానికి, నియంతలకు కమ్యూనిస్టులు తలవంచబోరని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టంచేశారు. మార్పు అనివార్యమని, దాన్ని సమష్టిగా సాధిద్దామని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి వినాశకర పరిపాలన విధానాలను ఎండగట్టేందుకు మార్పు నినాదంతో దేశవ్యాప్తంగా ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు చేపట్టిన ప్రచారోద్యమం, పాదయాత్రలు విజయవంతమైనట్లు ప్రకటించారు. సెప్టెంబరు 1న ఢిల్లీ, రాంలీలా మైదానంలో భారీ ర్యాలీ, బహిరంగ సభతో ఈ ప్రచారోద్యమాన్ని ముగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తరువాయి 12లో



ఇంజినీరింగ్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల

## లేటరల్ ఎంట్రీ యథాతథం

పాలిటెక్నిక్‌ల బలోపేతానికే పునర్వ్యవస్థీకరణ : మంత్రి వివేక్

ప్రజాపక్షం/హైదరాబాద్

పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన వారికి టిజి ఇసెట్ ద్వారా ఇంజినీరింగ్‌లో లేటరల్ ఎంట్రీ విధానం కూడా కొనసాగుతుందని శక్తి శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి స్పష్టంచేశారు. పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేసి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకే పరిపాలనా పునర్వ్యవస్థీకరణ చేపట్టినట్లు తెలిపారు. పాలిటెక్నిక్‌లను కమిషనరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (సిటిఇ) పరిధి నుంచి కమిషనరేట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ (సిఇటి) పరిధిలోకి తీసుకువస్తూ జూన్ 16న జిఓ 97 జారీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ పాలిటెక్నిక్‌లు, ఐటిఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఎటిసిలు), యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐఎస్‌యు)లను సిఇటి పరిధిలోకి తీసుకురావడం ద్వారా సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల అవసరాలను సమగ్రంగా అనుసంధానించనున్నట్లు తెలిపారు.

**డిప్లొమా, ఫీజుల్లో మార్పుల్లేవు..**

ప్రస్తుతం అమల్లో ఉన్న మూడేళ్ల ఎఐసిటిఇ గుర్తింపు పొందిన డిప్లొమా కోర్సు యథావిధిగా కొనసాగుతుందని తరువాయి 8లో



## దక్షిణాది రాష్ట్రాల సమస్యలకు

# చర్చలతోనే పరిష్కారాలు

- ట్రిబ్యునల్, కమిటీ, ఉత్తరప్రత్యుత్తరాలు లేకుండా సమస్యలు పరిష్కరించాలి
- 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆకాంక్ష
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమస్యలకు చర్చల ద్వారా శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని ఆకాంక్షించారు. ట్రిబ్యునల్ లేకుండా, కమిటీ లేకుండా, బహుశా మరోసారి ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా లేకుండా సమస్యలు పరిష్కారం కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తమిళనాడు రాష్ట్రం మహాబలిపురంలో గురువారం కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆంధ్రప్రదేశ్ సిఎం ఎన్.చంద్రబాబు నాయుడు, కర్నాటక సిఎం డి.కె.శివకుమార్, కేరళం సిఎం వి.డి.సతీషన్, తమిళనాడు సిఎం జోసెఫ్ విజయ్ ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల తరువాయి 8లో

### కృష్ణా జలాల విషయంలో తెలంగాణ స్పష్టతతో ఉంది

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టతతో ఉందని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క చెప్పారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను తెలంగాణ కచ్చితంగా కోరుకుంటోందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్–II పరిధిలో ఉందని ఆయన గుర్తు చేస్తూ చట్టపరమైన ప్రక్రియ ద్వారా త్వరగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన చెప్పారు.

### మిగులు జలాల్లో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలి

మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని, కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలన్నారు.

## భూ భారతి చట్టమే వచ్చే ఎన్నికల్లో రెఫరెండం

- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే చట్టం లక్ష్యం : మంత్రి పొంగులేటి వెల్లడి
- ఖమ్మం జిల్లా నారాయణపురంలో భూ రీసర్వేపై రైతులతో ముఖాముఖి



ప్రజాపక్షం/సత్తుపల్లి

రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే భూభారతి చట్టం లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూభారతి చట్టం తమ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజల తీర్పుకు రెఫరెండంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురంలో గురువారం నిర్వహించిన భూ రీ సర్వేపై రైతుల ముఖాముఖి, అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల భూ సమస్యలు, రీ సర్వేపై ఉన్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు.బేతుపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని మొత్తం 12,047 ఎకరాల్లో ఇప్పటికే సుమారు 6 వేల ఎకరాల రీ సర్వే పూర్తయిందని, మిగిలిన భూమికి కూడా త్వరలో సర్వే పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి భూమికి ఖచ్చితమైన కోఆర్డినేట్లు, మ్యాప్ రూపొందించి హక్కులను నమోదు చేస్తామని చెప్పారు. రీ సర్వే అనంతరం 30 రోజుల పాటు రైతుల అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించిన తర్వాతే తుది హక్కులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.వ్యవసాయ భూములకు వెళ్లే తరువాయి 12లో

ఆర్‌డిఓ కార్యాలయంలో ఏఓ

## ఆస్తులు రూ.100 కోట్లు పైనే

- శ్రీనివాస్‌రెడ్డి ఇల్లు, ఆఫీసుల్లో ఎసిబి దాడులు
- కిలోకి పైగా బంగారం, భూములు, ప్లాట్ల దస్త్రాలు స్వాధీనం

10





నా కుమార్తె వ్యాఖ్యలు

## పూర్తిగా ఆమె వ్యక్తిగతం

- నన్ను బాధ్యురాలిని చేయడం సముచితం కాదు
- టిపిసిసి క్రమశిక్షణా కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

'నా కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయం. సుస్మిత వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధం' అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. కుటుంబ బాంధవ్యం ఉన్నంత మాత్రాన ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యల ఆధారంగా తనను వివరణ కోరడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. టిపిసిసి క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసుకు సమాధానంగా గురువారం తరువాయి 8లో

### సుస్మిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

03

## సమన్వయం, డిజిటల్ వేదికలతోనే సత్వర న్యాయం

### కొత్త నేర చట్టాల అమలుకు సమన్వయమే కీలకం

- తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్
- శాస్త్రీయ దర్యాప్తు, డిజిటల్ ఆధారాలతో పౌరులకు సత్వర న్యాయం-డిజిటల్ వేదికలను సమర్థంగా వినియోగించాలి : డిజిపి సి.వి. ఆనంద్



ప్రజాపక్షం/హైదరాబాద్

కొత్త నేర చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమం (బిఎస్ఎ) అమలులో డిజిటల్ వేదికల వినియోగం, వివిధ విభాగాల మధ్య సమన్వయం కీలకమని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. న్యాయవ్యవస్థ, పోలీస్, జైళ్లు, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్, వైద్య విభాగాలతో పాటు ఎన్ఐసి, ఎన్‌సిఆర్‌బి వంటి సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొస్తూ తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, తెలంగాణ పోలీస్ శాఖ సంయుక్తంగా హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన సదస్సు ఆయన ప్రారంభించారు. దేశంలోనే తొలిసారిగా కొత్త నేర చట్టాల డిజిటల్ అమలుకు సంబంధించిన అన్ని భాగస్వామ్య సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది న్యాయాధికారులు, పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్లు, ఫోరెన్సిక్, వైద్య విభాగాల అధికారులు హైబ్రిడ్ విధానంలో పాల్గొన్నారు. సదస్సులో జస్టిస్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ప్రసంగిస్తూ "న్యాయం అనేది వివిధ సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే సాధ్యమయ్యే తరువాయి 8లో

## ప్రమాద ఘంటికలు మోగుతున్నాయ్

హైకోర్టు ఆందోళన

ఆర్థిక చెల్లింపుల ప్రాధాన్యంపై ఆలోచన చేయాలని సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్

భూసేకరణ పరిహారం కోసం కోర్టుల మెట్లెక్కుతున్న బాధితులు.. పదవీ విరమణ ప్రయోజనాలు, పెన్షన్ బకాయిల కోసం న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న ఉద్యోగులు.. కనీస వేతనాలతో పనిచేసే తాత్కాలిక సిబ్బందికి సకాలంలో జీతాలు అందని పరిస్థితులు.. ఇవన్నీ ఆర్థిక వ్యవహారాల్లో చెల్లింపుల ప్రాధాన్యంపై ఆలోచించాల్సిన అంశాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక విధుల విషయంలో జోక్యం చేసుకోవడం తమ ఉద్దేశం కాదని, అయితే ప్రజల హక్కులకు సంబంధించిన చెల్లింపుల విషయంలో స్పష్టత అవసరమని పేర్కొంది. ఇది రాజకీయ చర్చ కాదని, ఏ పార్టీ, వ్యక్తితోనూ సంబంధం లేదని, కేవలం చట్టబద్ధమైన అంశాలపైనే విచారణ కొనసాగిస్తున్నామని స్పష్టం చేసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. భూసేకరణలో భూములు కోల్పోయిన వారికి పరిహారం అందక కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలవుతున్నాయని న్యాయస్థానం గుర్తుచేసింది. పెన్షన్, పదవీ విరమణానంతర ప్రయోజనాలు అందక ఉద్యోగులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని తెలిపింది. కనీస వేతనాలతో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులకు సైతం జీతాలు అందని పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. కోర్టుకు వచ్చే ప్రతి వ్యక్తి అవసరమైన వర్గానికి చెందినవారేనని, చెల్లింపుల విషయంలో ప్రాధాన్య క్రమాన్ని పాటించాల్సిన బాధ్యత ప్రభుత్వానికీ ఉందని వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయని హెచ్చరించింది. భూసేకరణ పరిహారానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని కోర్టు ధిక్కరణ కేసుల వివరాలను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. భూసేకరణ పరిహారానికి సంబంధించి ప్రస్తుతం 19 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిలో మూడు కేసులకు టోకెన్లు జారీ అయ్యాయని, సంబంధిత జీవోలు కూడా వెలువడ్డాయని చెప్పారు. మిగిలిన కేసుల వివరాలను సమర్పించేందుకు కొంత సమయం కావాలని కోరారు. ప్రతి కేసులో చెల్లింపులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో విడివిడిగా పరిశీలించి వివరాలు సమర్పించాలని తరువాయి 12లో

# కలవరపెడుతున్న హింస

ఇటీవల రాష్ట్రంలో అత్యంత కలవరపెట్టే రీతిలో నేర సంబంధిత ఘటనలు కలవరపెడుతున్నాయి. పతనమవుతున్న సామాజిక విలువలకు ఇవి దర్పణం పడుతున్నాయి. ఇటీవల నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్స్‌పాల్ రూపారెడ్డిని సొంత పాఠశాల విద్యార్థులే దారుణంగా హత్య చేయడం తెలుగు ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది. ముఖ్యంగా ఆమెను 27 సార్లు కత్తితో పొడిచి చంపిన తీరు ఒళ్ళు గగుర్పొడిచేలా చేసింది. ఈ నేరానికి పాల్పడిన వారిద్దరూ పదవ తరగతి విద్యార్థులేనని పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్న అనంతరం వెల్లడిం రు. ఈ కేసులో చిన్న వయసులోనే హింసా ప్రవృత్తి పెరుగుతున్న వైనం ఆందోళన కలిగించేది. జల్సాలు, తాగుడు, ఖరీదైన అలవాట్లు, వ్యసనాల బారిన పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీసులు చెబుతున్నారు. వారిని తల్లిదండ్రుల సమక్షంలో వారించినందుకు కక్షగట్టి చంపడమే కాకుండా, పెద్ద ఎత్తున నగదును కొట్టేశారు. నిందిత విద్యార్థులను పట్టుకునేందుకు హత్య అనంతరం సుమారు పది రోజులు పట్టింది.

వారం రోజుల క్రితం తన మైనర్ కుమారుడితో కలిసి వరుస హత్యలు, దోపిడీలు చేసిన ఒక మహిళను సిద్ధిపేట పోలీసులు అరెస్టు చేశారు. నేరాలు పాల్పడేందుకు దృఢకాయుడిగా కొడుకును తీర్చిదిద్దేందుకు ఇంట్లోనే కసరత్తు చేసుకునేందుకు జిమ్ సామాగ్రిని కొనిచ్చింది ఆ తల్లి. వారిరువురు ఇద్దరు మహిళలను చంపి, దోచుకోవడమే కాకుండా, తెల్లవారుజామున వాకింగ్ చేస్తున్న మహిళను కొట్టి నగలను లాక్కొని పారిపోయారు. మరో నలుగురిని చంపి దోచుకునేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు.

ఈ రెండు ఘటనలు సమాజంలో పతనమైన నైతిక విలువలకు అద్దం పడుతున్నాయి. నేరస్థులు హత్యలు చేయడమెలాగో యూట్యూబ్ వీడియోలను చూసి తెలుసుకున్నారట! త్వరగా డబ్బు సంపాదించాలనే అత్యాశ, చెడు వ్యసనాలు, మద్యం, విస్తరిస్తున్న గంజాయి అలవాటు పరిస్థితిని మరింత దిగజారుస్తున్నాయి. కొంత ఉన్నత వర్గాలలో డ్రగ్స్ సంస్కృతి పెరిగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఈగిల్ పేరిట డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నా మారుమూల గ్రామాలకు కూడా అది విస్తరించటం ఆందోళన కలిగించేదే. వీటివల్ల మైనర్‌లలో సైతం హింసా ప్రవృత్తి, నేర సంస్కృతి పెరిగిపోతోంది. కొందరు సామాజిక విశ్లేషకులు తల్లిదండ్రుల పెంపకాన్ని తప్పుబడుతున్నారు. గతంలో మాదిరిగా పిల్లలను కనిపెట్టుకోవడం లేదనేది వారి వాదన. కానీ, సిద్ధిపేట ఘటనలో ధనాపేక్ష స్వయంగా తల్లే కొడుకుని నేరాల రొంపిలోకి దింపింది.

వీటిన్నిటి కారణాలను లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. నైతిక విలువల పతనానికి ప్రధానంగా సామాజిక మాధ్యమాలు, దుర్వ్యసనాల ప్రభావం ఉందనేది విస్మరించలేని వాస్తవం. ప్రతి ఒక్కరి చేతిలో సెల్ ఫోన్ ఉండడం, ఇంటర్నెట్ డాటా చౌకగా మారడంతో రకరకాల వీడియోలు అందుబాటులోకి వచ్చాయి. మంచి కన్నా చెడుకే ఎక్కువ చెల్లుబాటు అన్నట్లుగా, క్షీణ సంస్కృతిని విస్తరించేలా అశ్లీల వీడియోలు, నేర దృశ్యాలు, ఒటిటిలో నియంత్రణ లేని కంటెంట్ అరచేతిలో ఇమిడిపోయే ఫోన్ ద్వారా అందుబాటులోకి వచ్చాయి. వీటి ప్రభావంలో పిల్లలే కాకుండా పెద్దలు కూడా కొట్టుకుపోతున్నారు. అనైతిక సంబంధాల నేపథ్యంలో పెరిగిపోతున్న హత్యలను కూడా చూస్తున్నాం. కష్టపడకుండానే ధనవంతులైపోవాలనే యావను పెంచే గ్యాంబ్లింగ్, బెట్టింగ్ యాప్‌లతో చితికిపోయిన కుటుంబాలు అసంఖ్యాకం. ఇక మద్యాన్ని ప్రధాన ఆదాయవనరుల్లో ఒకటిగామార్చేసుకున్న ప్రభుత్వాలు కుగ్రామాలకు సైతం ఏరులై పారేలా చేశాయి. ఆబ్కారీ అధికారులకు అమ్మకాలపై టార్గెట్‌లు పెడుతున్నాయి. దీన్ని గత ప్రభుత్వాలు పెంచి పోషించగా, ఇప్పటి ప్రభుత్వ హయంలో పరాకాష్ఠకు చేరుకుంది. సంక్షేమ పథకాలకు దాదాపు రూ.50వేల కోట్లు వెచ్చిస్తుండగా, అంతే మొత్తంలో రూ.47 వేల కోట్ల వరకు మద్యం ద్వారా ఆదాయ లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టుకుంది. ఒకచేతితో ఇచ్చి, మరో చేతితో లాగేసుకోవడమే అవుతుంది. ఇదొక ఎత్తైతే విచ్చలవిడి అమ్మకాలతో పెద్దా చిన్నా, ఆడా మగ తేడా లేకుండా మద్యానికి బానిసలవుతున్నారు. వీటికి తోడు గంజాయి మత్తు యువతను చిత్తు చేస్తోంది. ఫలితంగా క్రమంగా విచక్షణ కోల్పోయే పరిస్థితులకు దారి తీస్తోంది.

నియంత్రణ లేని అశ్లీల కంటెంట్‌ను అందిస్తున్న ఒటిటి, ఇంటర్నెట్, సోషల్ మీడియా వేదికల విస్తరణ నిత్యం ధర్మం, విలువల పాఠాలు వల్లించే బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ హయాంలోనే ఎక్కువ జరిగింది. ప్రపంచంలోనే అతి చౌకగా ఇంటర్నెట్ డాటా అందుబాటులోకి రావడంతో తప్పుడు చారిత్రక వాస్తవాలతో ప్రజలను బ్రెయిన్ వాష్ చేసేందుకు కాషాయదళం దానిని దుర్వినియోగం చేసింది. మరోవైపు, ఇదే ఇంటర్నెట్ విలువల పతనానికి కూడా అది మరో రూపంలో దారి తీసింది. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, మలేషియా, బ్రెజిల్ తదితర దేశాలు 16 ఏళ్ళ లోపు పిల్లల సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధించాయి. సామాజిక వేదికల్లో అన్నీ దుర్లక్షణాలే ఉంటాయని కాదు. ఇటీవల నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో జరిగిన జంతర్ మంతర్ ఉద్యమంలో వాటి సద్వినియోగ పాత్ర వెల్లడైంది. మన దేశంలో అశ్లీల, క్రైమ్ కంటెంట్‌పై ఉక్కుపాదం మోపాల్సిన సమయం ఆసన్నమైంది. అధికారంలో ఉన్న పార్టీలు మద్య పానాన్ని నియంత్రించే చర్యలు తీసుకుంటామని తమ ఎన్నికల మ్యానిఫెస్టోల్లో కంటితుడుపుగా వాగ్దానం చేస్తున్నాయే తప్ప ప్రభుత్వ పగ్గాలు చేపట్టాక దాని ద్వారా వచ్చే ఆదాయంపైనే మక్కువ చూపుతున్నాయి. మద్యపాన వ్యసనం ఆరోగ్యాలను, కుటుంబాలను కుదేలు చేస్తోంది.ఇది ఏ ఒక్క రాష్ట్రానికో పరిమితం కాదు.

సోషల్ మీడియా ఉధృతితో పిల్లలు, పెద్దల్లో పుస్తక పఠనాసక్తి తగ్గిపోయింది. గతంలో బాలల సాహిత్యం విస్తృతంగా అందుబాటులోఉండేది. వాటిలో కథలు పిల్లల్లో చిన్నప్పటి నుంచే నైతిక విలువలు పాదుకొల్పేవి. ఇప్పుడు తెలుగులో అలాంటి పుస్తకాలే అరుదయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు చాగంటి కోటేశ్వరరావును సలహాదారుడిగా నియమించింది. ఆయన అబ్దుల్ కలాం, సర్వేపల్లి రాధాకృష్ణన్, వివేకానంద, స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలలోని స్ఫూర్తివంతమైన ఘటనలను విద్యార్థులకు బోధించి నైతిక విలువల పెంపునకు ఒక ప్రయోగం సాగుతోంది. ఇప్పటికైనా అన్ని స్థాయిల్లో ప్రభుత్వాలు మేల్కొని సామాజిక సంక్షోభానికి అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన చర్యలకు తక్షణమే పూనుకోవాలి. పతనమవుతున్న విలువలను నిలబెట్టే ప్రయత్నం జరగాలి. లేదంటే పరిస్థితి మన కళ్ళముందే మరింత వేగంగా దిగజారుతుంది.




## 21వ శతాబ్దపు పంజరం మొబైల్‌ఫోన్

**మన విద్యార్థులు 24 గంటలు మొబైల్ ఫోన్ చూస్తూ ఉంటారు. మీకు ఒక విషయం అర్థం కావడం లేదు. మిమ్మల్ని జూలో బంధించారు. మొబైల్ ఫోన్ అనేది 21వ శతాబ్దపు పంజరం. మొబైల్ అవసరం లేదని నేను చెప్పను. దాని అవసరం ఉంది. అది మీకు చాలా సమాచారం అందిస్తుంది. బిజినెస్‌లో ఉపయోగపడుతుంది. కమ్యూనికేషన్స్‌లో ఉపయోగపడుతుంది. కానీ, అది మీకు స్వరాజ్యం (స్వీయపాలన) ఉండనీయదు. అలా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీదే.**

– లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

# ‘ఈవీ’ విప్లవం.. ప్రకృతిపై ఎంత భారం?

ప్రపంచం ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాల వైపు వేగంగా అడుగులు వేస్తున్నది. భారతదేశం సైతం నగరాలను కాలుష్య రహితం చేయడానికి ఈవీలకు ప్రాధాన్యత ఇస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లోనూ దీనికి సంబంధించి కార్యాచరణ కొనసాగుతున్నది. హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి విముక్తి చేయడానికి ‘క్యూర్’ పరిధిలో ఈవీ ఆటోలకు ప్రోత్సాహకాలు, సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రపంచవ్యాప్తంగా నగరాల్లో కాలుష్య నివారణకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తున్నది. అయితే ఈవీల వల్ల పట్టణాలు, నగరాల్లో కాలుష్యాన్ని కొంతమేర నివారించగలిగినా.. వాటి తయారీకి అవసరమయ్యే ఖనిజాల కోసం గ్రామాలు, అడవులు, పర్వతాలు, తద్వారా ప్రకృతికి ఎంత మేర నష్టం జరుగుతుందో ప్రభుత్వాలు ఒక అంచనా వేసుకోవాల్సిన



సమయం ఆసన్నమైంది.

**ఆరు రెట్లు ఎక్కువ ఖనిజాలు :** సాధారణ పెట్రోల్ కారు కంటే ఈవీ కారును తయారు చేయడానికి ఆరు రెట్లు ఎక్కువ ఖనిజాలు అవసరమవుతాయని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) ఇటీవల ఒక నివేదిక విడుదల చేసింది. ఎలక్ట్రిక్ కార్లలో బ్యాటరీలు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థల కోసం రాగి, లిథియం, నికెల్, కోబాల్ట్, గ్రాఫైట్ వంటి ఖనిజాలు ఎక్కువగా అవసరం కావడమేకారణమని తేల్చింది.

**మైనింగ్‌తో సమస్యే :** ఈవీల తయారీకి అవసరమయ్యే ఖనిజాలు వెలికితీయాలంటే పెద్ద గనులు ఏర్పాటు చేసి మైనింగ్ చేయాల్సి ఉంటుంది. దీనికోసం అడవులను నరకడం, కొండలను తొలగించడం వంటి చర్యలు కూడా చేపట్టాల్సి ఉంటుంది. భూములను తవ్వడం, ఖనిజాలను వేరు చేయడం, శుద్ధి చేయడానికి నీరు, విద్యు త్ అవసరమవుతాయి. దీనివల్ల కూడా పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడి వేరే మార్గాల ద్వారా కాలుష్యం పెరగవచ్చు.

**ఈవీతో తగ్గే కాలుష్యమెంత?:** ఎలక్ట్రిక్ వాహనాలు వంద శాతం కాలుష్యరహిత వాహనాలు కావు. పెట్రోల్ కార్లతో పోలిస్తే మన దేశంలో వీటి జీవిత కాల ఉద్గారాలు సుమారు 20 శాతం మాత్రమే తక్కువగా ఉన్నాయని అనేక నివేదికలు చెప్తున్నాయి. మరోవైపు ఈవీ తయారీకి అవసరమయ్యే ఖనిజాలు తవ్వే సమయంలో, వాటిని శుద్ధి చేసే సమయంలో, బ్యాటరీ తయారు చేసే సమయం లో పర్యావరణంపై తీవ్ర ప్రభావం ఉంటుంది.

**‘రీసైక్లింగ్’ చేస్తే..:** 2025 నాటికి ప్రపంచ ఈవీ బ్యాటరీ వినియోగం 1.2 టెరావాట్ గంటలకు చేరింది. 2020తో పోలిస్తే ఏది ఏడు రెట్లు ఎక్కువ. భవిష్యత్తులో ఈ డిమాండ్‌ను తట్టుకోవాలంటే వాడేసిన బ్యాటరీలను రీసైక్లింగ్ చేయడం అత్యంత కీలకం.

**ప్రజా రవాణే ప్రస్తుత పరిష్కారం:** ప్రతి పెట్రోల్ కారు స్థానంలో ఈవీని రోడ్డెక్కిస్తే పర్యావరణ, కాలుష్య సమస్య తీరదు. దీనివల్ల ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు పరిష్కారం దొరకదు. ముందుగా వ్యక్తిగత వాహనాల వాడకాన్ని తగ్గించాల్సి ఉంటుంది. మెట్రో, రైళ్ళ, బస్సుల వైపు ప్రజలను మళ్లించాల్సి ఉంటుంది. నడిచే దూరం ఉన్న చోట నడక, సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముంది. అప్పుడే వాహనాల అవసరం తక్కువవుతుంది. పెట్రోల్ కారా, ఈవీ కారా అన్నది కాదు.. అసలు మనకు ఎన్ని కార్లు అవసరం అన్న ప్రశ్నే భవిష్యత్ పర్యావరణ ప్రభావాన్ని నిర్ణయిస్తుంది.

నూకల దేవేందర్, 7013439800



డి. రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

# శిరమెత్తిన యువతరం.. నాడు – నేడూ స్ఫూర్తిదాయకం

విద్యార్థులు నిరసనలో ఒక్కటై నిలబడిన దృశ్యంలో ఒక స్ఫూర్తి దాయకమైన, చైతన్యవంతమైన విషయం ఉంది. వారి ప్లకార్డులపై కొత్త డిమాండ్లు ఉండొచ్చు. వారి నినాదాలు కొత్త తరానికి చెందినవి కావొచ్చు. వారు సంఘటితం అయ్యేందుకు ఉపయోగించిన టెక్నాలజీలు గతం కంటే పూర్తిగా భిన్నంగా ఉండవచ్చు. కానీ ఆ స్ఫూర్తి కొత్తది కాదు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం నుంచి స్వతంత్ర భారతదేశంలో ప్రజా స్వామ్యం, సామాజిక న్యాయం, యువత హక్కుల కోసం జరిగిన పోరాటాల వరకు, విద్యార్థులు పదేపదే ప్రజా సమీకరణలో ముందుండి నడిపించారు. దేశం ఉన్నత భవిష్యత్తు ప్రమాదంలో పడినప్పుడు, వారు తమను తాము తరగతి గదులు, పరీక్షలు, క్యాంప్‌లలోని చిన్న సరిహద్దులకు ఎన్నడూ పరిమితం చేసుకోలేదు.

విద్యార్థి ప్రతిఘటన చరిత్ర. స్వదేశీ ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమం, అత్యంత నాటకీయంగా జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో విద్యార్థుల భాగస్వామ్యం ముఖ్యమైనది. వారు వలసవాద విద్యాసంస్థలను బహిష్కరించారు, ప్రదర్శనలు నిర్వహించారు, జాతీయవాద సాహిత్యాన్ని పంచారు. అరెస్టులు, జైలు శిక్షలను ఎదుర్కొ న్నారు. ప్రతిఘటన సందేశాన్ని పట్టణాలు, గ్రామాలకు మోసు కెళ్ళారు.. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో, వలస ప్రభుత్వం ప్రధాన నాయ కత్వాన్ని జైలులో పెట్టినప్పుడు, ఆ ఉద్యమాన్ని సజీవంగా ఉంచిన వారిలో విద్యార్థులు కూడా ఉన్నారు. బ్రిటిష్ రాజ్ అణచివేతలోనూ వారు ఊరేగింపులు నిర్వహించారు. అరెస్టులను నిరసించారు. రహస్య కార్యకలా పాలలో పాల్గొన్నారు.

ఈ సంప్రదాయం ఒకే రాజకీయ స్రవంతికి పరిమితం కాలేదు. విప్లవ, సామ్యవాద, గాంధేయ, కమ్యూనిస్టు సంప్రదాయాలతో సహా, విద్యార్థులు జాతీయ ఉద్యమంలోని వివిధ స్రవంతుల పట్ల ఆకర్షితులయ్యారు. సమాజ విధి నుంచి విద్యను వేరు చేయలేమనే ఎరుక వారిలో చాలా మందిని ఏకం చేసింది. యావత్తు దేశానికి స్వేచ్ఛను నిరాకరిస్తున్న సమయంలో ఒక విద్యార్థి మౌన ప్రేక్షకునిగా ఉండలేడు.

ఇలాంటి రాజకీయ వాతావరణంలోనే 1936 ఆగస్టులో లక్నోలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్) స్థాపించబడింది. ఇది దేశంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులను ఒకచోట చేర్చి, భారతదేశపు మొట్టమొదటి జాతీయ విద్యార్థి సంస్థగా అవతరించింది. గంగా ప్రసాద్ మెమోరియల్ హాల్‌లో జరిగిన వ్యవస్థాపక సమావేశానికి దేశ వ్యాప్తంగా వందలాదిమంది ప్రతినిధులు హాజరయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ ఈ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశానికి జాతీయ నాయకులు హాజరుకావడమే, స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థుల భాగస్వామ్యానికి ఎంత ప్రాముఖ్యత ఇచ్చారో ప్రతిబింబించింది. ముఖ్యంగా విద్యార్థులను జాతీయ ఉద్యమంలో ఒక ముఖ్యమైన శక్తిగా నెహ్రూ గుర్తించారు.

భగత్ సింగ్ కథ ఈ సంప్రదాయానికి మరింత లోతైన అర్థాన్ని ఇస్తుంది. భగత్ సింగ్ కేవలం అత్యున్నత త్యాగం చేసిన ఒక యువ విప్లవకారుడు మాత్రమే కాదు. రాజకీయ అవగాహన లేని సాహసం సమాజాన్ని మార్చలేదని గ్రహించిన ఒక రాజకీయ మేధావి ఆయన. ఆయన యువత భావజాల, మేధో వికాసానికి అపారమైన ప్రాధాన్యతనిచ్చారు. విద్యార్థులు, యువతపై రాసిన తన రచనలలో, విద్యార్థులు రాజకీయాలకు దూరంగా ఉండాలనే వలసవాద వాదనను ఆయన తిరస్కరించారు. ఆయన దృష్టిలో యువజన ఉద్యమం రాజకీయ విద్య, సంఘం, సామాజిక పరివర్తనకు ఒక పాఠశాలగా మారాలి.

1931లో తన ఉరిశిక్షకు కేవలం కొన్ని వారాల ముందు రాసిన ‘టు యంగ్ పొలిటికల్ వర్కర్స్ (యువ రాజకీయ కార్యకర్తలకు)’ అనే పత్రంలో, భగత్ సింగ్ కార్మికులు, రైతులలో అధ్యయన కూటములు, రాజకీయ విద్య, ప్రచారం, సంఘటిత కార్యాచరణ ఆవశ్యకతను నొక్కి చెప్పారు. యువత తాము వారసత్వంగా పొందిన సమాజాన్ని కేవలం వ్యతిరేకించడం కాకుండా, తాము నిర్మించాలనుకుంటున్న సమాజంపై స్పష్టతను పెంపొందించుకోవాలని ఆయన విశ్వసించారు. అందువల్ల ఆయన అమరత్వం కేవలం అసాధారణ వ్యక్తిగత ధైర్యసాహసాల చర్య మాత్రమే కాదు. అది సమూలంగా మెరుగైన భవిష్యత్తు కోసం ఆలోచించేందుకు, సంఘటితం కావడానికి, పోరాడేందుకు తరతరాల యువ భారతీయులకు ఒక ఆకర్షణ.

స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాలు విద్యార్థి ఉద్యమాల ఈ రాజకీయ స్వభావాన్ని పదేపదే నిర్ధారించాయి. విద్యార్థులు కేవలం ఫీజులు, పరీక్షలు లేదా హాస్టల్ సౌకర్యాల గురించే కాకుండా, ప్రజాస్వామ్యం, సమాఖ్య వాదం, భాష, సామాజిక న్యాయం, పౌర స్వేచ్ఛలు, దేశ గమనం వంటి ప్రశ్నలపై కూడా తిరుగుబాటు చేశారు. తమిళనాడులో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమాలలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అస్సాం ఉద్యమంలో విద్యార్థులు కీలకమైన సంస్థాగత పాత్ర పోషించారు. ఎమర్జెన్సీకి వ్యతి రేకంగా విద్యార్థులు నేతృత్వంలోని సమీకరణ, 1970వ దశాబ్దపు ప్రజా స్వామ్య ప్రతిఘటనలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచింది. క్యాంపస్ సరిహద్దులకు ఆవల ఉన్న ప్రశ్నలను చేపట్టిన సుదీర్ఘ చరిత్ర వామపక్ష విద్యార్థి సంఘాలకు కూడా ఉంది. అవి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడం, మతతత్వాన్ని, కుల అణచివేతను వ్యతిరేకించటం, కార్మికు లకు, రైతులకు మద్దతు ఇవ్వడం, నిరంకుశత్వాన్ని ప్రతిఘటించడం, ప్రజాస్వామ్య హక్కులను డిమాండ్ చేయడం వంటివి. అందుకే ‘విద్యార్థులు రాజకీయాల్లో ఎందుకు పాల్గొంటున్నారు?’ అని పదేపదే వచ్చే ప్రశ్న అసలు విషయాన్ని విస్మరిస్తుంది. విద్యార్థులు సమాజా నికి వెలపలి వారు కాదు. దాని రాజకీ య, ఆర్థిక నిర్ణయాలకు అత్యంత ప్రత్యక్షంగా ప్రభావితమయ్యే వారిలో వారు కూడా ఉన్నారు. విద్య వ్యాపారీ కరణ చెందినప్పుడు, విద్యార్థులు ప్రభావితమవుతారు. పరీక్షలు కలుషిత మైనప్పుడు, వారి భవిష్యత్తు ప్రభావితమవుతుంది. నిరుద్యోగం పెరిగినప్పుడు, వారి ఆకాంక్షలు దెబ్బతింటాయి. మత విద్వేషం తరగతి గదుల్లోకి, క్యాంపస్‌లలోకి ప్రవేశించినప్పుడు, నేర్చుకునే, ఆలోచించే వారి స్వేచ్ఛ దెబ్బ తింటుంది. ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడినప్పుడు, వారి భవిష్యత్తు ప్రభావి తమవుతుంది.

నేడు భారతదేశం అనేక రంగాలలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రభుత్వ విద్యారంగం పెరుగుతున్న ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. ప్రశ్నపత్రాల లీకేజీ, అవకతవకల ఆరోపణలు, ఉదంతాలతో పరీక్షా వ్యవస్థలు పదేపదే కుదిపివేయబడ్డాయి. యువత ఉపాధి, సురక్షితమైన జీవనోపాధి విషయంలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. మతపరమైన విభజన గణతంత్ర రాజ్య సామాజిక నిర్మాణానికి ముప్పుగా పరిణమించింది. ప్రజాస్వామ్య అసమ్మతి సైతం గౌరవించాల్సిన రాజ్యాంగ హక్కుగా కాకుండా, తరచుగా అదుపు చేయాల్సిన సమస్యగా పరిగణిస్తున్నారు. అధికారంలో ఉన్నవారి నుండి జవాబుదారీతనాన్ని రాబట్టడం నానాటికీ క్లిష్టంగా మారుతోంది.

అయినప్పటికీ, ఆశను నిరాశవాదం సులభంగా కమ్మేసిన తరుణంలో విద్యార్థులు మరోసారి ముందుకు వచ్చారు.

పరీక్షా అవకతవకలు, నీట్ సంక్షోభంపై ఇటీవల జరిగిన విద్యార్థి ఉద్యమం సామూహిక కార్యాచరణ శక్తిని ప్రదర్శించింది. విద్యార్థులు ఎదుర్కొంటున్న తక్షణ అన్యాయంపై ఆగ్రహంతో ప్రారంభమైన ఈ ఉద్యమం, జవాబుదారీతనం, పారదర్శకత, సంస్కరణల కోసం విస్తృతమైన డిమాండ్‌గా రూపుదిద్దుకుంది. నికరంగా సాగిన ఈ ఉద్యమం చివరకు జూలై 25న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసింది. ఢిల్లీ, ఇతర ప్రాంతాలలో వారాల తరబడి జరిగిన నిరసనల అనంతరం ఆయన రాజీనామా చేశారు. ఆయన వైదొలగడమే ఈ ఉద్యమంలో ప్రధాన డిమాండ్‌గా ఉంది.

ఆ సంఘటన ప్రాముఖ్యత కేవలం ఒక మంత్రి రాజీనామాకు మాత్రమే పరిమితం కాదు. ఏ తప్పూ జరగదనే ప్రతిష్టను తరచుగా ప్రదర్శిస్తూ, విమర్శలను అసాధారణమైన ఆత్మవిశ్వాసంతో కొట్టిపారేసే ప్రభుత్వానికి, నిరంతర విద్యార్థి ఉద్యమం ఒత్తిడితో ఒక మంత్రి రాజకీయ బాధ్యతను స్వీకరించ వల సి రావడం అనేది జవాబుదారీతనం వహించిన ఒక అరుదైన సందర్భం. ప్రజలు సంఘటితమైనప్పుడు అధికారం అజేయం కాదని ఇది నిరూపిస్తుంది.

కానీ, రాజీనామా అనేది పోరాటానికి ముగింపు కాకూడదు. అది ఒక పెద్ద ప్రజాస్వామ్య సమీక్షకు నాంది పలకాలి.

*విద్యార్థులు లేవనెత్తిన ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి. పరీక్షల సమగ్రతకు ఎవరు హామీ ఇస్తారు? ప్రశ్నాపత్రాల లీకులు, అవకతవకలు, ఏకపక్ష నిర్ణయాల నుంచి విద్యార్థులను ఎవరు కాపాడతారు? ప్రభుత్వ విద్య అందరికీ అందుబాటులో, ప్రజాస్వామ్యయుతంగా ఉండేలా ఎవరు నిర్ధారిస్తారు? శ్రామిక శక్తిలోకి ప్రవేశిస్తున్న లక్షలాది మందికి గౌరవప్రదమైన ఉపాధి అవకాశాలను ఎవరు కల్పిస్తారు? విశ్వవిద్యాలయాలను భావజాల నియంత్రణ సాధనాలుగా కాకుండా, స్వేచ్ఛా ఆలోచనలకు వేదికలుగా ఎవరు కాపాడతారు? అన్నింటికన్నా ముఖ్యంగా, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం అనే రాజ్యాంగ వాగ్దానాన్ని ఎవరు పరిరక్షిస్తారు?*

ఈ ప్రశ్నకు సమాధానం కేవలం ప్రభుత్వాల నుండి మాత్రమే రాదు. అది సమాజం నుండి, సంఘటిత ప్రజల నుండి, కార్మికులు, రైతుల నుండి, మహిళలు మరియు అణగారిన వర్గాల నుండి, మరియు ముఖ్యంగా, భారతదేశ విద్యార్థులు మరియు యువత నుండి రావాలి. అది ప్రస్తుత తరం విద్యార్థుల చారిత్రక బాధ్యత. నేడు సవాలు భిన్నంగా ఉంది. కానీ అంతర్లీన సూత్రం మాత్రం అదే. ఈ పోరాటం విదేశీ వలస శక్తికి వ్యతిరేకంగా ఇంకెంతమాత్రం కాదు. రిపబ్లిక్ ప్రజాస్వామ్య, రాజ్యాంగ పునాదులను నిర్వీర్యం చేయాలని చూసే శక్తులకు, మత విభజన, నిరంకుశత్వం, అసమానత, నిరుద్యోగం, ప్రభుత్వరంగ ప్రైవేటీకరణ, సంస్థాగత జవాబుదారీతనం క్షీణించటానికి వ్యతిరేకంగా ఉద్యమం సాగుతోంది.

కాబట్టి, విద్యార్థుల ముందున్న కర్తవ్యం కేవలం మెరుగైన పరీక్షలను డిమాండ్ చేయడం మాత్రమే కాదు. వారి పూర్వీకులు దేన్ని సృష్టించడానికి పోరాడినారో ఆ భారతదేశ భావనను పరిరక్షించడం వారి కర్తవ్యం.

ప్రస్తుత విద్యార్థి ఉద్యమాన్ని ఉధృతం చేసి, విస్తృతం చేసి, ముందుకు తీసుకువెళ్లాలి. దాని తక్షణ డిమాండ్‌లను నెరవేర్చడంతో పాటు, దాని రాజకీయ చైతన్యం లోతు మరింత పెరగాలి. విద్యార్థులు తమ క్యాంపస్‌లను దాటి కార్మికులు, రైతులతో సంఘీభావం పెంచుకోవాలి, దళితులు, గిరిజనులు, వివక్షను ఎదుర్కొంటున్న మహిళలకు అండగా నిలబడాలి. ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలి. రాజ్యాంగ ప్రజాస్వామ్యం కోసం ఒక క్రియాశీల శక్తిగా మారాలి. ఇక్కడే భగత్ సింగ్ వారసత్వం ప్రత్యేకించి ప్రాసంగికత కలిగి ఉంది. ఆయన సందేశం కేవలం ఆగ్రహించటం కాదు. దానిని చదవటం, అర్థం చేసుకోవటం, సంఘటితం కావడం, కార్యాచరణ చేపట్టటం. ధైర్యాన్ని రాజకీయ స్పష్టతతో కలిపినప్పుడు యువత దేశానికి అంతరాత్మగా మారగలదని ఆయన తరం భారతదేశానికి నేర్పింది.

తమలో ఆ ధైర్యం ఉందని నేటి విద్యార్థులు ఇప్పటికే నిరూపించారు. బెదిరింపులు ఎదురైనా వారు ఐక్యంగా నిలబడ్డారు. వారు అన్యాయాన్ని సాధారణమైనదిగా అంగీకరించడానికి నిరాకరించారు. శక్తిమంతులను జవాబుదారీగా చేయవచ్చని వారు నిరూపించారు. ఇప్పుడు వారి పోరాటం ఒక పరీక్షకు, ఒక మంత్రిత్వ శాఖకు లేదా ఒక ప్రభుత్వ నిర్ణయానికి మించి విస్తరించాలి. భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో, స్వాతంత్ర్యం అనే అసంపూర్ణ కార్యం ఒక కొత్త రూపంలో మన ముందు కొస్తోంది. స్వాతంత్ర్య పోరాటం భారతదేశాన్ని వలస పాలన నుండి విముక్తి చేసింది. మన తరం ప్రజాస్వామ్య పోరాటం భారతదేశాన్ని భయం, ద్వేషం, అసమానత, నిరంకుశత్వం నుండి విముక్తి చేయాలి.

ఒకప్పుడు బ్రిటిష్ రాజ్‌కు వ్యతిరేకంగా కవాతు చేసిన విద్యార్థులు రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించడంలో సహాయపడ్డారు. నేటి విద్యార్థులు గణతంత్రాన్ని తిరిగి పొందేందుకు, ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపిరాజ్‌ను ఓడించేందుకు జరిగే పోరాటానికి నేతృత్వం వహించడంలో సహాయపడ గలరు.

భవిష్యత్తు ముందస్తుగా నిర్ణయించబడదు. ప్రజలు సంఘటితమైనప్పుడు, యువత ఆశను వదులుకోవడానికి నిరాకరించినప్పుడు,ఒక తరం తాము వారసత్వంగా పొందే దేశం, తమను వెనక్కుపెట్టే దేశం కాకూడదని నిర్ణయించుకున్నప్పుడు చరిత్ర సృష్టించబడుతుంది. భారతదేశానికి ఇప్పుడు ఆ తరం అవసరం. మరోసారి, విద్యార్థులే ముందు వరుసలో ఉన్నారు.

# నేతల నోటి నుంచి నిప్పురవ్వలు... తెలంగాణ కాంగ్రెస్‌కు అంతర్గత చిక్కులు

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి బయట ప్రతిపక్షాల సవాళ్లకంటే ఇంటి వద్ద పోరే తలనొప్పిగా మారుతోందా? అధికార పక్షానికి చెందిన ముఖ్య నేతలే బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, అధిష్టానం దృష్టికి ఫిర్యాదులు వెళ్లడం వంటి పరిణామాలు పార్టీ అంతర్గత వ్యవహారాలను మరోసారి తెరపైకి తెచ్చాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజకీయ శైలి, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య చోటుచేసుకుంటున్న వివాదం, తాజాగా సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రిపై నోరుపారేసుకోవటం, వనపర్తి రాజకీయాల్లో పార్టీ సీనియర్ నేత ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి మధ్య నెలకొన్న విభేదాలు.. ఇవన్నీ కలిపి చూస్తే తెలంగాణ కాంగ్రెస్‌లో నాయకుల మధ్య సమన్వయం ఎంతవరకు ఉందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

తెలంగాణ కాంగ్రెస్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కీలక రాజకీయ ముఖం, ఈ నేత సందర్భానుసారంగా చేసే వ్యాఖ్యలు పార్టీ అధికారిక వైఖరితో ఎంతవరకు సరిపోతున్నాయన్న చర్చ తరచూ జరుగుతోంది.. ఇటీవల ఇతను చేసిన ఆరోపణలను బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా ప్రస్తావించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అధికార పార్టీ ఎమ్మెల్యే నుంచి ప్రభుత్వంపై ఆరోపణలు వస్తున్నాయంటూ బిఆర్‌ఎస్ దీన్ని కాంగ్రెస్‌పై దాడికి రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకుంటోంది. ఇక్కడ సమస్య ఒక్క నేత వ్యాఖ్యలకే పరిమితం కాదు. అధికార పార్టీలో ఉన్న నేతలు తమ అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేసి ప్రతిసారి దాన్ని ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది.

దేవాదాయ శాఖకు సంబంధించిన సమీక్ష విషయంలో కడియం శ్రీహరి తనకు సమాచారం ఇవ్వకుండా అధికారులతో సమావేశం నిర్వహించారని మంత్రి కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఆమె ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేయడంతో పాటు పార్టీ నాయకత్వం దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వార్తలు వచ్చాయి. తర్వాత వివాదం మరింత ముదిరింది. కడియం శ్రీహరిపై చర్యలు తీసుకోవాలని సురేఖ టిపిసిసి అధ్యక్షుడికి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇద్దరి మధ్య మాటల యుద్ధం కూడా తీవ్ర స్థాయికి చేరింది. ఇది కేవలం ఇద్దరు నాయకుల వ్యక్తిగత విభేదంగా కొట్టిపారేయలేని పరిస్థితి. ఒకే పార్టీకి చెందిన మంత్రి, ఎమ్మెల్యే మధ్య సమన్వయం లేకపోతే దాని ప్రభావం కేడర్‌పై, జిల్లా రాజకీయాలపై పడే అవకాశం ఉంది.

ఉమ్మడి పాలమూరు రాజకీయాల్లో సీనియర్ నేత, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మధ్య నెలకొన్న విభేదాలు కూడా కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారుతున్నాయి. వనపర్తిలో ఇప్పుడు అసలు ప్రశ్న ఎవరు సరైనవారు అన్నదానికంటే ఈ వివాదం వల్ల కాంగ్రెస్‌కు రాజకీయంగా ఎంత నష్టం జరుగుతుందన్నదే.

తెలంగాణ కాంగ్రెస్‌లో కనిపిస్తున్న పరిణామాలను కేవలం వ్యక్తిగత విభేదాలుగా చూడటం ఒక కోణం మాత్రమే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ పార్టీల నుంచి పలువురు నాయకులు ఆ పార్టీలోకి వచ్చారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో ఉన్న సీనియర్లు, కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతలు, తమ తమ నియోజకవర్గాల్లో బలమైన రాజకీయ పునాదులు కలిగిన నాయకులు ఇవన్నీ ఒకే వ్యవస్థలో పని చేయాల్సి వచ్చింది. అక్కడే సమన్వయం కీలకంగా మారింది. పార్టీలో ప్రతి నాయకుడికి రాజకీయ ప్రాధాన్యం ఉండవచ్చు. కానీ ప్రభుత్వం, పార్టీ రెండింటికి ఒక స్పష్టమైన కమాండ్ వ్యవస్థ ఉండాల్సిందే. ఆ వ్యవస్థ బలహీనంగా కనిపిస్తే ప్రతి నాయకుడి వ్యాఖ్య ఒక రాజకీయ వివాదంగా మారే అవకాశం ఉంటుంది.

అధికార పార్టీకి సాధారణంగా ప్రతిపక్షాల విమర్శలు తప్పవు. కానీ అధికార పార్టీలోని నాయకుల వ్యాఖ్యలనే ప్రతిపక్షాలు ప్రధాన ఆయుధంగా ఉపయోగించుకోవడం మాత్రం పార్టీకి రాజకీయంగా ఇబ్బందికర పరిణామం. ఇటీవల రాజగోపాల్‌డ్డి వ్యాఖ్యలను కెటిఆర్ ప్రస్తావించడం దీనికి ఉదాహరణగా నిలుస్తోంది. కాంగ్రెస్ అంతర్గత వ్యాఖ్యలను బిఆర్‌ఎస్ తన రాజకీయ ప్రచారంలో ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తోంది. అంటే కాంగ్రెస్ నేతలు మాట్లాడే ప్రతి మాట ఇక వ్యక్తిగత వ్యాఖ్యగా మిగలడం లేదు. అది వెంటనే సోషల్ మీడియా, ప్రతిపక్ష రాజకీయ ప్రచారంలో భాగమవుతోంది. నాయకులు బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటే మొదట ప్రభావితమయ్యేది కిందిస్థాయి కార్యకర్తలే. ఎవరిని అనుసరించాలి? ఎవరి మాట పార్టీ అధికారిక వైఖరి? నియోజకవర్గంలో ఎవరికి ప్రాధాన్యం? అనే ప్రశ్నలు కేడర్‌లో తలెత్తే అవకాశం ఉంటుంది.

**రేవంత్ నాయకత్వానికి అసలు పరీక్ష :** ఇప్పటి వరకు కాంగ్రెస్‌లోని అనేక విభేదాలు స్థానిక స్థాయిలో పరిష్కరించుకునే ప్రయత్నాలు జరిగాయి. కానీ వివాదాలు పదేపదే బహిరంగమైతే వాటిని నియంత్రించడం పార్టీ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారుతుంది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందు న్న ప్రధాన రాజకీయ సవాళ్లలో ఒకటి ప్రభుత్వ పాలనతో పాటు పార్టీ అంతర్గత సమన్వయాన్ని కూడా బలపరచడం. మంత్రి, ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు అనే తేడా లేకుండా పార్టీకి ఒకే రాజకీయ క్రమశిక్షణ ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిణామాలను చూసి తెలంగాణ కాంగ్రెస్ పూర్తిగా సంక్షోభంలో ఉందని చెప్పడం తొందరపాటు. అధికారం లో ఉన్న పార్టీకి సహజంగానే అనేక వర్గాలు, వ్యక్తిగత రాజకీ య ఆకాంక్షలు ఉంటాయి. అయితే అవి బహిరంగ విభేదాలుగా మారినప్పుడే అసలు సమస్య మొదలవుతుంది.తెలంగాణలో కాంగ్రెస్ అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే కేవలం ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సరిపోవు. పార్టీ అంతర్గత ఐక్యత కూడా అంతే ముఖ్యం. సీనియర్లకు గౌరవం.. కొత్త నాయకత్వానికి అవకాశం. నియోజకవర్గాల్లో స్పష్టమైన బాధ్యతలు, నేతల మధ్య సమన్వయం, వివాదాలు బహిరంగం కాకుండా పార్టీ వేదికపైనే పరిష్కారం ఇవన్నీ బలపడాల్సిన అవసరం ఉంది.

**జి.మధు,** వనపర్తి



## కార్మిక వ్యతిరేక బిజెపి ప్రభుత్వంపై
# కార్మిక లోకం కదం తొక్కాలి

- ఎఐటియుసి రాష్ట్ర మహాసభల బహిరంగ సభకు వేలాదిగా తరలిరండి
- ఎఐటియుసి రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ విడుదల
- ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్మిక హక్కులు, చట్టాలను మార్చేందుకు తీవ్రంగా ప్రయత్నం చేస్తుందని, వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం కార్మికంలోకంపై ఎంతైనా ఉందని ఎఐటియుసి రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎఐటియుసి రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను నాయకులతో కలిసి చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలుస్తున్న ఎఐటియుసి శ్రమకు తగ్గ ఫలితం కావాలని, పని గంటలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని, కనీస వేతనాల కోసం నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందని, ఎంతోమంది కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపి అనేక చట్టాలు తీసుకువచ్చిన కార్మిక సంఘమని, కార్మిక చట్టాలు,హక్కులను కాపాడిన సంఘం ఎఐటియుసి అన్నారు. కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న సమ్మె చేసే హక్కును కూడా కాలరాయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందని, కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న బిజెపి ప్రభుత్వంపై ఉద్యమించాలని, కార్మిక చట్టాలను సంస్కరణల పేరుతో రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల పొట్టలు కొడుతున్న నరేంద్ర మోడీకి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం కార్మిక లోకం చెప్పాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో సెప్టెంబర్ 6,7,8 తేదీలలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి నాలుగవ మహాసభలను విజయవంతం చేయడానికి మొదటి రోజు జరిగే బహిరంగ సభకు వేలాదిగా కార్మిక వర్గం తరలిరావాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు పంజాల శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, టేకుమల్ల సమ్మయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, న్యాలపట్ల రాజు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు వెల్దండి దామోదర్, రజిత, పిట్టల సమ్మయ్య, కడారి బీరయ్య, కాశెట్టి లక్ష్మణ్, జంగ తిరుపతి,పిట్టల శ్రీనివాస్, జక్కుల ఆగయ్య,దాసరి ప్రభాకర్, రాకేష్, కెమ్మసారం శ్రీనివాస్,అల్లేపు రాజు,మొగిలిపాలెం మల్లేశం,పోచయ్య,లక్ష్మణ్,కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# కంట్రోల్ కమిషన్లు కీలకం

## డి.రాజా, నారాయణ



**న్యూఢిల్లీ:** సిపిఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ (సిసిసి), రాష్ట్ర కంట్రోల్ కమిషన్ల (ఎస్‌సిసి) చైర్మన్, కార్యదర్శుల రెండు రోజుల సదస్సు ఈనెల 17, 18 తేదీల్లో ఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో జరిగింది. ఆరుగురు కేంద్ర కంట్రోల్ కమిషన్ ప్రతినిధులు సహా 15 రాష్ట్రాల నుంచి 23 మంది హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, బీహార్, రాజస్థాన్, ఢిల్లీ, పుదుచ్చేరి, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, పంజాబ్, హర్యానా, అసోం, మణిపూర్, పశ్చిమ బెంగాల్, ఒడిశా నుంచి ప్రతినిధులు భాగస్వాములయ్యారు. 17వ తేదీన సిసిసి చైర్మన్ డాక్టర్ కె.నారాయణ సదస్సు ప్రారంభించారు. తన ప్రారంభోపన్యాసంలో ఈ సదస్సు ఉద్దేశాన్ని వివరించారు. పార్టీలో క్రమశిక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, కంట్రోల్ కమిషన్ల పనితీరుకు సంబంధించి ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు కోరారు. కంట్రోల్ కమిషన్‌కు సంబంధించిన ముసాయిదా నివేదిక, ముసాయిదా నియమ నిబంధనలను సిసిసి కార్యదర్శి రామ్ బాహెటి ప్రవేశపెట్టారు. ముసాయిదా నియమాలపై ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించి... విలువైన సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆమోదం తెలిపారు. రాష్ట్ర కంట్రోల్ కమిషన్ల పని విధానంపైనా సుదీర్ఘంగా చర్చ జరిగింది. వారి వారి కార్యకలాపాల గురించి ఆయా రాష్ట్రాల ప్రతినిధులు నివేదించారు. అనుభవాలు పంచుకున్నారు. సిసిసి నిబంధనలు రాష్ట్ర కంట్రోల్ కమిషన్లకూ వర్తిస్తాయని...అవి సొంతంగా నియమాలను ప్రాథమిక సూత్రాలాధారంగా రూపొందించుకోవచ్చని నిర్ణయించారు. రెండవ రోజు సభలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడారు. పార్టీలో కంట్రోల్ కమిషన్లకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ప్రత్యేకించి పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన వ్యవహారాల్లో వీటికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు. పటిష్ఠ కమిషన్లు పార్టీకి బలమని డి.రాజా అన్నారు. పార్టీని బలపర్చుకోవాలని, వివిధ స్థాయిల్లో పార్టీ శ్రేణులను ప్రోత్సహించాలని, వారిని అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే, నారాయణ ముగింపు సందేశమివ్వగా... రామ్ బాహెటి వందన సమర్పణ చేశారు.

## రాజీవ్ గాంధీ దార్శనికతతోనే
# ఆధునిక భారత నిర్మాణం

**శ్రీపెరంబుదూరులో రాజీవ్ గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కీ.శే.మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో ఉన్న రాజీవ్ గాంధీ మెమోరియల్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఘనంగా నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో రాజీవ్‌గాంధీ అందించిన సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాజీవ్ గాంధీ తన దార్శనికత, ఆధునిక ఆలోచనలతో భారతదేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించారని కొనియాడారు. ముఖ్యంగా సాంకేతిక, టెలికాం రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ఆయన పునాది వేశారని పేర్కొన్నారు. కంప్యూటర్లు, ఐటి రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయాలు నేటి డిజిటల్ భారత నిర్మాణానికి బలమైన పునాదిగా నిలిచాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, టెలికాం రంగాన్ని గ్రామస్థాయి వరకు విస్తరించేందుకు, రాజీవ్ గాంధీ కృషి చేశారని భట్టి విక్రమార్క తెలిపారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఓటింగ్ వయసును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని ఆయన అన్నారు. స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేసేందుకు పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ బద్ధత కల్పించే దిశగా ఆయన కీలకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించడం ద్వారా మహిళా సాధికారతకు కూడా బాటలు వేశారని చెప్పారు. విద్యా రంగానికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందని భట్టి విక్రమార్క తెలిపారు. 1986లో జాతీయ విద్యా విధానాన్ని తీసుకురావడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. సాంకేతికత, విద్య, ప్రజాస్వామ్యం, స్థానిక పాలన వంటి కీలక రంగాల్లో రాజీవ్ గాంధీ చేపట్టిన సంస్కరణలు ఆధునిక భారతదేశ నిర్మాణంలో చిరస్థాయిగా నిలిచిపోయాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

## నేటి నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు : పొంగులేటి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లాల వారీగా సమీక్షా కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సమీక్షలు కేవలం అధికారిక సమావేశాలకే పరిమితం కాకుండా, భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, పరిష్కార మార్గాలు చూపే విధంగా రూపొందించారని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు సమీపంలోని జిల్లాల సమీక్షలను నగర కేంద్రంగానే నిర్వహించనుండగా, దూర ప్రాంత జిల్లాలకు మంత్రి స్వయంగా వెళ్లి అక్కడే సమావేశాలు నిర్వహించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లతో సహా సంబంధిత శాఖల అధికారులంతా ఈ సమీక్షల్లో పాల్గొననున్నారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా భాగస్వాములను చేసి, ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, స్థానిక అవసరాలను నేరుగా తెలుసుకునేలా మంత్రి ఈ సమీక్షలకు రూపకల్పన చేశారన్నారు. రెవెన్యూ అంశాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, ఇతర హౌసింగ్ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థలాల సమస్యలు వంటి అంశాలను కూడా జిల్లా సమీక్షల సందర్భంగా మంత్రి పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. ఆ మరుసటి రోజు, శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్షను జిల్లా కేంద్రంలో చేపట్టనున్నారు. ఈ వరుస సమీక్షల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, హౌసింగ్ సమస్యలకు వేగంగా పరిష్కారం చూపాలన్నది మంత్రి లక్ష్యంగా నిర్ధేశించుకున్నారు. కనిపిస్తోంది.

## ఎస్‌సిల ఆత్మగౌరవానికి ప్రతీకగా
# అత్యాధునిక భవనం

### లోయర్ ట్యాంక్‌బండ్‌లో పాత భవనం స్థానంలో సెల్లార్+జీ+10 అంతస్తులు
### రూ.108 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డా.బిఆర్ అంబేద్కర్ ఆశయాలైన సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవాన్ని ఆచరణలోకి తీసుకువచ్చే దిశగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్‌లోని పాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనం స్థానంలో రూ.108 కోట్లతో డా. బిఆర్ అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణానికి పరిపాలనా అనుమతి మంజూరు చేసింది.ఈ మేరకు ఎస్‌సి అభివృద్ధి శాఖ జారీ చేసింది. కొత్త టవర్‌ను ఒక సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మరో 10 అంతస్తులతో నిర్మించనున్నారు.

**12 ఏళ్లుగా నిరుపయోగంగా పాత భవనం**

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ప్రస్తుత జి+1 డాక్టర్. బిఆర్ అంబేద్కర్ భవనం చాలా కాలంగా పాతబడి శిథిలావస్థకు చేరింది. సుమారు 12 ఏళ్లుగా భవనం వినియోగంలో లేకపోవడంతో నిర్వహణ కూడా సక్రమంగా జరగలేదు. భవనం నిర్మాణ సంవత్సరం, ప్రస్తుత నిర్మాణ స్థితిని పరిశీలించిన ఆర్అండ్‌బి అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి కొత్త నిర్మాణానికి రూ.108 కోట్ల సవరించిన అంచనాలను ప్రభుత్వానికి సమర్పించారు. దీంతో 2026–27 ఆర్థిక సంవత్సరానికి అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణం కోసం రూ.25 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. ప్రాజెక్టుకు సంబంధించి తదుపరి చర్యలు చేపట్టాలని ఎస్‌సిల అభివృద్ధి శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ పరిపాలనా అనుమతికి ఆర్థిక శాఖ సమ్మతి కూడా లభించింది.

**నిపుణుల పర్యవేక్షణలో రూపకల్పన**

టవర్ నిర్మాణానికి అవసరమైన ఆర్కిటెక్చరల్, స్ట్రక్చరల్ కన్సల్టెన్సీ సేవలను వినియోగించనున్నారు. శాఖ అవసరాలకు అనుగుణంగా అంతస్తుల ప్రణాళిక, ఎలివేషన్లు, నిర్మాణ రూపకల్పనను ఖరారు చేసి ప్రాజెక్టును వేగంగా కార్యరూపంలోకి తీసుకురానున్నారు.

**అంబేద్కర్ ఆశయాల సాధనలో మరో ముందడుగు : మంత్రి అడ్లూరి**

అంబేద్కర్ ఆశయాల సాధనలో మరో ముందడుగు అని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు... డా.బిఆర్ అంబేద్కర్ ఆశయాలను కేవలం స్మరించుకోవడం కాకుండా వాటిని ఆచరణలోకి తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఎస్‌సిల విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక అభివృద్ధి, మౌలిక వసతుల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎస్‌సి విద్యార్థులు విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.అంబేద్కర్ పేరు కేవలం ఒక భవనానికి సంబంధించినది కాదని, అది సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవానికి ప్రతీక. ఆధునిక సౌకర్యాలతో నిర్మించనున్న అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ ఎస్‌సి అభివృద్ధి కార్యక్రమాలకు ఒక బలమైన కేంద్రంగా నిలిచేలా చర్యలు తీసుకుంటాం అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎస్‌సిల సాధికారతకు అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్ తరాలకు అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని చేరువ చేసేలా ఈ టవర్‌ను తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు.

## రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ జయంతిని దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం, ఐక్యతను పెంపొందించాలనే సందేశంతో జరుపుకునే సద్భావనా దినోత్సవం ప్రజలందరికీ ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుంది. 'సమైక్యతే మన శక్తి – సద్భావనే మన ప్రగతి' అనే స్ఫూర్తితో రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని, శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వంతో కూడిన బలమైన భారతదేశ నిర్మాణానికి మన వంతు కృషి చేద్దాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

**ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాజీవ్ గాంధీ 82 జయంతి ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్‌గాంధీకి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సోమాజిగూడతో పాటు సచివాలయం ఎదురుగ ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికీ పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**రాజీవ్‌గాంధీ సద్భావన రన్**

రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ సలహాదారులు. వి.హనుమంతరావు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ సద్భావన రన్ నిర్వహించారు. ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో విద్యార్థి విద్యార్థులు పాల్గొని ర్యాలీగా తరలివచ్చారు పలువురు ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అంతకు ముందుగా వి.హనుమంతరావు, టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గా రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎం పి ఎం.అనిల్ కుమార్ యాదవ్, రైతు కమిషన్ సభ్యులు ఎ. రాములు నాయక్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్..ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్.ఫెరోజ్ ఖాన్, రాజయ్య, దీపక్ జాన్ కాలేద్ సైఫుల్ల బొల్లు కిషన్, ఆర్ లక్ష్మణ్ యాదవ్, అప్సర్ యూసుఫ్ జాయి, శ్రీకాంత్‌గౌడ్‌లు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ ఈ రోజు భారతదేశంలో ఐటి రంగాన్ని అభివృద్ధి ఘనత రాజీవ్ గాంధీదే అన్నారు. గతంలో యువతకు 21 సంవత్సరాలకు ఓటు హక్కుని 18 సంవత్సరాలు చేసిన ఘనత కూడా రాజీవ్ గాంధీదేఅని అన్నారు.

## కొండా సురేఖ కూతురు సుస్మిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

### టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పార్టీ నిబంధనలు ఎవరు ఉల్లంఘించిన చర్య లు తీసుకుంటామని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. కొండ సురేఖ మాట్లాడిన చిన్నారెడ్డి మాట్లాడిన పార్టీ లైన్ దాటి మాట్లాడినప్పుడు క్రమశిక్షణ కిందకు వస్తారన్నారు. గురువారం జిల్లా కేంద్రంతో మీడియాతో మాట్లాడుతూ కొండ సురేఖ ఏళ్ల తరబడి రాజకీయాల్లో ఉన్నారని, ఆమెపై మా అందరికి గౌరవముందన్నారు. పార్టీ లైన్ దాటి కొండ సురేఖ కూతురు సుస్మిత మాట్లాడిన మాటలు బాధాకరమన్నారు. ఈ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని, కొండ సురేఖ బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్నందున ఆమెను వివరణ కోరటం జరిగిందన్నారు. వివరణ అనంతరం ఎలాంటి చర్యలు తీసుకోవాలో పార్టీ నిర్ణయం తీసుకుంటుదని ఈ సందర్భంగా తెలిపారు. చిన్నారెడ్డి కూడా సీనియర్ నాయకులని, అందరూ గౌరవించదగ్గ నాయకుడని ఆయన ఎందుకు అలా మా ట్లాడారు. ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని వివరణ కోరామన్నారు. పార్టీ కి సంబంధించిన నిబంధనలు ఉల్లంఘించినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది డిసిప్లినరీ కమిటీతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎవరికి టికెట్ ఇవ్వాలన్నది ఐకమాండ్ నిర్ణయిస్తుందని, నాకు టికెట్ ఇవ్వల్సి వచ్చిన అది పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. ఎలక్షన్ కమిటీ, సిడబ్ల్యుసి నిర్ణయం మేరకే సీట్ల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీలో ఎవరికి వారు ఈ సీటు మాదేనని ప్రకటించుకోవటం సరైంది కాదని సూచించారు.

## మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్‌డి సుమంత్‌పై హత్యాయత్నం కేసు

### ఇనుప రాడ్లతో దాడి చేశారంటూ గొంగడి హరికృష్ణ ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్‌డి సుమంత్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. గొంగడి హరికృష్ణ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సుమంత్‌తోపాటు మరో ఐదుగురిపై కేసు నమోదైనట్లు సమాచారం. ఫిర్యాదుదారుడిపై ఇనుప రాడ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం రాజకీయ, పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హరికృష్ణ తనపై సుమంత్ అనుచరులతో కలిసి రాడ్లతో దాడి చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. దాడి వెనుక హత్యాయత్నం ఉద్దేశం ఉందని ఆయన ఆరోపించినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదు ఆధారంగా మేడిపల్లి పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) సెక్షన్ 109 కింద కేసు నమోదు చేసినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. ఘటనకు సంబంధించిన పరిధి విషయంలో మేడిపల్లి పోలీసులు తొలుత జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు సమాచారం. అనంతరం కేసును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు సమాచారం. కేసులో సుమంత్‌తో పాటు మరో ఐదుగురి పాత్రపై పోలీసులు దర్యాప్తు చేయనున్నారు. ఇదిలా ఉండగా, కేసు నమోదు కావడం మాత్రమే నిందితులపై ఆరోపణలు రుజువైనట్లు కాదని, దర్యాప్తులో వెలుగులోకి వచ్చే ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఓ అధికారి తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# దశదిన కర్మకు వెళ్లి.. అనంత లోకాలకు

- అతి వేగంతో అదుపు తప్పి బావిలోకి దూసుకెళ్లిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన దంపతులు, ఇద్దరు చిన్నారులు మృతి





**ప్రజాపక్షం/దుబ్బాక:** అతివేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన ఘటన సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామ శివారులో చోటుచేకుంది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. దుబ్బాక ఎస్ఐ కీర్తిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... దుబ్బాక మండలం బల్వంతా పూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (33) ఇసుక వ్యాపా రం చేస్తూ భార్య ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. సిద్ధిపేటలో ఇటీవల మృతి చెందిన బావ దశదిన కర్మకు బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళ్లాడు కార్యక్రమం అనంతరం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి స్వ గ్రామానికి తిరిగి వస్తుండగా అప్పనపల్లి గ్రామ శివారులో కారు అతివేగంతో అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న రాజు తో పాటు ఆయన భార్య భాగ్యలక్ష్మీ (25) పిల్ల లు నేహాన్స్(4), శాన్విక(2) మృతి చెందారు. రాజు ప్రయాణిస్తున్న కారు బల్వంతాపూర్‌కు చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు గురయ్యారు. రాత్రి 10:30 గంటల సమయంలో అప్పనపల్లి శివారులో వాహనం ఉన్నట్లు సెల్ ఫోన్ టవర్ లొకేషన్ ద్వారా పోలీసులు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించగా రహదారి పక్కన ఉన్న బావిలో కారు పడిపోయినట్లు గుర్తించారు. దుబ్బాక సిఐ రాజేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ కీర్తిరాజ్ , పోలీసు సిబ్బంది, అగ్నిమాపక శాఖ సిబ్బంది సుమారు మూడు గంటల పాటు శ్రమించారు. క్రేన్ సహాయంతో బావిలో పడిన కారును బయటకు తీశారు. కారులో లభించిన నలుగురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న సిద్దిపేట సిపి రశ్మి పెరుమాళ్, ఎసిపి రవీందర్‌రెడ్డి గురువా రం ఉదయం దుబ్బాక వంద పడకల ఆసుపత్రి మార్చురీని సందర్శించారు. మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆనంతరం ప్రమాదం జరిగిన బావిని కూడా పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వివరాలు వెల్లడిస్తామని సిపి తెలిపారు. మృతుడి అన్న యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుబ్బాక ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.


**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 29/EE/Cir-36/KZ/GHMC/2026-27, Dt: 18.08.2026 | 1 నెం. నిర్వహణ పనులు | రూ. 13.75 లక్షలు | ప్రారంభం: 20.08.2026 ఉ.10.30గం.ల నుండి / ముగింపు: 24.08.2026 ఉ.10.30గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-36, కె.జెడ్, జిహెచ్ఎంసి, ఖైరతాబాద్. ఫోన్ నెం. 9989930414 |
| | 1 నెం. సివిల్ పనులు | | ప్రారంభం: 20.08.2026 ఉ.10.30గం.ల నుండి / ముగింపు: 27.08.2026 ఉ.10.30గం.ల వరకు | |
| మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://tender.telangana.gov.in లో చూడవచ్చు. | | | | కమిషనర్, జిహెచ్ఎంసి. |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-36, (కెజెడ్) జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 8347-PP/CL/ADVT/2026-27, Date: 20-08-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
డైరెక్టర్ (అర్బన్ బయోడైవర్సిటీ) కార్యాలయం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఎన్ఎసి క్యాంపస్, ఇజ్జత్‌నగర్, కొత్తగూడ పోస్ట్, హైదరాబాద్.

| Sl. No. | నోటిఫికేషన్ నంబర్ | పని పేరు | దరఖాస్తుల డౌన్‌లోడ్ తేదీ & సమయం | దరఖాస్తుల సమర్పణకు ఆఖరి తేదీ & సమయం | దరఖాస్తుల సమర్పణ వేదిక | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|---|
| 1 | టెండర్ నెం. 04/ DUB/ CMC/ 2026 | ఒక సంవత్సరం కాలానికి గాను - ప్రముఖ నాయకుల విగ్రహాలు లేదా సమాధుల వద్ద జయంతి, వర్ధంతి మరియు CMC నిర్వహించే ఇతర సందర్భాలలో పూల అలంకరణ; అలాగే VIPలు, VVIPలు మరియు CMC నిర్వహించే ఇతర కార్యక్రమాలకు పూల గుచ్ఛాల సరఫరా మొదలైన పనులు (బాక్స్ టెండర్). | తేదీ: 21.08.2026 ఉ.11.00గం.ల నుండి 29.08.2026 మ.01.00గం.ల వరకు. వెబ్‌సైట్: https://cmc.telangana.gov.in/ | తేదీ: 21.08.2026 నుండి 29.08.2026 వరకు, ఉ.11.00గం.ల నుండి సా.04.00గం.ల మధ్య | డైరెక్టర్ (అర్బన్ బయోడైవర్సిటీ) కార్యాలయం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఎన్ఎసి క్యాంపస్, ఇజ్జత్‌నగర్, కొత్తగూడ పోస్ట్, హైదరాబాద్. | డైరెక్టర్, డైరెక్టర్ (అర్బన్ బయోడైవర్సిటీ) కార్యాలయం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఎన్ఎసి క్యాంపస్, ఇజ్జత్‌నగర్, కొత్తగూడ పోస్ట్, హైదరాబాద్. సెల్ నెం. 9494123724. |

సం/- డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, సిఎంసి.
DIPR R.O. No. : 8319-PP/CL/ADVT/2026-27, Date: 20-08-2026

**ఇల్లందు మున్సిపాలిటీ కార్యాలయం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.**
Notice.Roc.No. E1/101/2026, కొటేషన్ నోటీసు తేదీ: 20.08.2026

పనుల పేరు
1) పటిక, సున్నం, బ్లీచింగ్ సరఫరా, 2) ఫ్రేమ్‌లతో మరియు ఫ్రేమ్‌లు లేకుండా ఫ్లెక్స్‌లు, 3) సిరీస్ లైటింగ్, ఫ్లడ్ లైటింగ్, బారికేడ్లు, సౌండ్ సిస్టమ్, అలంకరణ, జనరేటర్, టెంట్, కుర్చీలు, బల్లలు, సైడ్ వాల్స్, త్రాగునీటి ఏర్పాటు, 4) సౌండ్ సిస్టమ్ కొనుగోలు మరియు మరమ్మత్తు, 5) వీధి దీపాల ఫిట్టింగ్‌కు అవసరమైన వస్తువులు, 6) ట్రాక్టర్ మరమ్మతు మరియు వెల్డింగ్ పనులు, 7) టెండర్ షెడ్యూల్ పుస్తకాలు, 8) ఘన వ్యర్థాల నిర్వహణ యంత్రాల నిర్వహణ మరియు మరమ్మత్తు.
**గమనిక:** పైన పేర్కొన్న పనుల కోసం ఆహ్వానించబడిన కొటేషన్ రేటు ప్రతి అంశానికి గంటకు, సంఖ్యలు, లీటర్లు, జాబ్ వర్క్, రోజుకు, కిలోలు, చదరపు మీటర్లు మొదలైన యూనిట్లలో పేర్కొనాలి.
ఆసక్తిగల కాంట్రాక్టర్ / ఏజెన్సీ తమ పత్రాలను సీల్ చేసిన కవర్లలో కింద సంతకం చేసిన వారికి సమర్పించండి.
కొటేషన్ ఆహ్వానం మరియు (EOI) తేదీ : 21.08.2026 నుండి 25.08.2026, సా.4.30 గం.ల వరకు
కొటేషన్ల (EOI) స్వీకరణ ప్రారంభ తేదీ : 25.08.2026, సా.5:00 గం.లు
సమర్పించిన సీల్డ్ కొటేషన్లు సంబంధిత కొటేషన్ ఇచ్చిన సంస్థల ముందు తెరవబడతాయి. మరిన్ని వివరాల కోసం మున్సిపల్ కమిషనర్, ఇల్లందు మున్సిపాలిటీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను సంప్రదించండి.
సంప్రదించవలసిన వివరాలు: ఇల్లందు మున్సిపాలిటీ. మొబైల్ నెం: 9849905883
సం/- కమిషనర్ ఇల్లందు మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 8326-PP/CL/ADVT/2026-27, Date: 20-08-2026

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి ఎఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అచ్చంపేట మున్సిపల్ కమిషనర్ మురళికి కూడా ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. సిడిఎంఎ కమిషనర్ జారీ చేసిన సర్క్యులర్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్మికులకు వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవులు, పండుగ సెలవులు, ఇతర సెలవులు అమలు చేయాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలను అర్హులైన కార్మికులందరికీ కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరికీ వేతనాలు పెంచాలని కోరారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అచ్చంపేట కమిషనర్ మురళి సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి మాదుగుల నరసింహ, పట్టణ నాయకులు వంకేశ్వరం శ్రీనివాసులు, కొత్త రామస్వామి, ఈర్ల హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసేందుకు కుట్ర



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 97ను వెంటనే రద్దు చేయాలని బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్ డిమాండు చేశారు. పాలిటెక్నిక్ విద్యపై ఆధారపడుతున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే నిర్ణయాలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించేందుకు ప్రతి ఏటా వేలాది మంది విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సులను అభ్యసిస్తున్నారని, డిప్లమా పూర్తి చేసిన వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. పాలిటెక్నికల్ విద్యను యూనివర్సిటీల పరిధిలోకి మార్చే ప్రయత్నం ద్వారా ఈ విద్యా వ్యవస్థను క్రమంగా నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల జాప్యం, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా కొనసాగించాలని డిమాండు చేశారు. జిఒ 97ను రద్దు చేయకపోతే బిఆర్‌ఎస్‌వి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గణేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రవీందర్, విష్ణు, కృష్ణ, వికాస్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి జై కొడుతూ మక్తల్ సభకు...



**ప్రజాపక్షం/మాగనూర్ :** మక్తల్ నియోజకవర్గంలో జరగనున్న రూ. 173 కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపన, బహిరంగ సభకు మాగనూర్ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా బయలుదేరారు. పార్టీ జెండాలు, నినాదాలతో ర్యాలీగా బయలుదేరిన నాయకులు, సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు మద్దతు తెలుపుతున్నామని అన్నారు. మక్తల్ నియోజకవర్గం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని రోడ్లు, నీరు, విద్య, వైద్య రంగాల్లో వస్తున్న మార్పులను ప్రజలకు వివరించేందుకు ఈ సభను సద్వినియోగం చేసుకుంటామని మాగనూర్ కాంగ్రెస్ నాయకులు తెలిపారు.యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీగా తరలివెళ్లారు.

## ఘనంగా పర్ణిక రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండల కేంద్రంలో నారాయణపేట్ శాసన సభ్యురాలు డాక్టర్ పర్ణిక రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకోవడం జరిగింది. సంజీవరాయి టెంపుల్ దగ్గర టెంకాయ కొట్టి పూజ చేయడం జరిగింది కేక్ కట్ చేయడం ఎమ్మార్వో ఆఫీసులో మొక్కలు నాటడం దామరగిద్ద ఆస్పత్రిలో బ్రెడ్డు పండ్లు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బాల్రెడ్డి మండల అధ్యక్షులు బి ఆనంద్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఖాజామియా దామరగిద్ద సర్పంచ్ కన్కి రెడ్డి ఒత్తు గుండ్ల సర్పంచ్ హనుమంతు ఉపసర్పంచ్ కనకప్ప బిఎల్‌ఎ హనుమంతు పిడింపల్లి సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ ర ఘు, మడే పల్లి సర్పంచ్ శివ గ్రామ, గ్రామ అధ్యక్షులు గోపాల్, దామరగిద్ద తాండ సర్పంచ్ శరన్ నాయక్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిఒ97ను ఉపసంహరించుకోవాలి

గద్వాలలో విద్యార్థుల ఆందోళన

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** సీమ్, జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్‌ఎస్‌వి ఆధ్వర్యంలో గద్వాల మండలం గోనుపాడు ప్రభుత్వ లెదర్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు భారీ ఆందోళన చేపట్టారు. కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా సిల్ యూనివర్సిటీ (వైఐఎస్‌యు)లో విలీనం చేయడం వల్ల విద్యార్థుల మూడేండ్ల విద్యా వ్యవస్థ దెబ్బ తింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. శక్తి శాఖ ఏర్పాటు చేసి అందులో ఐటిఐ, పాలిటెక్నిక్ డిపార్ట్‌మెంట్లను విలీనం చేయడంతో తమకు ఎలాంటి ఉపయోగం లేదని విద్యార్థులు అన్నారు. శక్తి స్కీమ్‌కు బదులు పాలిటెక్నిక్ అనంతరం బిటెక్‌లో ప్రవేశానికి సీట్ల సంఖ్యను పెంచాలన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి విలీన ప్రక్రియను ఉపసంహరించుకోని జిఒ నెంబర్ 97ను వెనక్కు తీసుకోవాలని డిమాండు చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గద్వాల సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్, గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, మల్దకల్ ఎస్ఐ శ్రీహరి, ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు, బందోబస్తు ఏర్పాటు చేశారు.



# రైతులు సాగునీటిని వృథా చేయొద్దు

● సాగునీటి కాల్వలపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి ● కాల్వలకు, డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదలపై పరిశీలన ● డి-8 కెనాల్ పరిధిలో పర్యటించిన జూపల్లి



**ప్రజాపక్షం/పానుగల్/వీపనగండ్ల :** కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన డి8 కెనాల్ పరిధిలోని కాల్వలను, డిస్ట్రిబ్యూటరీలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బైక్‌పై తిరుగుతూ స్వయంగా పరిశీలించారు. తూడుకుర్తి దగ్గర ప్రధాన కాల్వ నుంచి చాకలిపల్లి ఏదుట్ల, గోపాల్‌పేట, రేమద్దుల, సింగాయపల్లి తదితర పల్లి, గోవర్ధనగిరి గ్రామాలలో కాల్వలను పరిశీలించి నీటి ప్రవాహం, కాల్వల పరిస్థితిని పర్యవేక్షించారు. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు విడుదల చేస్తున్న నీరు, ఆయకట్టు పరిస్థితిపై సాగునీటి పారుదల శాఖ అధికారులతో మంత్రి ఆరా తీశారు. ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు చేరుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును ఏమాత్రం వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ అధిక విస్తీర్ణంలో పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల, నీటి ప్రవాహం, ఆయకట్టు పరిస్థితిపై సాగునీటి పారుదల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. నీరు వృథా కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు, ఆయకట్టు చివరి భూములకు సైతం సక్రమంగా నీరు అందేలా చూడాలని సూచించారు. మంత్రి వెంట వనపర్తి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్, కోడేరు మాజీ ఎంపిపి రామ్మోహన్ రావు, సాగునీటి పారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**24న అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

ప్రజాపక్షం పానుగల్ నుంచి వీపనగండ్ల మండల కేంద్రం మీదుగా చిన్నంబావి మండలానికి వెళ్తున్న రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం వీపనగండ్ల మండల కేంద్రంలోని టీ హోటల్లో స్థానిక నాయకులు, ప్రజలతో కొద్దిసేపు స్థానిక నాయకులు, ప్రజలతో కొద్దిసేపు ముచ్చటించారు. మండల కేంద్రంలో టీ తాగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు, సోమవారం వీపనగండ్ల నుంచి కేతేపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఫంక్షన్ హాల్‌కు కూడా భూమి పూజ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి హాజరై శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం స్థానిక నాయకులు మండల కేంద్రంలోని తాగునీటి ఫిల్టర్ సక్రమంగా పనిచేయడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే సంబంధిత డీఈ, ఏఈలకు ఫోన్ చేసి ఫిల్టర్ బెడ్లను శుభ్రం చేయించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. మంత్రితో ప్రజలు, నాయకులు నేరుగా ముచ్చటించడంతో స్థానికంగా సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానల్లో నాణ్యమైన వైద్యం అందించాలి

జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పట్టణ, బస్తీ, దవాఖానాల్లో ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఆదేశించారు. శ్రీనగర్ కాలనీ, దేశిటిక్యాలలోని బస్తీ దవాఖానాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు. వైద్య సేవలు, మందుల లభ్యతను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, మందులపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండి రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించిన తగిన చికిత్స అందించాలని సూచించారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలంలోని బిజ్వారం, మేకల సంపల్లి, దాసరపల్లి అంగన్వాడీ కేంద్రాలను సిడిపిఓ ఆకాశ దీప్తి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల గ్రోత్ వివరాలు, రిజిస్టర్లు, ఫుడ్ ఎంట్రీ డేటా తదితర అంశాలను పరిశీలించారు. కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న ఆహారం, రికార్డుల నిర్వహణ పై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి అంగన్వాడి టీచర్ మెనూ ప్రకారం పిల్లలకు పౌష్ఠికాహారం అందించాలని, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా నమోదు చేయాలని, సిడిపిఓ ఆకాశ దీప్తి సూచించారు.

## బాలికలు ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలు సాధించాలి

నాగనూల్ కెజిబివిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** బాలికలు ఆత్మవిశ్వాసంతో విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. నాగనూల్ కెజిబివిని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 317 మంది విద్యార్థినులు నమోదు కాగా, 229 మంది మాత్రమే హాజరైనట్లు గుర్తించారు. 100 శాతం హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని కెజిబివి ప్రత్యేక అధికారిని ఆదేశించారు. తరచూ గైర్హాజరయ్యే విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రత, తాగునీరు, స్టోర్ రూమ్, వంటగది, భోజన నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆర్వో ప్లాంట్‌లో లీకేజీని వెంటనే సరిచేయాలని, చిన్న చిన్న మరమ్మత్తు పనులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థినులతో పూర్తి చేయాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థినులతో ముచ్చటించిన కలెక్టర్ పరీక్షలను భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొవాలని సూచించారు. ప్రతిరోజు పాఠాలను పునశ్చరణ చేసుకుంటూ అర్థం కాని అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని తెలిపారు. ఇంటర్మీడియట విద్యార్థినుల కోసం నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఇఒ ఎ.రమేష్ కుమార్, ఎంఇఒ కురుమయ్య, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## భూగర్భ జలాల పెంపునకు ఫామ్‌పాండ్ నిర్మాణాలు

● రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలి ● విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి ● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ప్రజాపక్షం/పానుగల్ :** భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఫామ్‌పాండ్ నిర్మాణాలను చేపట్టాలని, ఎల్‌నినో ప్రభావంతో వరికి బదులుగా రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం పానుగల్ మండలం గోప్లాపూర్ గ్రామంలో వివిధ రంజి వీబీజీ రామ్ జీ (గ్రామీణ ఉపాధి పథకం) కింద చేపడుతున్న ఫారం పాండ్ నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఫారం పాండ్ నిర్మాణం చేయించుకుంటున్న రైతు పల్లవితో కలెక్టర్ మాట్లాడి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనకున్న రెండు ఎకరాల భూమిలో రెండు గుంటల విస్తీర్ణంలో ఫారం అండ్ నిర్మిస్తున్నట్లు రైతు తెలిపారు. ఫారం పాండ ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల పెంపు, బోర్ల రీచార్జ్‌కు వ్యవసాయ అవసరాలకు నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు నీటిని అందుబాటులో ఉంచేందుకు ఫారం పాండ్లు ఉపయోగపడతాయని, కాబట్టి జిల్లాలో వాటి నిర్మాణాన్ని విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఫారం పాండ్ నిర్మాణంపై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి మరిన్ని పాండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించి ఫారం పాండ్ల నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు నిర్దేశించిన ఫారం పాండ్ల నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు నిర్దేశించిన ఫారం పాండ్ల నిర్మాణ లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు వరి సాగుకు దూరంగా ఉండి వేరుశనగ, పెసర, కంది వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో పాండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా నీటి కొరతతో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించడంతో పాటు రైతు ఆదాయాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం గ్రామంలోని గోప్లాపూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాటశాలలోని వంటగదిని పరిశీలించి విద్యార్థులకు భోజనం గ్యాస్ స్టవ్‌పై వండుతున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, వంటగది పరిశుభ్రతను పరిశీలించారు.

విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని, వంటగది పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. జెడ్‌పిసిఇఒ యాదయ్య, డిప్యూటీ సిఇఒ రామ మహేశ్వర్, తాహసీల్దార్ కార్తీక్ రావు, ఎంపిడిఒ గోవింద రా వు, గ్రామ సర్పంచు రాజు గౌడ్, ఎపిఒ కురుమ య్య, ఎంఇఒ ఆనంద్ తదితరులు ఉన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలి




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 20న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం 8 ప్రధాన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి జబ్బార్ మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షలకు పైగా పోస్టులను వెంటనే నింపాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని, పోలీస్ శాఖలోని 20 వేల ఖాళీలతో పాటు డిఎస్‌సి, జేల్, గ్రూప్, 1,2,3,4 పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉద్యోగ భద్రత, ఉపాధి లభించే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.5,000ల నిరుద్యోగ భృతి చెల్లించాలని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. వివాదాస్పద జిఒలను రద్దు చేసి, కోర్టు చిక్కులు లేకుండా నియామకాలు జరపాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీలతో పాటు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ కా ర్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు లు ఏ,లక్ష్మీ , జీ.ఎస్ గోపి, బాల్ రెడ్డి, ఎం రాజు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.ఎన్ రమేష్, ఎం, పరమేశ్వరాచారి, బాల్య నాయక్, వెంకట్ రాములు, మేకల ఆంజనేయులు, గుంటి వెంకటయ్య, 18వ వార్డు కౌన్సిలర్ గంధం మదన్, పట్టణ నాయకులు డి.కురుమయ్య, జి. బాలరాజు, గంధం గట్టయ్య, జి.బాలస్వామి, ఆఫీస్, కార్యదర్శి ఉమా, నాయకులు నందిమల్ల రాములు, ఎల్.బిసన్న, రేణుక, అజయ్, బొబ్బిలి, నిక్సన్, రాఘవేంద్ర, మహేష్, ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

## 24 గంటల కరెంటు కొరత.. రైతుల ఆవేదన



**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలంలో రైతులకు వ్యవసాయానికి 24 గంటల కరెంటు సక్రమంగా అందించాలని మక్తల్‌లోని కన్యకాపరమేశ్వరి చౌరస్తా నుండి సబ్ స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం సబ్ స్టేషన్ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేపట్టిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ గ్రామాల నుండి రైతులు, బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యాసంస్థల బంద్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం జెపి కాలనీలోని నాగార్జున్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.రూపారెడ్డిని అదే పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈనెల 11న దారుణంగా హత్య చేసిన ఘటనను ఖండిస్తూ నేడు విద్యాసంస్థల బంద్‌కు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ట్రస్మ పిలుపునిచ్చింది. రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నారాయణపేట్ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు బంద్ పాటించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కె.సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయడం తో పాటు పాఠశాలలను మూసివేసి బంద్‌లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నా రు. ఈ మేరకు గురువారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్మ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్‌కుమార్, ఇసి నంబర్ మహేష్, పట్టన అధ్యక్షులు ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## 23న ఆటో-రవాణా బంద్

ఆర్‌డిఒకు సమ్మె నోటీసు అందజేసిన ఆటో కార్మికులు



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న అర్ధరాత్రి నుంచి ఆటో, రవాణా బంద్ నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ టియుసిఐ నాయకులు తెలిపారు. ఈ మేరకు గురువారం నారాయణపేట్ జిల్లా కేంద్రంలో ఆర్‌టిఒ మున్నికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి బి.నరసింహా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆటో, మోటర్ వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా మొత్తాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. ఆర్‌టిసి ద్వారా ఆటోలను నడిపించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ఎలక్ట్రిక్ ఆటోల నిర్వహణలో ప్రస్తుతం ఆటోలు నడుపుతున్న డ్రైవర్లకే ప్రాధాన్యం ఇవ్వాలని, ఏ సంస్థల కు కాంట్రాక్టులు అప్పగించకుండా ఆటో డ్రైవర్లను భాగస్వాములను చేసి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రోడ్లపై ఆటోలు నడుపుతున్న ప్రతి కార్మికుడికి ప్రభుత్వం ఎలక్ట్రిక్ ఆటోలను మంజూరు చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ నెల 23న నిర్వహించే ఆటో రవాణా బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్లా, జిల్లా సహాయ కార్యదర్శి సలీ, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించాలి : సురేంద్రమోహన్



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసి పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు సంబంధిత అధికారులతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ సహకరించాలని వ్యవసాయ, సహకార శాఖల రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఎలక్టోరోల్ అబ్జర్వర్ సురేంద్రమోహన్ అన్నారు. గురువారం ఐడిఓసి సమావేశపు మందిరంలో ఎస్ఐఆర్‌పై జిల్లా ఎన్నికల అధికారులు గుర్తింపు పొందిన రాజకీయా పా ర్టీల ప్రతినిధులతో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి పరిశీలకులు ప్రసంగించారు. అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లు ఓటరుగా నమోదు కావడానికి ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 గుర్తింపు కార్డులలో ఏదైన ఒకటి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా కాపీలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేసినందున బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారంతో క్షేత్రస్థాయిలో సంబంధిత ఎన్నికల అధికారులకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎస్ఐఆర్‌కు సంబంధించి ఇది మొదటి పర్యటనగా పేర్కొంటూ, మరో పర్యటనలో పోలింగ్ స్టేషన్ల ను సందర్శిస్తూ, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అప్పట్లోగా జిల్లా ఎన్నికల అధికారులు ఓటరు జాబాతా ప్ర త్యేక సమగ్ర సవరణ ప్రక్రియను షెడ్యూల ప్రకారం పకడ్బందీగా నిర్వహి స్తూ ముందుకెళ్లాలని ఈ సందర్భంగా పరిశీలకులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1.25 లక్షల మంది ఓటర్లు అనామలీస్ జాబితాలో ఉన్నారని తెలిపారు.

## 'సర్' ప్రక్రియలో పారదర్శకతే ప్రామాణికం




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రత్యేక సాంద్ర పునర్విమర్శ ఎస్ఐఆర్ ప్రక్రియ ను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేంద్ర మోహన్ అధికారులకు సూచించారు. గురువారం నారాయణపేట్ జిల్లాలో పర్యటించిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.హెచ్ ప్రియాంక అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, ఆర్డీఓ రమేష్, జిల్లాకు చెందిన ఎఇఆర్‌ఓలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన సు రేంద్ర మోహన్, ఎస్ఐఆర్ ప్రక్రియలో జరుగుతన్న పురోగతి, ఎదురువుతున్న సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సుదర్శన్ రెడ్డి, మహ్మద్ సలీం, రాఘవ చౌదరి, రాములు, వెంకట్రామ్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కెంచి నారాయణ తదితరలు పాల్గొన్నారు.

# 15 రోజుల్లో కొత్త రేషన్ కార్డులు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే విప్లవాత్మక మార్పులు

పేదోళ్ళకు సన్నబియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే




**ప్రజాపక్షం/సూర్యాపేట** : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటి పారుదల శాఖల మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక అర్హులైన ఎందరో పేదలు ఇబ్బంది పడ్డారని మండిపడ్డారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి పౌరసరఫరాల శాఖను ప్రజల చెంతకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని దాదాపు 80 నుండి 90 శాతం మంది ప్రజలు తినలేకపోయేవారని గుర్తు చేశారు. ఆ బియ్యాన్ని కేవలం ఐదు, పది రూపాయలకే అమ్ముకోవడం లేదా రీసైక్లింగ్ చేసి బీర్ల కంపెనీలకు, కోళ్ల ఫారాలకు తరలించేవారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దుస్థితిని మార్చేందుకు దేశంలోనే తొలిసారిగా తెల్లరేషన్ కార్డుదారులందరికి ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేసే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 42 లక్షల మంది పేదలు లబ్ధిపొందుతున్నారని ఆయన వివరించారు.

**16 లక్షల కొత్త కుటుంబాలకు రేషన్ కార్డులు**

గత పదేళ్లలో అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే కొత్తగా 16 లక్షల కుటుంబాలను రేషన్ పరిధిలోకి తీసుకువచ్చిందని, తద్వారా లబ్ధిదారుల సంఖ్యను పెంచామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే 15 రోజుల్లో సూర్యాపేట జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**రైతులకు సకాలంలో రూ.90వేల కోట్లు...**

రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి ఈ రెండున్నరేళ్ల పాలనా కాలంలో రైతుల నుంచి రికార్డు స్థాయిలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే ఎలాంటి ఆలస్యం లేకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.90వేల కోట్లను జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మందుల సామేల్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి కె. నరసింహ, ఆర్‌డిఓ వేణు మనోహర్ రావు, రాష్ట్ర రైతు కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాదిలతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలి

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో భువనగిరి రోడ్డులో ఉన్న శివ శంకర్ రైస్ మిల్లు ఆవరణలో గత 24 సంవత్సరాల క్రితం టిటిడి కళ్యాణ మండపం కోసం కొనుగోలు చేసిన భూమిని రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గత కొన్ని రోజులుగా సర్వే నెంబర్ 629లో గల ఎకరం 12 గుంటలపై రాజకీయ పక్షాల మధ్య భూవివాదం నడుస్తుంది. ఈ విషయంపై గురువారం అఖిల పక్ష నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రభుత్వ చీఫ్ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, సిపిఎం నాయకులు, మాజీ ఎంఎల్‌సి చెరుపల్లి సీతారాములులతో కలిసి మాట్లాడారు. 2002లో దాతల ఆర్థిక సహాయంతో భూమిని కొనుగోలు చేసిన మాట వాస్తవమేనని, అక్కడ కళ్యాణ మండపం కట్టాలని నిర్ణయించినప్పటికి పరిస్థితులు అనుకూలించక అది వాయిదా పడుతూ వచ్చిందన్నారు. కాని నేడు కళ్యాణ మండపం కట్టే అవకాశాలు లేవన్నారు. పట్టణ ప్రజల దాతృత్వంతో కొనుగోలు చేసిన భూమి ప్రజల అవసరాల కోసం మాత్రమే ఉపయోగించాలి కాబట్టి, ముందుగా ఈ భూమి ప్రైవేట్ వ్యక్తుల చేతుల నుండి ప్రభుత్వం చేతిలోకి రావాలని ఆయన సూచించారు. అందుకు తగిన ఏర్పాట్లను స్థానిక రెవిన్యూ మరియు మున్సిపల్ అధికారులు సమన్వయంతో ముందుకెళ్లి దానికి కావల్సిన చర్యలను త్వరగా తీసుకోవాలని సూచించారు. అధికారులు భూమి ఉన్న ప్రాంతాన్ని సందర్శించి, సర్వే చేసి హద్దులు నాటాలని కూడా సుఖేందర్‌రెడ్డి సూచించారు. ఎంఎల్‌ఏ వీరేశం మాట్లాడుతూ భూమి ప్రభుత్వ వశం అయ్యాక ప్రజాభీష్టం మేరకు ప్రజల అవసరాల మేరకు భూమిని ఉపయోగించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పందరి గీతారమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కాంగ్రెస్ పార్టీ నుండి జడల చిన్నమల్లయ్య, ఎద్దులపురి కృష్ణ, బిఆర్ఎస్ నుండి బొబ్బల శివశంకర్‌రెడ్డి, ఆగు అశోక్, సిపిఎం నుండి జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, బిజెపి నుండి మాస శ్రీనివాస్, గంజి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి ముఠాను పట్టుకున్న పోలీసులు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నియోజకవర్గ పరిధిలోని నేరేడుచర్లలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. గురువారం హుజూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సిఐ చరమందరాజు మాట్లాడుతూ నేరేడుచర్లకు వచ్చిన సమాచారం మేరకు నేరేడుచర్ల మండలం దాచారం గ్రామ శివారులో ఎన్ఎస్‌పి కాలువ వద్ద నిషేధిత గంజాయితో ఉన్నటువంటి ఆరుగురు నిందితులను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేసి వారి వద్ద నుండి రెండు కేజీల గంజాయి, ఒక ద్విచక్రవాహనం, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఖమ్మం పట్టణం నుండి రెండు కేజీల గంజాయిని సురేష్ అనే వ్యక్తి వద్ద నుండి నేరేడుచర్ల మండలానికి చెందిన ఇంజమూరి రోహిత్ కొనుగోలు చేసి, కందుల శ్రీరామ్, జగదీష్, సాయిరామ్, హన్మంత్, జయరాజు అనే యువకులకు అమ్ముతూ నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్‌రెడ్డి చేసిన తనిఖీల్లో మండలంలోని దాచారం గ్రామ శివారు కాలువ కట్ట వద్ద పట్టుబడినట్లు తెలిపారు. మొత్తం పదిమంది నిందితులకు గానూ ఆరుగురిని పట్టుబడి చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. పదిమందిలో నలుగురు గంజాయి సేవించే వారు కాగా మిగతా వారు అమ్ముతూ జీవనం సాగిస్తుంటారని, గంజాయి సేవించే నలుగురిని వారిలో మార్పు కోసం డిఆడిక్షన్ సెంటర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. పారిపోయిన మిగతా నలుగురిని త్వరలో పట్టుకుని తగిన శిక్ష విధిస్తామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో గంజాయి అమ్మినా, సేవించిన వారిపై కఠినమైన శిక్షలు అమలు చేస్తామని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, ఐడి పార్టీ శంభయ్య, హనుమా పాల్గొన్నారు.

# దేశానికి సాంకేతిక విప్లవం ఘనత రాజీవ్ గాంధీదే



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** దేశ అభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహోన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కొనియాడారు. భారత మాజీ ప్రధాని దివంగత నేత రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్ లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,కార్పొరేటర్లు, పార్టీ నేతలతో కలిసి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ నవభారత నిర్మాత, యువ సాధికారతకు స్ఫూర్తి ప్రదాత అన్నారు. దేశంలో ఐటీ రంగానికి ఆనాడే పునాదులు వేసి సాంకేతిక విప్లవానికి నాంది పలికారని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే కాంగ్రెస్ ఏకైక లక్ష్యమని,ఆ దిశగా పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,మాజీ జెడ్‌పిటిసిలు గుమ్ముల మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

### రాజీవ్ గాంధీ జీవితం యువతకు ఆదర్శం...ఎమ్మెల్యే బీర్ల



**ప్రజాపక్షం/మోటకొండూరు:** రాజీవ్ గాంధీ జీవితం యువతకు ఆదర్శం అని ప్రభుత్వ విప్ ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం మోటకొండూరు మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో మోటకొండూరు మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య తెలిపారు. గత సర్పంచ్ ఎన్నికల్లో కొంత మందిని పార్టీ నుండి సస్పెండ్ చేసినప్పటికి వాళ్లందర్ని మరల పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సంజీవరెడ్డి, అండెం సంజీవరెడ్డి, వెంకటస్వామి, ఝాన్సీ, నార్మల్ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.



### సాంకేతిక రంగాల మూలపురుషుడు రాజీవ్ గాంధీ

రాజీవ్ గాంధీ దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాల ఫలితంగానే భారత్ ఆర్థిక, శాస్త్ర,సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత అన్నారు. గురువారం దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు జిల్లెపల్లి పరమేష్,చింత యాదగిరి,ఎండి ముంతాజ్ అలీ, దొండ రమేష్,దామనూరి అశోక్,పగిళ్ల రాజు, గౌతమ్ పాల్గొన్నారు.



# దున్నపోతుల గండి నిర్వాసితులకు రూ.కోటి పరిహారం చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అడవిదేవులపల్లి మండల పరిధిలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న దున్నపోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తమ భూములను త్యాగం చేసిన భూ నిర్వాసితులకు ప్రభుత్వం అందిస్తున్న పరిహారంలో భాగంగా గురువారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఆర్డీవో రమణారెడ్డిలతో కలసి 30 మంది భూ నిర్వాసిత రైతులకు మొత్తం రూ.కోటి విలువైన పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ అభివృద్ధి, ప్రాజెక్టుల నిర్మాణం కోసం తమ భూములు కోల్పోతున్న భూ నిర్వాసితుల సంక్షేమం, ప్రయోజనాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. భూములు కోల్పోయిన ప్రతి పేద, మధ్యతరగతి రైతు కుటుంబానికి చట్టబద్ధంగా న్యాయమైన పరిహారం అందేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. దున్నపోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే అడవిదేవులపల్లి పరిసర ప్రాంతాల్లో సాగు నీటి ఎద్దడి తీరి, వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

మసీదుగూడెంలో రైతులకు అవగాహన కల్పించిన కలెక్టర్



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : వాతవరణంపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపనుంది.నీటి అవసరం తక్కువ ఉన్న పంటలను రైతులు సాగు చేయాలని యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంత్ అన్నారు. చౌటుప్పల్ మండలం మసీదుగూడెం గ్రామంలో గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు.రైతులు సాగు చేయాల్సిన పంటలపై అవగాహన కల్పించారు.గతంతో పోల్చితే ఈ ఏడాది వర్షాలు సమయానికి అనుకూలంగా కురిసే పరిస్థితి కనిపించడం లేదని అన్నారు.రైతులు సాంప్రదాయ పంటలను పక్కకు పెట్టి నీటి అవసరం తక్కువగా ఉండే ఆయిల్ పామ్,కూరగాయలు,పూల తోటలు,వాణిజ్య పంటలపై శ్రద్ధ చూపాలని కోరారు.వర్షాలు తక్కువగా కురిసిన నేపథ్యంలో గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.నీటి లభ్యత ఆధారంగా రైతులు పంటలను సాగు చేయాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పి.వెంకటరమణ రెడ్డి,జిల్లా ఉద్యానశాఖ అధికారి హేమలత,చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి,డిఎల్‌పిఓ ప్రతాప్ నాయక్,జెడ్పీ డిప్యూటీ సిఈఓ శ్రీనివాస్,మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో అనామిలీలు, మ్యాపింగ్ పకడ్బందీ ప్రణాళిక

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించిన నేపథ్యంలో మ్యాపింగ్ కాని ఓటర్లు,అనామిలీ ఓటర్ల వివరాలను పరిశీలించేందుకు గ్రామ,మున్సిపల్ వార్డుల వారీగా నిర్వహించే సమావేశాలకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.గురువారం ఉదయాదిత్య భవన్‌లో ఈఆర్‌ఓలు,ఎఈఆర్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సర్ డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించినందున ఎఈఆర్‌ఓలు, బిఎల్‌ఓలు,సూపర్‌వైజర్లను కలెక్టర్ అభినందించారు.గ్రామాల్లో హియరింగ్స్‌మ్యాపింగ్ కాని, వివిధ కారణాల వల్ల జాబితాలోకి రాని ఓటర్ల వివరాలు తెలుసుకునేందుకు, వారి వివరణలు వినేందుకు ఓటర్లు ఎక్కువగా ఉన్నచోట గ్రామాలు,మున్సిపాలిటీల్లో పోలింగ్ కేంద్రాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి హియరింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.జిల్లాలో కొత్తగా 49 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న దృష్ట్యా ఆ కేంద్రాలకు బిఎల్‌ఎలను నియమించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించాలని ఆదేశించారు.సర్ కార్యక్రమంలో భాగంగా చేపట్టే అన్ని పనులకు లీగల్ స్క్రూటినీ ఉంటుందని, అందువల్ల అన్ని ఫారాలు, ఫైళ్లను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా భూ భారతి కింద వచ్చిన 22ఏ భూముల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిఆర్‌ఓ దశరథ్, ఆర్‌డిఓలు, ఎఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

# డిజిటల్ బాటలో విద్యాబోధన

ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్** : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన చేపట్టడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని వీవీఎం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ బోర్డును ఆయన ప్రారంభించారు.రామన్నపేట లయన్స్ క్లబ్ ఈ బోర్డును అందించారు.ఈ సందర్భంగా ఆయన డిజిటల్ స్క్రీన్ బోర్డుతో పాఠ్యాంశాలను దృశ్యరూపంలో సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్య అందించేందుకు ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధికి సహకరించిన రామన్నపేట లయన్స్ క్లబ్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వై.మోహన్ రెడ్డి,కందాల పాపిరెడ్డి,చామల శ్రీనివాస్ ఎర్ర శంభులింగారెడ్డి,పన్నాల రాఘవరెడ్డి,ఎల్లపు రెడ్డి యాదగిరి రెడ్డి,పాఠశాల ప్రిన్సిపాల్ భద్రయ్య,ఉద్దీపన కోఆర్డినేటర్ చెరుకు సతీష్ తదితరులు పాల్గొన్నారు.







# విద్య,వైద్యం,ఉపాధి కోసం యువత ఉద్యమం

స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు

తీర్పారి వెంకటేశ్వర్లు డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ:** విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం యువత పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం సిపిఐ కార్యాలయం మద్దుమ్ భవన్ లో జరిగిన ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఏనమల్ల నవీన్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య,వైద్య రంగాలను పూర్తిగా కార్పొరేట్,ప్రైవేట్ సంస్థలకు అప్పగించాయని ఆరోపించారు.దీంతో సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక లక్షలాది మంది యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, యువశక్తి నిర్వీర్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.నల్లగొండ జిల్లాలోని స్థానిక పరిశ్రమల్లో 80 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకు తప్పనిసరిగా అందించాలని డిమాండ్ చేశారు. బయటి రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి స్థానికులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు.సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల వాల్ పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.నల్లగొండ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యువత తరలివెళ్లి మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం నవీన్,సహాయ కార్యదర్శి జెరిపోతుల మహేష్, కట్కూరి లింగస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

# వసూల్ రాజా....!

అక్రమ రవాణా కేసులో అధికార పార్టీ నాయకుడి చేతివాటం!

కేసులు లేకుండా చేస్తానంటూ రూ.13 లక్షలు స్వాహా

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు





**ప్రజాపక్షం/కోదాడ:** అక్రమ పశువుల రవాణా కేసులో నిందితుడు నుండి కోదాడ పట్టణం లక్ష్మిపురం కాలనీకి చెందిన ఓ అధికార పార్టీ చోటా నాయకుడు మేకపోతుల సత్యనారాయణ 18 లక్షలు ముక్కు పిండి వసూలు చేయడంతో పాటు తిరిగి సొమ్ము ఇవ్వమని అడిగితే బెదిరిస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కోదాడ పట్టణం లక్ష్మి పురం కాలనీకి చెందిన ఓ చోటా అధికార పార్టీ నాయకులుడు పోలీస్‌స్టేషన్లలో కేసులు లేకుండా చేస్తానని జైలుకు వెళ్లాల్సిన అవసరం లేదని అనంతగిరి, చిలుకూరు మండలాల పోలీస్‌స్టేషన్‌లలో అక్రమ పశువుల రవాణా కేసులో నిందితుడిగా ఉన్న పట్టణానికి చెందిన మతాన్‌ను నమ్మబలికించి ఆయన వద్ద నుండి వ్యక్తిగతంగా ఫోన్‌ఫే ల ద్వారా 18 లక్షలు వసూలు చేశారు. అయినప్పటికీ రెండు పోలీస్‌స్టేషన్‌లలో పశువుల అక్రమ రవాణా కేసులో జైలుకు వెళ్లాల్సి వచ్చింది. బెయిల్‌పై తిరిగి వచ్చిన మతాన్ తానిచ్చిన 18 లక్షలు తిరిగి ఇవ్వమని అడగడంతో అధికార పార్టీ పెద్ద మనిషి మేకపోతుల సత్యనారాయణ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ అధికార పార్టీ నాయకుడిపై వాళ్ల అండ ఉందని, పోలీల వద్ద తనకు పలుకుబడి ఉందని, ఇచ్చిన పైసలు అడిగితే గరిడేపల్లి, నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టిస్తానని బెదిరింపు దోరణిలో వ్యవహరిస్తున్నాడు. తిరిగి సొమ్ము ఇవ్వమన్నందుకు పట్టణ సిఐ రమ్మంటున్నాడని పదే పదే ఫోన్ చేసి బెదిరించడంతో తాను ఇప్పటికే కేసుల విషయంలో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చానని, అప్పులు చేసి సొమ్ము ఇచ్చినప్పటికీ జైలుకు వెళ్లాల్సి వచ్చిందని సమాధానం ఇవ్వడంతో పాటు తానిచ్చిన 18 లక్షలు తిరిగి ఇవ్వకపోతే మీ ఇంటి ముందే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పూనుకుంటానని ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ ఆడియో కాల్ కోదాడ ప్రాంతంలో చర్చనీయాంశమైంది. సదరు అధికార పార్టీ నాయకుడికి ఇచ్చిన 18 లక్షలలో పశువులు అక్రమ రవాణా కేసులో పోలీసులు ఐదు లక్షలు రికవరి చేసుకోగా మిగిలిన 13 లక్షలు అధికార పార్టీకి చెందిన ప్రబుద్ధుడు స్వాహా చేసినట్లు నిందితుడు మతాన్ ఆయన తల్లి ఆరోపిస్తున్నారు. డిఎస్‌పి విన్నవించుకుందామంటే అందుబాటులో లేడని నిందితుడు మతాన్ ఆయన తల్లి ఫాతిమా మీడియా ఎదుట కన్నీంటి పర్యంతమయ్యారు. ఇక మాకు జిల్లా ఎస్‌పినే దిక్కని తమ బాధను ఆయనకే విన్నవించుకుంటామని తల్లి గోడుగోడున విలపించింది.

# ఎమ్మెల్యే కూనంనేనిని కలిసిన భద్రారెడ్డి




**ప్రజాపక్షం/అనంతగిరి:** కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును అనంతగిరి మండలం శాంతినగర్‌కు చెందిన సీనియర్ సిపిఐ నాయకులు బద్దం భద్రారెడ్డి గురువారం హైద్రాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించినట్లు బద్దం భద్రారెడ్డి తెలిపారు. ఆయనతో పాటు కూనంనేని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి, ఎంఎస్ విద్యాసంస్థల సిఈవో ఎస్‌ఎస్‌రావు, అంజయ్య, గోపి రాథోడ్, బాబునాయక్ పాల్గొన్నారు.

## 641 జిఒను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/కొత్తూరు:** సిద్దాపూర్ ప్రజల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే 641జిఒను రద్దు చేయించాలని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం సిద్దాపూర్ గ్రామ పరిసరాల ప్రజలు, రైతులు కొత్తూరు తహసీల్దార్, షాద్‌నగర్ ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెంటనోళ్ల యాదగిరి, లావణ్య దేవేందర్ యాదవ్, సర్పంచ్ లలిత గోపాల్‌నాయక్, మిట్టునాయక్, రమేష్, వడ్డె బాలయ్య, ప్రసన్నలత యాదయ్య, రవికుమార్, బుచ్చిబాబు, రాములు నాయక్, లక్ష్మణ్‌నాయక్, కోట్యానాయక్, జంగయ్య, గోపినాయక్, బిచ్యానాయక్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

## తీర్మానం లేకుండా పంచాయతీ భవన నిర్మాణం ఎలా?

**ప్రజాపక్షం/కొందుర్గు:** గ్రామ పంచాయతీ తీర్మాణం లేకుండా పంచాయతీ భవన నిర్మాణ పనులు ఎలా చేస్తారని ఉప సర్పంచ్ మహేష్ యాదవ్ ప్రశ్నించారు. గురువారం సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పాలకవర్గం సభ్యుల తీర్మాణం లేకుండా భవన నిర్మాణానికి గుంతలు ఎలా తీస్తారని ప్రశ్నించారు. ఫిర్యాదు చేసిన వారిలో ఉప సర్పంచ్ మహేష్‌యాదవ్, గ్రామస్తులు భీమయ్య, నరేష్, గూడెం చెన్నయ్య, బిక్షపతి, విక్రమ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ముదిరాజ్, రజక స్మశాన వాటికలో శాశ్వత మంచినీటి సమస్యకు పరిష్కార చర్యలు తీసుకుంటున్నట్లు రెండవ వార్డు కౌన్సిలర్ బచ్చలి నరేష్ వివరించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డులో ఉన్న స్మశాన వాటికలో నూతనంగా బోరు వేసే ప్రాంతాన్ని గుర్తించారు. కార్యక్రమంలో భూషం నరేష్, బచ్చలి రమేష్, కొండే యాదయ్య, చెవుల రవికుమార్, బైరమోని రవి, యాదయ్య పాల్గొన్నారు.

## రామన్నగూడ తండా అభివృద్ధికి చర్యలు

**ప్రజాపక్షం/కొందుర్గు:** రామన్నగూడ తండా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అయోధ్యపూర్ తండా సర్పంచ్ గోపాల్‌నాయక్ వివరించారు. గురువారం కొందుర్గు మండల పరిధిలోని అయోధ్యపూర్ తండా పంచాయతీ పరధిలోని రామన్నగూడ తండాలో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంగులాల్‌నాయక్, ఉప సర్పంచ్ నర్సింలు నాయక్, లక్ష్మణ్‌నాయక్, రవినాయక్, గణేష్ నాయక్, రతన్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, శంకర్‌లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తులపై నిర్లక్ష్యం తగదు



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** ప్రజా అవసరాల కోసం రూ.71 లక్షలతో ప్రభుత్వం కొనుగోలు చేసిన విలువైన స్వీపింగ్ మిషన్ మాయమైన ఘటనపై రంగారెడ్డి జిల్లా బిజెపిఅధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆదిభట్ల సర్కిల్ రాగన్నగూడ కార్యాలయం వద్ద 53,56వ డివిజన్ల అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు.

## ఉత్సాహంగా 'ఉల్లాస్ – అమ్మకు అక్షరమాల' కార్యక్రమం

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఆదేశాల మేరకు గురువారం చంపాపేట ప్రాథమిక పాఠశాలలో ఉల్లాస్ "అమ్మకు అక్షరమా" కార్యక్రమాన్ని నిర్వహించారు. చదువుకు వయస్సు అడ్డంకి కాదు అక్షరాస్యతతో ఆత్మవిశ్వాసం,ఆత్మగౌరవం పెరుగుతాయి" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ అక్షరాస్యత సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ప్రజా సమస్యలు పరిష్కారించి ఆదర్శ నియోజక వర్గంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హామి ఇచ్చారు.గురువారం ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై గ్రామంలో నూతన భవనాలు ప్రారంభించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,వివిధ శాఖల అధికారులు,నాయకులు పాల్గోన్నారు.

## ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు



**ప్రజాపక్షం/షాబాద్:** హర్ ఘర్ జల్ జీవన్ మిషన్ పథకంతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నట్లు సర్పంచ్ పాలమాకుల మల్లయ్య అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో హర్ ఘర్ జల్ మిషన్ పథకం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి రభియాసుల్తానా, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కార్మిక చట్టాలు

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు



**ప్రజాపక్షం/కొత్తూరు:** కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కార్మిక చట్టాలను సవరించి నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు ఆరోపించారు. బుధవారం రాత్రి కొత్తూరు మండలానికి సిపిఐ ప్రజా చైతన్య యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రతి ఏడాది యువతకు కోటి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నేటికి ఎన్ని ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్తూరు మండలం సిద్దాపూర్‌కు ప్రమాదకరంగా మారిన చెత్త డంపింగ్ యార్డు జిఒ 641ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధికి కీలమైన పాలమూరు..రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ యాత్రలు చేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ పూర్తి చేస్తాదేమోనని భావిస్తే కాలయాపన చేస్తుందే తప్పా పనులు చేపట్టడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని, అమలు చేయని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓం శ్రీ జనార్ధన్‌రెడ్డితోపాటు కొత్తూరు మండల సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## హెచ్‌జిసిఎల్ బోర్డు పునర్ వ్యవస్థీకరణ

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జిసిఎల్) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌లను రాష్ట్రప్రభుత్వం పునర్ వ్యవస్థీకరించింది. ఈ మేర కు మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ప్లానింగ్2) శాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. హెచ్‌జిసిఎల్‌కు అప్పగించిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పరిమాణం, విస్తృతి గణనీయంగా పెరిగిన నేపథ్యంలో సంస్థ పనితీరును మరింత బలోపేతం చేయడం, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం, సమగ్ర ప్రణాళిక, భూసేకరణ, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసే లక్ష్యంతో బోర్డును పునర్వ్యవస్థీకరించినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కొత్త బోర్డు చైర్మన్‌గా మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వ్యవహరించనుండగా, హెచ్ఎండిఎ మెట్రోపాలిటన్ కమిషనర్‌కు వైస్ ఛైర్మన్ బాధ్యతలు అప్పగించారు. హెచ్‌జిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. నామినీ డైరెక్టర్లుగా జిహెచ్ఎంసి కమిషనర్, సిఎంసి, ఎంఎంసి కమిషనర్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి ఎం.డి. హైడ్రా కమిషనర్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎం.డి, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) మేనేజింగ్ డైరెక్టర్లను ప్రభుత్వం నియమించింది. ఈ ఉత్తర్వుల అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని హెచ్ఎండిఎ మెట్రోపాలిటన్ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

# సమర్థవంతం, వేగంగా పౌర సేవలు

### సిఎంసి కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** సమర్థవంతంగా, వేగంగా ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని సైబారాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ సృజన వెల్లడించారు. శేరిలింగంపల్లి జోన్ కార్యాలయంలో మౌలిక వసతుల మెరుగు కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శేరిలింగంపల్లి జోనల్ కార్యలయంలో పలు కీలక వసతులు, డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, శానిటేషన్ విభాగం కారాలయం, ఎస్‌డబ్ల్యూఎమ్ విభాగం కార్యాలయంలో నూతన విభాగాలను ప్రారంభించడంతో పాటు 150 అడుగుల జాతీయ జెండా, క్షేత్ర స్థాయి సేవల కొరకు నూతన జెసిపిలను, ఇతర వాహనాలను ప్రారంభించామని తెలిపారు. ఈ నూతన అత్యాధునిక యంత్రాల ద్వారా క్షేత్ర స్థాయిలో శేరిలింగంపల్లి జోనల్ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు సమర్థవంతంగా వేగంగా పౌర సేవలను అందించడానికి, కార్పొరేషన్ పనితీరును మెరుగు పరచడానికి దోహదపడుతాయని, పనులు వేగంగా పూర్తవుతామని తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్, టిపిఎస్‌లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

### మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనను అందించేందుకు విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మండలంలోని జన్వాడ గ్రామంలో శిథిలావస్థకు చేరిన ప్రాథమికోన్నత పాఠశాల భవనాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులు రూ.5 కోట్లతో నిర్మించిన భవనాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల జీవితం తరగతి గది నుండి ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ ఈ స్థాయి నుంచే వెళ్లి ఎన్నో ఉద్యోగ అవకాశాలను పొందుతున్నారన్నారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం బిఆర్ఎస్‌నాయకులు గౌడ చర్ల వెంకటేష్, ప్రశాంత్ యాదవ్ విద్యార్థుల కోసం తమ సొంత నిధులతో అందించిన 50సైకిళ్లను విద్యార్థులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కొండకల్ ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ సిఇఒ లెఫ్టినెట్ జనరల్ అర్జున్ రే, ప్రిన్సిపల్ ఫరీదా, మండల విద్యాశాఖ అధికారి రవీందర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దైవాదినంరెడ్డి, నాయకులు తలారి మైసయ్య, తలారి నాగేందర్, రవీందర్ గౌడ్, పొడవు శ్రీనివాస్, దోసాడ నరసింహారెడ్డి, రాజునాయక్, కురుమ వెంకటేష్, మాల చిన్న నరసింహులు, ధర్మాన్నగారి గోవర్ధన్‌రెడ్డి, గండిచేర్ల గోవర్ధన్‌రెడ్డి, బొల్లారం వెంకటరెడ్డి, బద్దం శశిధర్‌రెడ్డి, చంద్రమౌళి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు

### సలీం పాషా కుటుంబాన్ని పరామర్శించిన సబిత

రంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యుజె అధ్యక్షుడు ఎండి సలీం పాషా కుటుంబాన్ని ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. సలీం పాషా తల్లి మస్తాన్ బీ ఇటీవల మృతి చెందడంతో సలీం పాషా ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించి వారిని ఓదార్చారు. కార్యక్రమంలో టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, మాల చిన్న నరసింహులు, మాణిక్యరెడ్డి, గండిచేర్ల గోవర్ధన్‌రెడ్డి, వాసుదేవ్ కన్నా, యాదగిరి, లింగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, బద్దం శ్రీదేవి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

### మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు యత్నం

**ప్రజాపక్షం/కొత్తూరు:** యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం కొత్తూరు పోలీస్ స్టేషన్ ముందు మృతదేహంతో ధర్నా చేసేందుకు బాధిత కుటుంబ సభ్యులు యత్నించారు. ఈనెల 15న కొత్తూరు నుండి శంషాబాద్ వైపు జాతీయ రహదారిపై కారులో ఓ మైనర్ బాలుడు డ్రైవింగ్ చేస్తూ వెళ్తుండగా చేగూరు ఎక్స్‌రోడ్డు వద్ద శంషాబాద్ మండలం పెద్ద తుప్పరకు చెందిన సాయి గౌడ్ (22) రోడ్డు దాటుతుండగా కారు వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన మైనర్‌పై కేసు నమోదు చేయకుండా మరో వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి పక్కదారి పట్టించడంలో ఎవరి ప్రమేయం ఉందో చెప్పాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నాకు యత్నం చేశారు. సాయిగౌడ్ మృతికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



# సాంకేతిక విప్లవానికి మార్గదర్శకుడు రాజీవ్‌గాంధీ

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శాస్త్ర సాంకేతిక విప్లవానికి మార్గదర్శకులు, దేశానికి ఐటి రంగాన్ని తీసుకువచ్చిన ఘనత దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీదేనని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం షాద్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇబ్రహీంల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కౌన్సిలర్ చాకలి పెంటయ్య, నాయకులు చెంది తిరుపతి రెడ్డి, దంగు శ్రీనివాస్, శ్రీశైలం గౌడ్, ఖదీర్, చందు, కత్తి చంద్రశేఖర్ అప్ప, శంకర్, లింగారెడ్డి గూడ ఉప సర్పంచ్ అశోక్, మాజీ ఉపసర్పంచ్ సీతారాములు పాల్గొన్నారు.







**ఎల్‌బి నగర్ :** దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను మరువలేనివని బైరామల్‌గూడ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు గొపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎల్‌బి నగర్ చౌరస్తాలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

**హస్తినాపురం డివిజన్‌లో...** రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా హస్తినాపురం డివిజన్‌లోని చైతన్య నగర్ కాలనీ కమాన్ వద్ద రాజీవ్ విగ్రహానికి దెంది శశిధర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంజీవ్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాంరెడ్డి, నాగిరెడ్డి, మధుసూదన్, గోవర్ధన్, పరమేష్ పాల్గొన్నారు.

**రంగారెడ్డి:** దేశంలో సాంకేతిక విప్లవానికి తొలి అడుగులు వేసిన మహనీయుడి రాజీవ్ గాంధీ అని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. గురువారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేటలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చల్లా నర్సింహారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి సిద్దాల దశరథ, మీర్‌పేట డివిజన్ అధ్యక్షులు చల్లా బాల్ రెడ్డి, జిల్లాలగూడ డివిజన్ అధ్యక్షులు సిద్దాల శ్రీశైలం, ప్రశాంతి హిల్స్ డివిజన్ సురేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

**హయత్‌నగర్:** రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని హయతనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేన్నగొని రవీందర్‌గౌడ్ ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం నర్సింహారెడ్డి, సుజాతరెడ్డి తదితరులు పాల్గొన్నారు .

**యాచారం :** రాజీవ్ గాంధీ అశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ యాచారం మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం అన్నారు. గురువారం యాచారం మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ జయంతి సంధర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో మేడిపల్లి గ్రామ సర్పంచ్ ముచర్ల సుగుణ సంపత్, కిషన్‌నాయక్, రాజు గౌడ్, ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మస్కు నర్సింహ్మా, అక్బర్, పోలమోని రామకృష్ణ యాదవ్, హరికిషన్, పాశం జయ ప్రకాశ్, మల్లేశ్, నరేంధర్, శేఖర్, బుచ్చయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.





# రాజీవ్‌ను స్మరించుకున్న భారతావని

## వీర్‌భూమిలో నివాళి అర్పించిన కాంగ్రెస్ నేతలు



**న్యూఢిల్లీ :** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గురువారం యావత్ భారతావని ఆయనకు నివాళి అర్పించింది. రాజీవ్ ఆగస్టు 20, 1944లో జన్మించగా, మే 21, 1991లో మరణించారు. ఆయన అక్టోబరు 31, 1984 నుంచి డిసెంబరు 2, 1989 వరకు ప్రధానమంత్రిగా ఉన్నారు. కాగా, ఆయన 82వ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ అగ్రనేతలు, పార్టీ సీనియర్ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఢిల్లీలోని వీర్ భూమిలో ఉన్న రాజీవ్ గాంధీ స్మారక చిహ్నం వద్ద కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా పుష్పాంజలి ఘటించారు. 'సద్భావనా దినోత్సవం సందర్భంగా, లక్షలాది మందిలో ఆశను మేల్కొల్పి, 21వ శతాబ్దపు వాగ్దానాలకు భారతదేశాన్ని సిద్ధం చేయడంలో సహాయపడిన దార్శనిక నాయకుడు రాజీవ్ గాంధీని మనం స్మరించుకుంటున్నాము అని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ తాను ప్రతిపాదించిన పరివర్తనాత్మక మార్పులలో, భారత యువతపై, సాంకేతిక పురోగతిపై, నూతన ఆలోచనల శక్తిపై ఆయనకున్న అచంచలమైన విశ్వాసంలో తన వారసత్వాన్ని సజీవంగా నిలుపుకున్నారని ఖర్గే చెప్పారు. 'మేధో స్వేచ్ఛ, నూతన ఆవిష్కరణలు, మన యువత ఆకాంక్షలను పెంపొందిస్తూనే, భారతదేశపు శాశ్వతమైన సానుభూతి, సామరస్యం, సయోధ్య స్ఫూర్తిని బలోపేతం చేయడమే రాజీవ్ జీకి మనం ఇవ్వగల అత్యంత అర్థవంతమైన నివాళి అవుతుంది' అని కాంగ్రెస్ అధినేత అన్నారు. మరో పోస్ట్‌లో, కాంగ్రెస్ అధినేత రాజీవ్ గాంధీ చెప్పిన ఒక కొటేషన్‌ను పంచుకుంటూ, 'రాజీవ్ గాంధీజీ భారత యువతలో కేవలం భవిష్యత్తును మాత్రమే చూడలేదు, భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తిని కూడా చూశారు' అని పేర్కొన్నారు. సద్భావన దివస్ సందర్భంగా, ఆ యువ దార్శనికతకు, ఆ ముందుచూపుకు, భారతదేశపు ఆ స్వప్నానికి వందనాలు అని, అది ఈనాటికీ ప్రతి నూతన తరానికి ముందుకు సాగడానికి, కొత్తగా ఆలోచించడానికి, పెద్ద కలలు కనడానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. 'భారతీయుల మధ్య సామరస్యం, ప్రతి హృదయంలో కరుణ, ప్రతి పౌరుడికి న్యాయం, ప్రజాస్వామ్యంలో సమాన హక్కులు నాన్నా, మీరు చెప్పిన ఈ బోధనే నా బలం, మీ జ్ఞాపకాలే నా ధైర్యం' హిందీలో రాసిన ఒక పోస్ట్‌లో రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'మీరు కలలు కన్న భారతదేశాన్ని నిర్మించాలన్న సంకల్పం నాకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటుంది' అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. దేశవ్యాప్తంగా యువతలో నెలకొన్న ఆందోళనల నేపథ్యం లో, ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ కనీస ఓటింగ్ వయస్సును తగ్గించి 18 ఏళ్ల వారికి ఓటు హక్కు కల్పించి, భారత దేశాన్ని ఐటి యుగంలోకి నిర్ణయాత్మకంగా నడిపించారనే విషయాన్ని గుర్తు చేసుకోవడం చాలా ముఖ్యం అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా 1988లో నూతన విద్యా విధానాన్ని రూపొందించారని, ఈ విధానంలోని అనేక ఆవిష్కరణలతో పాటు, దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయాల నెట్వర్క్‌ను కూడా స్థాపించారని రమేశ్ గుర్తుచేసుకున్నారు. మరో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ మాట్లాడుతూ, 'భారతరత్న దివంగత శ్రీ రాజీవ్ గాంధీజీ జయంతి సందర్భంగా వారిని ప్రగాఢమైన ఆప్యాయతతో, గౌరవంతో స్మరించుకుంటున్నాము. లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చి, మన దేశాన్ని 21వ శతాబ్దానికి సిద్ధం చేసేందుకు పరివర్తన చెందించిన ఒక దార్శనిక, చైతన్యవంతమైన నాయకుడు. ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు కూడా సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో ఉన్న రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు.

## విద్యార్థుల కంటే మంత్రుల

# కుక్కలకే మెరుగైన సౌకర్యాలు

### ప్రభుత్వ పాఠశాలల్లో దయనీయ స్థితిపై సిజెపి కన్వీనర్ దీప్కే ఆందోళన



**లాతూర్:** ప్రభుత్వ పాఠశాలల్లో దయనీయ స్థితిపై క్రాంతి జనతా పార్టీ (సిజెపి) కన్వీనర్ అభిజీత్ దీప్కే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల కంటే మంత్రుల కుక్కలకే మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయని ఆరోపించారు. మహారాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత వారం 'స్కూల్ ఠీక్ కరో' (ప్రభుత్వ పాఠశాలలను బాగుచేయండి) అనే ప్రచారాన్ని ప్రారంభించిన దీప్కే బృందం గురువారం మహారాష్ట్ర లాతూర్ జిల్లా ఔసా తహసీల్ పరిధిలో ఉన్న ఉజని గ్రామంలోని ఒక జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించింది. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల దుస్థితికి ప్రజాప్రతినిధులు, మంత్రులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అనేక పాఠశాలల్లో సరైన తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు, సురక్షితమైన రహదారి సౌకర్యాలు వంటి కనీస వసతులు కూడా లేవని ఆయన పేర్కొన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల పట్ల జంతువుల కంటే హీనంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. 'ఇది విద్యార్థుల జీవితాలకు సంబంధించిన విషయం. రాజకీయ నాయకులు విద్యార్థుల కోసం ఏమీ చేయనప్పుడు, ప్రజలు వారికి ఎందుకు ఓటు వేయాలి? కేవలం హెలికాప్టర్లలో తిరగడానికే ప్రజలు వారికి ఓట్లు వేస్తారా? తమ పిల్లలు ఎలాంటి పరిస్థితుల్లో చదువుకుంటున్నారో ప్రజలు గమనించాలి. ఈ మంత్రుల కుక్కలకు కూడా దీనికంటే మెరుగైన సౌకర్యాలు ఉంటాయి' అని ఆయన అన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ముందుగా విద్య కోసం కృషి చేసి, ఆ తర్వాతే ఓట్లు అడగడానికి వచ్చేలా ప్రజలు వారిపై ఒత్తిడి తీసుకురావాలని దీప్కే కోరారు. తమ గ్రామానికి వచ్చే నాయకులకు, వారు ఏ పార్టీకి చెందినవారైనప్పటికీ, విద్య కోసం కృషి చేయాలని ప్రజలు చెప్పాలి. విద్య కోసం పని చేసే వరకు ఓట్ల కోసం తమ ఇంటి గడప తొక్కవద్దని వారికి చెప్పాలని పిలుపునిచ్చారు. రాజకీయాల కోసం మనం కుల, మతాల జెండాలు పట్టుకుని బయటకు వస్తాం. అదే విధంగా, మన పిల్లల పాఠశాలల కోసం కూడా మనం బయటకు రావాలన్నారు. దాదా భూసే పాఠశాల విద్యాశాఖ మంత్రిగా కొనసాగాలా అని అడిగినప్పుడు, 'పాఠశాలల పరిస్థితి చూస్తుంటే, విద్యాశాఖ మంత్రి ఆ పదవిలో కొనసాగకూడదని నాకు అనిపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వం అర్థం చేసుకోవాలంటే, మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ సొంత పిల్లలను ఈ పాఠశాలల్లోనే చదివించాలి అని ఆయన సమాధానమిచ్చారు. అనేక ఏళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయమైన మార్పులు తీసుకురావడంలో పాలక వర్గం విఫలమైందని దీప్కే ఆరోపించారు. సిజెపి తనిఖీల కారణంగా అధికారులు పాఠశాలల్లో కొన్ని పనులు ప్రారంభించారని దీప్కే తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని ఆయన అన్నారు. 'ప్రజలు మళ్లీ తమ గళాన్ని వినిపించడం మొదలుపెట్టారు. ప్రజాస్వామ్యంలో మరిన్ని సంస్థలు, ఉద్యమాలు రావాలి. ఎంత ఎక్కువ మంది ప్రజలు ముందుకు వచ్చి మాట్లాడితే, మన ప్రజాస్వామ్యం అంత బలంగా మారుతుంది' అని ఆయన అన్నారు.

# బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా అలంఘీర్ గెలుపు

### నేడు ప్రమాణ స్వీకారం



**ఢాకా:** బంగ్లాదేశ్ అధ్యక్ష పదవికి గురువారం జరిగిన ఎన్నికల్లో అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్‌పార్టీ (బిఎన్‌పి) అభ్యర్థి మీర్జా ఫక్రుల్ ఇస్లాం అలంఘీర్ (78) విజయం సాధించారు. శుక్రవారం (ఆగస్టు 21) సాయంత్రం బంగబంధు దర్బార్ హాలులో ఆయన ప్రమాణ స్వీకారం చేస్తారు. గడచిన 15 సంవత్సరాలుగా బిఎన్‌పిలో ఆయన నెంబర్–2 స్థానంలో కొనసాగుతున్నారు. బంగ్లాదేశ్‌కు అలంఘీర్ 23వ అధ్యక్షుడు. లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి) అభ్యర్థి కల్నల్ (రిటైర్డ్) ఓలి అహ్మద్(84) ప్రధాన ప్రత్యర్థిగా అలంఘీర్‌పై పోటీ చేశారు. జమాత్–ఎ–ఇస్లామీ నాయకత్వానగల 11 రాజకీయపార్టీలతో కూడిన కూటమి అభ్యర్థిగా అలంఘీర్‌తో ఓలి అహ్మద్ పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో అర్హులైన 349 మంది చట్టసభ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అలంఘీర్‌కు 255 ఓట్లు వచ్చాయి.గడచిన 35 సంవత్సరాలలో మొదటిసారి బంగ్లాదేశ్‌లో ఎన్నికల ప్రక్రియ ద్వారా దేశాధ్యక్షుణ్ణి ఎన్నుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. 1991 తర్వాత అధ్యక్ష పదవికి బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి. దేశాధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ పదవీకాలం ముగియక ముందే వైదొలగడంతో ఈ ఎన్నికలకు అనివార్యమయ్యాయి.పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి షేక్ హసీనాకు షహబుద్దీన్ అత్యంత సన్నిహితుడు.ఆరోగ్య సమస్యల కారణంగా గతనెలలో పదవి నుండి వైదొలగారు. బంగ్లాదేశ్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు పదవీ విరమణ చేసిన తర్వాత 90 రోజుల వ్యవధిలో కొత్తవారిని ఆ పదవికి ఎన్నుకోవాలి. పార్లమెంటు స్పీకర్ హాఫీజ్ ఉద్దీన్ అహ్మద్ తాత్కాలికంగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్‌పార్టీ ఈ ఏడాది ఫిబ్రవరి 12 వ తేదీన జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది. భారీఎత్తున మూడింట రెండు వంతుల మెజారిటీ సంపాదించింది. ప్రధానమంత్రి తారిఖ్ రెహ్మాన్ పార్టీ అధ్యక్ష హోదాలో బిఎన్‌పి అభ్యర్థిగా అలంఘీర్‌ను ఎంపిక చేసి బరిలోకి దింపారు. 2011లో ఆయన మొదట తాత్కాలిక సెక్రటరీ జనరల్‌గా బాధ్యత లు చేపట్టారు.తారిఖ్ రెహ్మాన్ విదేశాలలో ఉం డటం, ఖలీదా జియా జైలులో ఉండటం, తర్వా త అనారోగ్యానికి గురికావడంతో దేశంలో ఆయ నే పార్టీ పెద్దగా షేక్‌హసీనా ప్రభుత్వంపై ప్రతిప క్ష హోదాలో పార్టీని నడిపించి పోరాటం చేశారు.

# కొందరు ఉద్యోగులకు ఊరట

### 11, 13వ జెపిఎస్‌సి పరీక్షలు, నియామకాల రద్దుపై జార్ఖండ్ హైకోర్టు స్టే




**రాంచి :** జార్ఖండ్‌లో కొందరు ఉద్యోగులకు ఊరట లభించింది. 11వ నుంచి 13వ జార్ఖండ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్‌సి) పరీక్షల ద్వారా జరిగే ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలను రద్దు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్ల అమలుపై జార్ఖండ్ హైకోర్టు గురువారం స్టే విధించింది. ఆహార భద్రతా అధికారుల నియామకాలను రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై కూడా స్టే ఇచ్చింది. ప్రభుత్వ నోటిఫికేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన హైకోర్టు, తదుపరి విచారణను సెప్టెంబర్ 15కు వాయిదా వేసింది. ఈలోగా తమ సమాధానాన్ని సమర్పించాలని కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. 11వ నుంచి 13వ జెపిఎస్‌సి ద్వారా జరిగే నియామకాలను రద్దు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్లపైనా, అలాగే ఆహార భద్రతా అధికారుల నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌పైనా కోర్టు ప్రాథమికంగా స్టే విధించిందని పిటిషనర్ల తరపు న్యాయవాది అమృతాంశ్ వాట్స్ తెలిపారు. ఇది సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘిస్తోందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారని, అందుకే ఈ విషయంపై స్టే విధించారని ఆయన తెలిపారు. కోర్టు విధించిన ఈ స్టే వల్ల సుమారు 450 మంది అభ్యర్థులకు ఉపశమనం లభించిందని ఆయన అన్నారు. కాగా, జార్ఖండ్ నియామక పరీక్షలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థులు 25 రోజుల పాటు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో, 2014 నుంచి రాష్ట్ర పిఎస్‌సి, ఔట్‌సోర్స్ ఏజెన్సీ నిర్వహించిన 45 పరీక్షలను జెఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వం ఇటీవల రద్దు చేసి, వాటిపై విచారణకు ఆదేశించింది.

**ఉద్యోగుల నిరసనలు**

నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ప్రభుత్వం 22 పరీక్షలను రద్దు చేస్తూ, మరో 23 పరీక్షలపై విచారణకు ఆదేశిస్తూ జారీ చేసిన నోటిఫికేషన్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం రాంచీలో ఇటీవల నియామక పరీక్షల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన సుమారు 2,700 మంది అభ్యర్థులు నిరసన చేపట్టారు. తమను నిష్పక్షపాతంగా, సక్రమంగా పరీక్షలలో ఉత్తీర్ణులైనందుకే నియమించారని పేర్కొంటూ, వారు రాష్ట్ర సచివాలయం వెలుపల ఈ ప్రదర్శన నిర్వహించారు. జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ –కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష ద్వారా నియమితులైన సుమారు 2,000 మందితో సహా, దాదాపు 2,700 మంది ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టినట్లు ఒక ప్రదర్శనకారుడు తెలిపారు.

# 'వందేమాతరం' కుదింపు చట్ట ధిక్కరణే: అమిత్ షా

**చెన్నై :** కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చట్టాన్ని ధిక్కరిస్తూ, కేవలం ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకునేందుకే వందేమాతరం గీతంలోని రెండు చరణాలను మాత్రమే పాడాలని కాంగ్రెస్ నిర్ణయించిందని ఆయన ఆరోపించారు. జాతీయ గీతాన్ని (వందేమాతరం) పూర్తిగా పాడకుండా కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) బుధవారం తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ, షా దేశ విభజన చరిత్రను గుర్తుచేశారు. అలాగే, గతంలో వందేమాతరం గేయాన్ని కుదించడం వల్ల దేశం ఎదుర్కొన్న పరిణామాలను ఆయన నొక్కి చెప్పారు. '1937లో, బుజ్జగింపు రాజకీయాల కోసం కాంగ్రెస్ పార్టీయే వందేమాతరం గేయాన్ని రెండు భాగాలుగా విభజించింది. అక్కడి నుంచే ద్విజాతి సిద్ధాంతం బలపడి, చివరికి దేశ విభజనకు దారితీసింది. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా, మోదీ ప్రభుత్వం ఆ చారిత్రక తప్పిదాన్ని సరిదిద్ది, ఆ గీతం మొత్తానికి చట్టపరమైన గుర్తింపును కల్పించింది. కానీ రాహుల్ గాంధీ నాయకత్వంలో, కాంగ్రెస్ పార్టీ తన ఓటు బ్యాంకు కోసం మరోసారి అదే బుజ్జగింపు రాజకీయాల బాటలో నడుస్తోంది' అని షా ఎక్స్‌లో పేర్కొన్నారు. వందేమాతరం గేయాన్ని విభజించే తప్పు గతంలోనే ఒకసారి జరిగిందని, దాని పర్యవసానాలను దేశం అనుభవించిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న ఈ బుజ్జగింపు విధానానికి వ్యతిరేకంగా దేశ ప్రజలందరూ ఏకమై తమ గళాన్ని వినిపించాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఇకపై పార్టీ కార్యక్రమాలన్నింటిలోనూ వందేమాతరంలోని రెండు చరణాలను మాత్రమే పాడాలని, తద్వారా 1937లో ఆ అంశంపై పార్టీ అత్యున్నత నిర్ణయాధికార మండలి తీసుకున్న తీర్మానానికి కట్టుబడి ఉండాలని సిడబ్ల్యుసి బుధవారం నిర్ణయించింది. ఓట్ల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ 'కొత్త ముస్లిం లీగ్'గా మారిపోయిందని ఆరోపిస్తూ బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

### ఆరు సరిహద్దు రాష్ట్రాలు, జమ్ముకశ్మీర్, లధాఖ్ 'యుటి'ల...

# జిల్లా కలెక్టర్లకు పౌరసత్వం మంజూరు అధికారం

### హోం మంత్రిత్వ శాఖ వెల్లడి

**న్యూఢిల్లీ:** గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపుర ( గిరిజన ప్రాంతాలు మినహా) మొదలైన ఆరు సరిహద్దు రాష్ట్రాలు, జమ్మూ కశ్మీర్, లధాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలలో సాధారణంగా నివసించే 'సరైన' దరఖాస్తు దారులకు సహజసిద్ధ పౌరసత్వం మంజూరు చేసే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కల్పించింది. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో, 'రిజిస్ట్రేషన్' లేదా సహజీకరణ' కోసం పౌరసత్వం కోరుతూ వచ్చే దరఖాస్తులను పరిశీలించే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు కల్పిస్తూ, ప్రభుత్వం బుధవారం పౌరసత్వ మూడవ సవరణ నిబంధనలు–2026ను నోటిఫై చేసింది.'దరఖాస్తు దారుని యోగ్యత పట్ల, అంటే, అతను రిజిస్ట్రేషన్ సహజ పౌరసత్వం పొందడానికి తగిన, సరైన వ్యక్తి అని కలెక్టర్ సంతృప్తి చెందిన తర్వాత అతనికి భారత పౌరసత్వాలు మంజూరు చేయాలి' అని నోటిఫైడ్ రూల్స్ వెల్లడించాయి. ఈ రాష్ట్రాలలోని జిల్లా కలెక్టర్లు, గతంలో ఈ అధికారాలు కలిగిన అధికార కమిటీలు, నియమించబడిన అధికారుల స్థానాన్ని భర్తీ చేస్తారు.గెజిట్ నోటిఫికేషన్‌లో నిర్దేశించిన పారామితులకు అనుగుణంగా దరఖాస్తులను 'స్వీకరించడానికి, 'పరిశీలించడానికి', 'పరిష్కరించడానికి, ఈ ప్రాంతాల్లోని జిల్లా కలెక్టర్లకు హోం మంత్రిత్వ శాఖ అధికారం ఇచ్చింది. కొత్త రూల్స్ గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అసోం, త్రిపురలతో పాటు, జమ్మూ కశ్మీర్, లధాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలలో నివసిస్తున్న పౌరసత్వం కోరుకునే దరఖాస్తుదారులకు వర్తిస్తాయి. అసోం, త్రిపురలో ఈ నిబంధనలు గిరిజన ప్రాంతాలను ప్రత్యేకంగా మినహాయిస్తాయి. కొత్త నిబంధనలు, నమోదు లేదా పౌరసత్వం కోసం అభ్యర్థనలను 'ఎలక్ట్రానికల్లీ'గా లేదా సహజీకరణగా స్వీకరించడానికి జిల్లా కలెక్టర్‌ను 'కాంపిటీషన్ అథారిటీ'గా నియమిస్తాయి.నిర్దిష్ట ప్రాంతాలలోని ఆ కమిటీలు లేదా జిల్లా స్థాయి కమిటీల వద్ద ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను తక్షణమే సంబంధిత కలెక్టర్‌కు బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సమర్పించిన తర్వాత, సిస్టమ్ స్వయం చాలకంగా ఒక రసీదును జారీచేస్తుంది. అనంతరం, జిల్లా కలెక్టర్ సమర్పించిన అన్ని వివరాలను ధృవీకరించి, దరఖాస్తుదారుని వివరాలను నిర్ధారించడానికి అవసరమైన విచారణలను నిర్వహిస్తారు. 'అయితే, దరఖాస్తుదారు వ్యక్తిగతంగా హాజరు కావాలనే నిబంధనలను కొత్తనియమాలు కొనసాగిస్తున్నాయి. ఒకవేళ 'సముచితమైన అవకాశాలు కల్పించినప్పటికీ, దరఖాస్తుదారుడు దరఖాస్తు సమర్పించడానికి వ్యక్తిగతంగా హాజరుకాకుండా విధేయతా ప్రమాణం చేయడంలో విఫలమైతే, కలెక్టర్ ఆ దరఖాస్తును తిరస్కరిస్తారు' అని నోటిఫైడ్ రూల్స్ వెల్లడించాయి. ఆ రద్దుకు ముందు జరిగిన లేదా చేయకుండా వదిలివేయబడిన పనులకు సంబంధించిన విషయాలలో తప్ప ప్రభుత్వం గత ఆదేశాలను కూడా రద్దు చేసింది.

## లధాఖ్‌లో హైకోర్టు బెంచ్: ప్రజలకు అందుబాటులో న్యాయం

**న్యూఢిల్లీ:** కేంద్రపాలిత ప్రాంతమైన లధాఖ్‌లో జమ్మూకశ్మీర్ హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో అక్కడి ప్రజలకు న్యాయం మరింతగా అందుబాటులోకి వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. అత్యంత దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు దీని ద్వారా న్యాయం చేరువవుతుందని తన 'ఎక్స్'లో పోస్టులో పేర్కొన్నారు. ప్రజలకు అత్యవసరమైన, వారికి దక్కాల్సిన న్యాయపరమైన సేవలను పొందడానికి ఉపయోగపడే రీతిలో ప్రధాని నరేంద్ర మోదీ లధాఖ్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటును ప్రతిపాదించారని, ఇటీవలి కేబినెట్ సమావేశంలో ఆమోదం కూడా లభించిందని అమిత్ షా వివరించారు. లధాఖ్ అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### లైంగిక దాడి కేసులో శిక్షను వ్యతిరేకిస్తూ..

# 'సుప్రీం'ను ఆశ్రయించిన తరుణ్ తేజ్‌పాల్




**న్యూఢిల్లీ :** ఒక లైంగిక దాడి (2013) కేసులో తెహెల్కా డాట్ కామ్ మాజీ ఎడిటర్–ఇన్ చీఫ్ తరుణ్ తేజ్‌పాల్ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బాంబే హైకోర్టు ఆగస్టు 6వ తేదీ ఉత్తర్వుకు వ్యతిరేకంగా న్యాయవాది ఆదిత్య సమద్దార్ ద్వారా ఆయన అప్పీల్ దాఖలు చేశారు. దీనికిముందు, ఈ కేసులో యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని వాదిస్తూ , తెహెల్కా మాజీ సంపాదకుడు తరుణ్ తేజ్‌పాల్‌కు కఠినమైన శిక్ష విధించాలని కోరుతూ గోవా ప్రభుత్వం గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది.5 ఏళ్ల క్రితం ట్రయల్ కోర్టు ఇచ్చిన నిర్దోషి తీర్పును రద్దుచేస్తూ, హైకోర్టు తేజ్‌పాల్‌ను అత్యాచారంకేసులో దోషిగానిర్ధారించి,10ఏళ్లకఠినకారాగార శిక్ష విధించింది.2013లో గోవాలో ఆ పత్రిక నిర్వహించిన ఒక కార్యక్రమం సందర్భంగాహోటల్ ఎలివేటర్ లోపల తన జూనియర్ కొలీగ్‌పై అత్యాచారానికి ఒడిగట్టినందుకు తరుణ్ తేజ్‌పాల్‌ను కోర్టు దోషిగా నిర్ధారించింది. అంతకుముందు, ఆ జర్నలిస్ట్ తాను 'ఒక రాజకీయ బాధితుడిని' అని వాదించాడు. తేజ్‌పాల్ చేసిన నేరాల స్వభావానికి, తీవ్రతకు ,హైకోర్టు విధించిన శిక్ష ఏ మాత్రం అనుపాతంలో లేదని, గోవా ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో వాదించింది.'ప్రస్తుత కేసులో శిక్షను, యావజ్జీవ కారాగార శిక్షగా లేదా, ఈ కోర్టు సముచితమని భావించే అటువంటి పెంచిన శిక్షగా పెంచడానికి ఆస్కారం ఉంది.ఈ శిక్షలు ఏకకాలంలో అమలు కావాలని ఆదేశించి ఉండకూడదు'అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ సవాల్ కేవలం వాక్య పరిమాణానికి, వాక్యాల ఏకకాలిక కార్యాచరణ దిశకు మాత్రమే పరిమితమైందని ఆ పిటిషన్ తెలిపింది.తన తీర్పులో హైకోర్టు, ట్రయల్ కోర్టు 2021నాటి ఉత్తర్వును 'విపరీతమైనది'గా అభివర్ణించింది.లైంగిక బాధితురాలు ఒక 'పరిపూర్ణమైన బాధితురాలి'గా ఉండాలి. తన మాటలు నమ్మదగినవిగా అనిపించేలా ఒక నిర్దిష్ట పద్ధతిలో ప్రవర్తించాలని, అనే భావనకు ఆ ఉత్తర్వులోనైందని పేర్కొంది.రెండు వారాలలోగా లొంగిపోవాలని హైకోర్టు తరుణ్ తేజ్‌పాల్‌ను ఆదేశించింది. కానీ, తర్వాత అతని న్యాయవాదుల అభ్యర్థన మేరకు ఆ గడువును నాలుగువారాలకు పొడిగించింది. కోర్టు తన 81పేజీల తీర్పులో, బాధితురాలిని నిందితుల బోనులో నిలబెట్టి ఆమె వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించిన తీరును హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది.అంతేకాకుండా, 'క్రాస్ ఎగ్జామినేషన్' సమయంలో ట్రయల్ కోర్టు 'మౌనంగా ఉండి, నిందితులు ఆమెను వేధించడానికి, అవమానించడానికి అనుమతించడం ఆశ్చర్యం కలిగించింది' అని పేర్కొంది. తేజ్‌పాల్‌పై భారత శిక్షా స్మృతి (ఐపిఎస్) లోని అభియోగాలు మోపబడినా 376 (2) ఎఫ్ (నమ్మకం లేదా అధికారంలో ఉన్న స్థానంలో ఉన్నటువంటి వ్యక్తి చేసిన అ త్యాచారం) , 354 (ఎ) (లైంగిక వేధింపులు) వాటిలో 354 (బి) (దుస్తులు తొలగించే ఉద్దేశంతో దాడి చేయడం, లేదా నేరపూరిత బలాన్ని ప్రయోగించడం) ఉన్నాయి.సెక్షన్ 376 (2) ఎఫ్ కింద గరిష్ఠ శిక్ష యావజ్జీవ కారాగారశిక్ష. అయితే, తేజ్‌పాల్ తాను ఒక రాజకీయ బాధితుడినని, ఇద్దరు బిడ్డల తండ్రినని పేర్కొంటూ కనికరం చూపాలని వేడుకున్నారు. కాగా, గోవా ప్రభుత్వం నుంచి హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా 'కాదు అంటే కాదు' (ససేమిరా) అనే గట్టి సందేశాన్ని పంపడానికి అతనికి గరిష్ఠ శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. తీర్పు తర్వాత తరుణ్ తేజ్‌పాల్ విలేకరులతో మాట్లాడుతూ తాను సుప్రీంకోర్టులో ఈ తీర్పును సవాల్‌చేస్తానని, చివరికి నిజం బయటపడుతుందనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.


# సిఎంఆర్‌ఎల్ లావాదేవీలలో సిపిఐకి ఎలాంటి పాత్ర లేదు

### సిపిఐ కేరళం రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం

**తిరువనంతపురం:** కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణా టి.కి సంబంధించిన సిఎంఆర్‌ఎల్ కేసుపై తలెత్తిన ప్రశ్నలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం త్రోసిపుచ్చారు. ఎల్‌డిఎఫ్ రాజకీయాలు వ్యాపార వ్యవహారాలకు భిన్నమైనవని, అటువంటి లావాదేవీలలో తమ పార్టీకి ఎలాంటి పాత్ర లేదని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయనను ఈ అంశంపై విలేకరులు ప్రశ్నించగా, బినోయ్ విశ్వం స్పందిస్తూ, ఈ వ్యవహారానికి సిపిఐతో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అలాంటి ఆర్థిక లావాదేవీలలో పార్టీకి ఎప్పుడూ పాత్ర లేదు, భవిష్యత్తులోనూ ఉండదన్నారు. లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)లో సిపిఐ ప్రధాన భాగస్వామిగా ఉన్నది. వీణాపై ఇడి నమోదు చేసిన కేసు రాజకీయ ప్రేరేపితమని సిపిఐ(ఎం) చేసిన వాదనను సిపిఐ ఏకీభవిస్తుందా అని ప్రశ్నించగా, రాజకీయాలు వ్యాపారానికి భిన్నమైనవని, దీనిపై సిపిఐకి ఎలాంటి ఆసక్తి లేదని విశ్వం బదులిచ్చారు. బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో, కొన్ని నిధుల బదిలీల వివరాలతో చేతిరాతతో రాసి ఉన్న నోట్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది.

**సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో దోషి**

# కాంగ్రెస్ మాజీ ఎంపి సజ్జన్ కుమార్ మృతి



**న్యూఢిల్లీ :** సిక్కు వ్యతిరేక అల్లర్ల (1984)కేసులో దోషిగా తేలి జైలు శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపి సజ్జన్ కుమార్ (80) కన్నుమూశారు. తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఆయనను గురువారం ఉదయం ఢిల్లీలోని విఎంఎంసి, సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సజ్జన్ మృతి చెందినట్లు ప్రకటించారు. అయితే మరణానికి గల కారణాలను వైద్యులు ఇంకా నిర్ధరించలేదు. కానీ అనారోగ్యంతో కన్నుమూసినట్లు తెలిపారు. ఆయనకు అధిక రక్తపోటు, పార్కిన్సన్స్ వ్యాధి ఉన్నాయని, గతంలోనూ పలుమార్లు ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు వైద్యులు పేర్కొన్నారు. గురువారం ఉదయం సుమారు 11 గంటలకు పోలీసులు సజ్జన్ కుమార్‌ను తీసుకొచ్చినట్లు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి ఒక ప్రకటనను విడుదల చేసింది. అప్పటికే ఆయనలో స్పృహలో లేరని, వెంటనే అత్యవసర వైద్య చికిత్సతో పాటు అవసరమైన అన్ని లైఫ్ సపోర్ట్ చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయిందని అధికారులు తెలిపారు. దీంతో మధ్యాహ్నం 12.30 గంటలకు సమయంలో ఆయన మృతి చెందినట్లు ప్రకటించామని అన్నారు.

**మూడు సార్లు లోక్‌సభకు ఎన్నిక**

సజ్జన్ కుమార్ ఢిల్లీ రాజకీయాల్లో ఒకప్పుడు కీలక నేతగా గుర్తింపు పొందారు. ఔటర్ ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా 1980, 1991, 2004లో మూడు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. రాజకీయాల్లోకి రాకముందు బేకరీ వ్యాపారం నిర్వహించిన ఆయన, తొలుత కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. మాజీ కాంగ్రెస్ నేత సంజయ్ గాంధీకి సన్నిహితుడిగా కూడా ఆయనకు పేరుంది. సజ్జన్ కుమార్ పేరు 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులతో ముడిపడి ఉంది. అప్పటి ప్ర ధాని ఇందిరాగాంధీ హత్య అనంతరం ఢిల్లీలో జరిగిన హింసకు సంబంధించి ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులపై దాదాపు మూడు దశాబ్దాల పాటు న్యాయపోరాటం సాగింది. వివిధ కోర్టుల్లో కొన్ని కేసుల్లో ఆయనకు విముక్తి లభించగా, మరికొన్ని కేసుల్లో దోషిగా తేలారు.

**ఐదుగురి హత్య కేసులో జీవిత ఖైదు**

ఢిల్లీలోని రాజ్‌నగర్ ప్రాంతంలో ఓ కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులను హత్య చేయడం, గురుద్వారాకు నిప్పుపెట్టిన ఘటనకు సంబంధించిన కేసులో సజ్జన్ కుమార్‌కు తొలుత ట్రయల్ కోర్టు విముక్తి కల్పించింది. అయితే ఈ తీర్పును ఢిల్లీ హైకోర్టు 2018 డిసెంబర్ 17న కొట్టివేసింది. సజ్జన్ కుమార్‌ను దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు విధించింది. దీంతో ఆయన 2018 డిసెంబర్‌లో లొంగిపోయి జైలుకు వెళ్లారు. అప్పటి నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఈ తీర్పుపై ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లగా ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది.

# ఇరాన్‌పై ట్రంప్ ఆర్థిక యుద్ధం

### వాళ్ళకు ఏ మార్గంలోనూ జీవనాధారం అందించకూడదు

### ఏకాకిని చేసి ఓడిద్దాం : కలిసి రావాలని మిత్రదేశాలకు పిలుపు



**వాషింగ్టన్ :** యుద్ధం కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఇరాన్‌ను ఆర్థికంగా మరింతగా అణచివేసి లొంగదీసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో అస్త్రం ప్రయోగించారు. ఇరాన్‌తో ఆర్థిక లావాదేవీలు, జీవనాధార సహకారం అందించకుండా ''ఎకనామిక్ ఆపరేషన్'' (ఎకనామిక్ డి–డే)నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి చర్యలను ఉల్లంఘించి మద్దతు ఇచ్చి ఆ దేశంతో వ్యాపారం చేసే ఏ దేశమైనా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని ట్రూత్ సోషల్ వేదికగా హెచ్చరిక చేశారు. ''ఈ ఉన్మాదులు బలహీనపడిపోయారు, ప్రపంచవ్యాప్తంగా భయోత్పాతం సృష్టించే వారి సామర్థ్యాన్ని ఈ చారిత్రాత్మక చర్యలు దెబ్బతీస్తాయి,ఇరాన్‌కు ఎప్పటికీ అణ్వాయుధం ఉండదు'' అని పేర్కొన్నారు. ఇరాన్ తమ దేశంపై రెండు క్షిపణులు ప్రయోగించిందని, ఆ క్షిపణులు సముద్రంలో పడిపోయాయని ఆరోపించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వెనువెంటనే, ఇరాన్‌తో వాణిజ్య లావాదేవీలు రద్దుచేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఆ మరునాడే ట్రంప్ ఈ ''ఆర్థిక వెలి'' ప్రకటన చేశారు. ఇప్పటివరకూ ఆయన చేసిన లెక్కలేనన్ని బెదిరింపులు,ప్రకటనలన్నీ చాలా వరకూ ఆచరణ సాధ్యం కాలేదు. ఇరాన్‌తో భారీ వ్యాపారం చేసేది చైనా ప్రభుత్వమే. ఇరాన్ నుండి 80 శాతం చమురు ఎగుమతులు చైనాకే వెళతాయి. ట్రంప్ ప్రకటనపై చైనా, రష్యాలు ఇంకా స్పందించలేదు. అమెరికాకు కీలకమైన ఖనిజాలను ఎగుమతి చేసే చైనాతో ట్రంప్ ఈ పేరుతో కయ్యానికి దిగితే తీవ్ర ప్రతీకార చర్యలకు దారితీస్తాయి. అమెరికా–ఇరాన్ మధ్య ఎంఒయు తర్వాత 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం ఎలాంటి పొడిగింపూ లేకుండా ముగిసిపోయిన తర్వాత శరవేగంగా ఈ పరిణామాలు సంభవించాయి. ''ఒప్పందం చేసుకోవడానికి ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు నాకంటే గొప్ప అవకాశం ఎవ్వరూ ఇవ్వలేరు, విషాదకరమైన విషయం ఏమిటంటే వారు దానిని సద్వినియోగం చేసుకోలేకపోయారు, అందువల్ల ఇప్పటివరకూ నేను ఏ దేశంమీదా ప్రయోగించనంతటి తీవ్రమైన ఆర్థిక అణచివేత చర్యలు ప్రకటిస్తున్నాను'' అని ట్రూత్ సోషల్‌లో రాశారు. ''ఈసారి ఇది అసాధారణ ఆర్థిక యుద్ధం, ఇక ఇరాన్ ఏకాకిగా మారుతుంది'' అని పేర్కొన్నారు. ''చమురు స్మగ్లింగ్, స్వాప్ లైన్లు, నగదు బదిలీలు, ఎక్స్ఛేంజ్ హౌస్‌లు, షిప్ రిజిస్ట్రీలు, ఫ్రంట్ కంపెనీలు...ఇవన్నీ ఇప్పుడే ఆగిపోవాలి'' అని పేర్కొన్నారు. ''ఈ రోజు ఏ దేశమైనాగానీ ఆర్థిక సంస్థలు, విమానాశ్రయాలు, ప్రభుత్వ సంస్థల ద్వారాఇరాన్‌కు ఎలాంటి జీవనాధారాన్ని అందించకూడదు, అలాంటి పనులు చేసే ఆ దేశమే అపారమైన ఆర్థిక తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని నేను ప్రకటిస్తున్నాను, ఇది ఒక ఆర్థిక డి–డే అవుతుంది, ఏకాకిని చేసి ఓడించడంద్వారా ఇరాన్ ముప్పు ఎదుర్కొనేందుకు మిత్రదేశాలని అమెరికాకు అండగా నిలబడాలి'' అని రాశారు. ఇజ్రాయెల్ పత్రికలు దీనిని ''ఇరాన్‌పై అమెరికా ఆర్థిక డి–డే''గా అభివర్ణించాయి. క్యూబా తరహాలోనే ఆ దేశంపై ఆర్థిక ఆంక్షలు విధించారు. సగంలో వదిలేసిన చర్చలను పూర్తిచెయ్యాలని, తెల్లజెండా చూపించి లొంగిపోవాలని రెండు రోజులక్రితం బెదిరించిన ట్రంప్ ఆ దేశంలో కొత్తగా ఎలాంటి దౌత్యపరమైన లావాదేవీలు, సంభాషణల ప్రక్రియ చేపట్టలేదని స్పష్టం చేశారు. ఆగస్టు 19వ తేదీన హోర్ముజ్ జలసంధిని అమెరికా కొత్త భూభాగంగా ప్రకటించి ఎ.ఐ ఫొటోలు విడుదల చేసి మురిసిపోయారు ట్రంప్. ఇరాన్ ఓడరేవులకు ఎలాంటి వాణిజ్య నౌకలు వెళ్ళనీయకుండా హోర్ముజ్ జలసంధిలో దిగ్బంధనం మరింత కట్టుదిట్టం చేశామని చెప్పారు. ఐదున్నరనెలలకు పైగా జరుగుతున్న యుద్ధంలో అమెరికాలాంటి అత్యంత సంపన్నవంతమైన, బలశాలి దేశాన్ని ప్రతిఘటించిన నిలబడిన ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిస్థాయిలో కుప్పకూలిపోతుందని ట్రంప్ ఇప్పటివరకూ ప్రకటనలు చేస్తూ వచ్చారు. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టు కోల్పోయిందని, ఇరాన్ ఓటమి బాటలో ఉందని అంతర్జాతీయ మీడియాలో విస్తారంగా కథనాలు వెలువడిన వెంటనే ఈ కొత్త పరిణామం సంభవించింది. తెరవెనుక దౌత్య పురోగతి సాధిస్తున్నామని ఒకవైపు చెబుతూనే ట్రంప్ లెక్కలేనన్నిసార్లు ఇరాన్‌ను బెదిరించారు. అమెరికాలో కీలక ఆయుధాల నిల్వలు తరిగిపోతున్నాయని, కేవలం గగనతల దాడుల ద్వారానే ఇరాన్‌పై విజయం సాధించలేమని సెంట్‌కామ్ అధిపతి ఒకింత బాహాటంగా ప్రకటించారు. ఇరాన్ వ్యాప్తంగా 14000 లక్ష్యాలపై దాడులు చేసి ఆ దేశ నౌకావ్యవస్థ, వాయుసేన, క్షిపణి, డ్రోన్ తయారీ కేంద్రాలను ధ్వ''ంసం చేశామని సెంట్‌కామ్ అధిపతి ఇటీవల ప్రకటించారు. బాహ్య శత్రువును ప్రతిఘటిస్తూనే, ప్రజల జీవనోపాధి నిలబెట్టడంతోపాటు అంతర్గత సమస్యల పరిష్కారానికి ఇరాన్ గుట్టుగా కసరత్తు చేస్తోంది. ఇరాన్ దగ్గర అణ్వాయుధం ఉండకూడదంటూ ఆరోపణలు ప్రారంభించి యుద్ధం వరకూ వచ్చిన ట్రంప్‌కు ఇప్పుడు హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యం సాధించడమే ప్రధాన ఎజెండాగా మారింది.

## 'ఎకనామిక్ డి–డే' ట్రంప్ విఫల రాజకీయం

### ఇరాన్ విదేశాంగమంత్రి అరాఘ్చీ విమర్శ



**టెహ్రాన్ :** ఇరాన్‌పై ఆర్థిక యుద్ధం అమెరికా చేస్తున్న విఫల రాజకీయమని అబ్బాస్ అరాఘ్చి (ఇరాన్ విదేశాంగమంత్రి) విమర్శించారు. అన్నివిధాలుగానూ ట్రంప్ ఓడిపోయారని, చివరకు ఈ విధంగా విఫల రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ''ఎకనామిక్ డి–డే''గా చెబుతున్న ఈ ఆర్థికపరమైన శిక్ష అమెరికాలో జరుగుతున్న ఆర్థిక వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడంకోసమేనని ఎక్స్ వేదికగా గురువారం ఒక పోస్టింగ్ చేశారు. ఇప్పటివరకూ ట్రంప్ అనుసరించిన విఫలమైన విధానాలకు కొనసాగింపుగా ఈ చర్య ఉందని, ఇది అమెరికాకు,ట్రంప్‌కు మరింత ఓటమిని తీసుకువస్తుందన్నారు. అమెరికాకు విపరీతంగా అప్పులు, వడ్డీలు పెరుగుతున్నాయని, ఇరాన్‌పై యుద్ధం కొనసాగించడంవల్ల వారికి మరింత ఓటమితోపాటు శత్రుత్వం మాత్రమే మిగులుతుందని హెచ్చరించారు.''ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న అమెరికా ఆర్థిక ఉగ్రవాదం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, సార్వభౌమాధికారాలకు ముప్పు తీసుకువస్తుందని పేర్కొన్నారు. గురువారంనాడు ట్రంప్ ఇరాన్‌పై ఆర్థిక యుద్ధం ప్రకటించారు. ట్రూత్ సోషల్‌లో ఆయన ఒక పోస్టింగ్ పెడుతూ, ప్రపంచంలో ఇప్పటివరకూ ఏ దేశంపైనా లేనంత తీవ్రంగా ఆర్థిక చర్యలు ప్రకటిస్తున్నాను, అసాధారణస్థాయిలో జరిగే ఈ ఆర్థిక యుద్ధం ఇరాన్‌ను ఏకాకిని చేస్తుంది'' అని పేర్కొన్నారు. ఏ దేశమైనాగానీ తన వ్యాపారాలు, ఆర్థికసంస్థలు, విమానాశ్రయాలు, ప్రభుత్వ సంస్థల ద్వారా ఇరాన్‌కు ఎలాంటి జీవనాధారం కలిగించకూడదని, తమను ఉల్లంఘించి జీవనాధారం కలిగిస్తే ఆ దేశం ఆర్థికంగా తీవ్ర పరిణామాలను చవిచూస్తుందని ట్రంప్ హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధిని తెరిపించడం ట్రంప్‌కు ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా, అన్నిటికంటే ప్రాధాన్యతాంశంగా మారింది. కానీ ఇరాన్ మాత్రం తాము విధించిన ఆరు షరతులను అంగీకరిస్తేగానీ జలసంధిని తెరిచేదే లేదని స్పష్టం చేసింది. ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం తొలగింపు,యుద్ధ నష్టపరిహారం చెల్లింపు, స్తంభింపజేసిన ఆస్తుల విడుదల, పశ్చిమాసియా నుండి అమెరికా సేనల తరలింపు,బెదిరింపులను శాశ్వతంగా మానుకోవడం వంటి షరతులు ఇరాన్ విధించింది.

## యెమెన్–హౌతీల మధ్య భీకర పోరు

### ముగ్గురు ఐఆర్‌జిసి నిపుణులు మృతి



**సనా :** యెమెన్ ప్రభుత్వ దళాలకు, హౌతీ తిరుగుబాటు సైన్యాలకు మధ్య గురువారం జరిగిన ఘర్షణల్లో ఇరాన్‌కు ఐఆర్‌జిసికి చెందిన ముగ్గురు నిపుణులు మరణించారు. పశ్చిమ యెమెన్ తీరంలో హౌతీలకు, ప్రభుత్వ అనుబంధ దళాలకు మధ్య ఈ ఘర్షణలు జరిగాయి. సౌదీఅరేబియాపై యెమెన్ హౌతీలు యుద్ధం ప్రకటించిన తర్వాత ఈ ప్రాంతంలో ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఐఆర్‌జిసికి, ఇరాన్‌కు మద్దతుగా హౌతీలు యుద్ధరంగంలోకి ప్రవేశించి ఎర్రసముద్రంలో నౌకల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. ఈ దశలో యెమెన్ ప్రభుత్వ దళాలకు,హౌతీ తిరుగుబాటు దళాలకు మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. హేస్ జిల్లాలోని జబల్ దుబాస్ సహా పలు ప్రాంతాలలో ప్రభుత్వ దళాలు–హౌతీలకు మధ్య భీకర పోరాటం జరిగింది. అల్ ఫతా బ్రిగేడ్స్ అని పిలిచే హౌతీ మూడవ బ్రిగేడ్ కమాండర్ కూడా ఈ సందర్భంగా డ్రోన్ దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు.

## ఉక్రేన్ వ్యాప్తంగా రష్యా క్షిపణి,డ్రోన్ దాడులు

### 14 మంది మృతి : 20 మందికి గాయాలు

**కీవ్ :** రష్యా దాడుల్లో 14 మంది ఉక్రేనియన్లు మరణించారు. మరో ఇరవైమంది గాయపడ్డారు. గురువారం తెల్లవారకముందుగానే ఉక్రేన్‌లోని పలు ప్రాంతాలపై క్షిపణులు,డ్రోన్లతో రష్యా తీవ్రస్థాయిలో దాడులు చేసింది. ఈ దాడుల కారణంగా కీవ్ నగరంలో విద్యుత్ స్తంభించి చీకట్లు అలముకున్నాయి. పలుచోట్ల పేలుళ్ళు సంభవించాయి. ఉక్రేన్‌వ్యాప్తంగా మొత్తం 28 ప్రాంతాలలో రష్యా క్షిపణి,డ్రోన్ దాడులు చేసింది. బ్రిటన్‌లో తయారైన డ్రోన్ల సహాయంతో ఉక్రేన్ పెనుదాడులు చేస్తూ ఉండటంతో బ్రిటన్‌కు రష్యా నాయకులు గట్టి హెచ్చరిక చేశారు. డ్రోన్ల సరఫరా నిలిపివేయాలని కోరారు. ఐతే నూటికినూరు శాతం తాము ఉక్రేన్‌కు అండగా ఉంటామని బ్రిటన్ ప్రధానమంత్రి బర్న్‌హామ్ ప్రకటించిన తర్వాత భారీస్థాయిలో రష్యా దాడులు చేయడం ఇదే. ఇటీవలికాలంలో రష్యాకు తీవ్ర నష్టం కలిగించేవిధంగా ఉక్రేన్ దాడులు చేస్తూ ఉండటంతో రష్యా తన దాడులు ఉధృతం చేసింది. నల్లసముద్రంలో ఇప్పటివరకూ 100కు పైగా ఉక్రేన్ నౌకలపై రష్యా దాడి చేయగా, ఉక్రేన్ కూడా రష్యా చమురు కేంద్రాలు, నౌకలను ధ్వంసం చేసింది. దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రతిజ్ఞ చేశారు.

## నేల కూలిన కెన్యా సఫారీ హెలికాప్టర్

### ఈక్వెడార్ గూఢచారి అధిపతి సహా ఏడుగురు మృతి

### మృతుల్లో ఐదుగురు అమెరికన్లే



**నైరోబీ :** తూర్పు ఆఫ్రికాదేశం కెన్యాలో సఫారీ హెలికాప్టర్ కుప్పకూలిపోవడంతో అందులో ప్రయాణం చేస్తున్న ప్రముఖులతోపాటు మొత్తం ఏడుగురు దుర్మరణంపాలయ్యారు. మరణించినవారిలో ఐదుగురు అమెరికన్లు ఉన్నారు. ఈక్వెడార్‌కు చెందిన ఆదేశ జాతీయ గూఢచారి విభాగం డైరెక్టర్ మిషెల్ సెన్సీ కొంటుగీ ఈ ప్రమాదంలో మరణించారు. ఈక్వెడార్ అధ్యక్షుడు నోబోవాకు ఆయన అత్యంత సన్నిహితుడు. మరణించినవారిలో ఐదుగురు అమెరికా జాతీయులు ఉన్నట్లు ఆ దేశ విదేశీమంత్రిత్వ శాఖ ధృవీకరించింది. లోయిసాబా కన్జర్వెన్సీ నుండి పర్యాటకులను తీసుకువెళుతుండగా సంబూరు కౌంటీలో ఒలోలోక్వే పర్వతపాదాలవద్ద రిరీష్ సమీపంలో సమీపంలో ఉన్న మారుమూల ప్రదేశంలో హెలికాప్టర్ కూలిపోయింది. ప్రమాదానికి గల కారణాలు వెంటనే తెలియరాలేదు. మరణించినవారిలో ఫ్లోరిడాకు చెందిన టెలిముండో టెలివిజన్ స్టేషన్స్ డైరెక్టర్, జనరల్ మేనేజర్ జోస్ అల్బెర్టో సువారెజ్(55), మయామీ రెస్టారెంట్ యజమాని రోజర్ డ్యూవార్టే కూడా ఉన్నారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే సహాయ బృందాలు అక్కడికి చేరుకున్నాయి. కెన్యా పౌర విమానసంస్థ ఈ ప్రమాద ఘటనపై దర్యాప్తు ప్రారంభించింది.

## 5 పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రాచలం పరిసర 5 గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం వేదికగా బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలను కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. మహాబలిపురంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ తరఫున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భద్రాచలం పరిసరాల్లోని యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీల పరిధిలోని 19 రెవెన్యూ గ్రామాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తిరిగి విలీనం చేయాలని కేంద్ర మంత్రి అమిత్ షాను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ గ్రామాల మొత్తం విస్తీర్ణం 11,122.01 ఎకరాలు కాగా, అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం 282 కిలోమీటర్ల దూరంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కేవలం 40 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపారు. ప్రస్తుత భౌగోళిక పరిస్థితుల కారణంగా ప్రజలు పరిపాలనా సేవలు, రవాణా, వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల తరలింపులో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. భద్రాచలం ఆలయానికి సంబంధించిన భూములు ఎపి పరిధిలో ఉండటంతో ఆలయ పరిపాలనలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

**ఎపి ముఖ్యమంత్రి సహకరించాలి :**
పెద్దవాగు పునరుద్ధరణకు ఎపి తన వాటా నిధులు విడుదల చేయాలని, ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర కల్పించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎపి ముఖ్యమంత్రి సిఎం చంద్రబాబు నాయుడును కోరారు. పెద్దవాగు ప్రాజెక్టు 2024 జూలైలో భారీ వర్షాలకు దెబ్బతిన్న నేపథ్యంలో శాశ్వత పునరుద్ధరణకు రూ.92.20 కోట్లు అవసరమని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు కింద 16 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, 13,640 ఎకరాలు ఏపీలోనే ఉన్నందున 85.25 శాతం ఆయకట్టు ప్రాతిపదికన ఏపీ తన వాటా నిధులను విడుదల చేయాలని చంద్రబాబును కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టి రెండు రాష్ట్రాల రైతులకు నీరందించేలా చర్యలు తీసుకుందని తెలిపారు.ఆయిల్‌పామ్ రైతుల ఆదాయ భద్రత కోసం గెలల టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని తుమ్మల చంద్రబాబును కోరారు.అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో హెచ్చుతగ్గుల కారణంగా రైతులు నష్టపోతున్నారని, సాగు వ్యయానికి అనుసంధానమైన ధరల సవరణ విధానం కూడా అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా భద్రాచలం నుంచి దమ్మపేట, చింతలపూడి మీదుగా ఏలూరు వరకు ఉన్న సుమారు 160–165 కిలోమీటర్ల అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎపి సిఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఈ రహదారి భద్రాచలం వద్ద ఎన్‌హెచ్30ను, ఏలూరు వద్ద ఎన్‌హెచ్16ను అనుసంధానిస్తుందని, గిరిజన ప్రాంతాల అభివృద్ధితో పాటు రెండు రాష్ట్రాల మధ్య రవాణా, ప్రాంతీయ కనెక్టివిటీ మెరుగుపడుతుందని తెలిపారు.

## ఎంపిల సూచనలకు ప్రాధాన్యం.. రైల్వే ప్రాజెక్టులకు వేగం

### రూ.24,210 కోట్లతో 1,481 కి.మీ. మేర కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులు

### తెలంగాణలో 40 స్టేషన్ల పునరాభివృద్ధి.. రూ.2వేల కోట్లకు పైగా వ్యయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణమధ్య రైల్వే పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా వేగం పెంచాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఎంపిలు రైల్వే అధికారులను కోరారు. కొత్త రైల్వే లైన్లు, రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, రోడ్డు అండర్ బ్రిడ్జిలు, కొత్త రైళ్లు, అదనపు హాల్టులు, రైళ్ల పొడిగింపు, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల తదితర అంశాలను వారు ప్రస్తావించారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఎంపిలతో సమావేశం జరిగింది.

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో పాటు తెలంగాణ, ఎపి, కర్ణాటకకు చెందిన 15 మంది ఎంపిలు పాల్గొన్నారు. దక్షిణమధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, అదనపు జిఎం సత్యప్రకాశ్, ప్రిన్సిపల్ హెచ్‌ఒడిలు, డివిజనల్ రైల్వే మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**రూ.24,210 కోట్లతో 1,481 కి.మీ. పనులు..**
సమావేశంలో జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ రైల్వే జోన్ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలను ఎంపిలకు వివరించారు. రూ.24,210.179 కోట్ల అంచనా వ్యయంతో 1,481కి.మీ. మేర కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్‌పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రయాణికుల సేవలు, సరుకు రవాణా, గూడ్స్ షెడ్ల అభివృద్ధి, స్టేషన్లలో మౌలిక వసతులు, భద్రత, పరిశుభ్రత, డిజిటల్, గ్రీన్ కార్యక్రమాలపై వివరించారు.

**40 స్టేషన్ల పునరాభివృద్ధి..**
తెలంగాణలో 40 రైల్వే స్టేషన్లను రూ.2 వేల కోట్లకు పైగా వ్యయంతో పునరాభివృద్ధి చేస్తున్నట్లు జిఎం తెలిపారు. హైటెక్ సిటీ, బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లను ఇప్పటికే అమృత్ స్టేషన్లుగా అభివృద్ధి చేసి ప్రారంభించామని చెప్పారు. మిగిలిన స్టేషన్ల పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. 2025 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు నాలుగు జతల కొత్త రైళ్లు, ఐదు జతల అమృత్ భారత్ రైళ్లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మరో 14 రైళ్లను వివిధ టెర్మినళ్ల వరకు పొడిగించగా, 56 రైళ్లకు అదనపు హాల్టులు కల్పించినట్లు వివరించారు. 2026లో 30 జతల రైళ్లను రెగ్యులరైజ్ చేసినట్లు చెప్పారు.

**ప్రతిపాదనలకు ప్రాధాన్యం ..**
తమ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త రైలు సేవలు, అదనపు హాల్టులు, రైళ్ల పొడిగింపు, ఆర్‌ఒబిలు, ఆర్‌యుబిలు ఏర్పాటు చేయాలని ఎంపిలు కోరారు. ఎంపిలు ఇచ్చే సూచనలు, సలహాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని జిఎం హామీ ఇచ్చారు. అవసరమైన ప్రతిపాదనలను ఉన్నతస్థాయికి పంపించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## చర్చలతోనే పరిష్కారాలు

(మొదటి పేజీ తరువాయి)

మధ్య పోటీ సహజమేనని ఆయన అన్నారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సిఎం చెప్పారు. సమస్యలు రాష్ట్ర సరిహద్దులను ప్రభుత్వ ఫైళ్ల కంటే వేగంగా దాటుతాయని ఆయన చమత్కరించారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందని తెలిపారు.

**12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు తుది పరిష్కారం చూపాలి**
ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క తెలిపారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఈ సమస్యలకు తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడం కాదని, ప్రతి కొన్ని సంవత్సరాలకు కొత్త అర్థాలు, వివరణలు ఇవ్వడం కూడా కాదని ఆయన వ్యాఖ్యానించారు. పెండింగ్ అంశాలు ఇకపై తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలని తెలంగాణ కోరుకుంటోందన్నారు. షెడ్యూల్–IX లోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం2014కు సంబంధించి సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరుకుంటున్నప్పటికీ, అది తప్పనిసరిగా చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే ఉండాలని స్పష్టంగా చెప్పారు. షెడ్యూల్–X సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజనను ఆంధ్రప్రదేశ్ కోరుతోందని, అయితే పునర్ వ్యవస్థీకరణ చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారాలు లేవని ఆయన చెప్పారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతులేదని తెలిపారు. ఈ అంశం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన ప్రక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని డిప్యూటీ సిఎం కోరారు.

రానున్న రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లు నీటి భద్రత, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, పట్టణీకరణ, రవాణా లాజిస్టిక్స్, ఆర్థిక పోటీతత్వం వంటి అంశాలు రానున్న రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లుగా మారనున్నాయని భట్టివిక్రమార్క అన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు పోటీ పడుతూనే పరస్పరం సహకరించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దక్షిణ భారతదేశం కలిసి అభివృద్ధి చెందితే, భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. తదుపరి 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు.

## సత్వర న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

సామూహిక ఫలితం'' అని చెప్పారు. నేరం నమోదైనప్పటి నుంచి దర్యాప్తు, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్, న్యాయస్థానంలో విచారణ వరకు ప్రతి దశ కీలకమన్నారు. కొత్త నేర చట్టాల అమలులో సంస్థల మధ్య సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు.

**సాంకేతిక పరిజ్ఞానం పెంచాలి : జస్టిస్ మౌషుమి భట్టాచార్య**
తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమి అధ్యక్షురాలు జస్టిస్ మౌషుమి భట్టాచార్య మాట్లాడుతూ కొత్త నేర చట్టాల సమర్థ అమలుకు భాగస్వామ్య సంస్థల మధ్య మెరుగైన సమన్వయం అవసరమన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పనిభారాన్ని పెంచకుండా ప్రక్రియలను సులభతరం చేయాలని సూచించారు. ఒకే సమాచారాన్ని పదే పదే నమోదు చేయడం, అసంపూర్తి వివరాలు ఇవ్వడం వల్ల కేసుల పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందన్నారు. పోలీస్ స్టేషన్ల నుంచి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో దర్యాప్తు అధికారులు తప్పులు, తప్పుడు కోడింగ్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి తప్పుల వల్ల ప్రాసిక్యూషన్ పరిశీలన ఆలస్యమవుతోందన్నారు. పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్ల శాఖల మధ్య సమాచార మార్పిడి మరింత వేగంగా జరగాలని తెలిపారు.

**శాస్త్రీయ దర్యాప్తు, డిజిటల్ ఆధారాలతో పౌరులకు సత్వర న్యాయం**
డిజిపి సి.వి.ఆనంద్ మాట్లాడుతూ కొత్త నేర చట్టాలు గత చట్టాల స్థానంలో కొత్త నిబంధనలు తీసుకురావడం మాత్రమే కాదని, పౌర కేంద్రీకృత న్యాయం, శాస్త్రీయ దర్యాప్తు, డిజిటల్ ఆధారాలు, ఎలక్ట్రానిక్ రికార్డులు, కాల పరిమితితో కూడిన ప్రక్రియలకు ప్రాధాన్యం ఇచ్చే సమగ్ర మార్పు అని వివరించారు. దర్యాప్తుపై సమర్థవంతమైన పర్యవేక్షణ, డిజిటల్ సమాచారాన్ని పూర్తి, కచ్చితంగా నమోదు చేయడం, నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేయడం, అందుబాటులో ఉన్న అన్ని డిజిటల్ వేదికలను సమర్థంగా వినియోగించడం అవసరమన్నారు. కొత్త నేర చట్టాల అమలు నిరంతర ప్రక్రియ కావడంతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి నెలా అమలు తీరుపై సమీక్ష నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని డిజిపి కోరారు.

ఈసాక్ష్యం, ఈఎఫ్ఐఆర్ అంశాలపై ప్రజెంటేషన్ సదస్సులో మూడు సాంకేతిక సెషన్లు నిర్వహించారు. పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు తమ అనుభవాలు, ఆచరణలో ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఐసిజెఎస్, ఈసాక్ష్య, ఆన్‌లైన్‌లో ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ల వినియోగం, ఈసమన్లు, దర్యాప్తు కాలపరిమితులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాక్ష్యాల నమోదు, న్యాయ సంహిత కాలపరిమితులు, న్యాయ శ్రుతి మాడ్యూల్, ఫోరెన్సిక్, వైద్య విభాగాల అనుసంధానం, జైళ్ల నిర్వహణ, దర్యాప్తుప్రాసిక్యూషన్ సంస్థల మధ్య సమన్వయం వంటి అంశాలపై సదస్సులో చర్చించారు. సదస్సులో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విజయసేనారెడ్డి, జస్టిస్ మాధవీదేవి, జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షురాలు జస్టిస్ మౌషుమి భట్టాచార్య, ఎన్‌సిఆర్‌బి ప్రతినిధి ప్రశున్ గుప్తా, టీజీఎస్ఎఫ్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్రా, తెలంగాణ జ్యుడీషియల్ అకాడమి ప్రిన్సిపల్ శ్రీదేవి, సిడిటిఐ డైరెక్టర్ సల్మాన్ తాజ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, డిజిలు, ఐజిలు, ఎస్‌పిలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లేటరల్ ఎంట్రీ యథాతథం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి స్పష్టం చేశారు. కోర్సు వ్యవధి, గుర్తింపు, విద్యా విధానంలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన ఫీజులే కొనసాగుతాయని, విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం ఉండదని చెప్పారు. పాలిటెక్నిక్ విద్యను పరిశ్రమలతో అనుసంధానించేందుకు టాటా టెక్నాలజీస్‌తో పదేళ్ల కాలానికి రూ.2,300 కోట్ల విలువైన ఒప్పందం కుదిరిందని మంత్రి తెలిపారు. ప్లేస్‌మెంట్లు, శిక్షణ, అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్, కరిక్యులమ్ అప్‌గ్రేడేషన్ కోసం 200కుపైగా పరిశ్రమలతో ఎంఓయులు కుదిరాయని చెప్పారు. పాలిటెక్నిక్లకు సంబంధించిన భూములు, భవనాలు, ఇతర ఆస్తులను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి బదిలీ చేసే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ ఉద్యోగులు వైఐఎస్‌యు ఉద్యోగులుగా మారరని, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ ఉద్యోగులుగా మార్చే అవకాశం లేదని స్పష్టం చేశారు.

## ఆమె వ్యక్తిగతం

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ చైర్మన్ మల్లు రవికి తన వివరణతో కూడిన లేఖను పంపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ వ్యవహారంలో తన ప్రమేయం లేదని గుర్తించి, తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని టిపిసిసి క్రమశిక్షణా కమిటీని గౌరవపూర్వకంగా కోరారు. ఇదిలా ఉండగా, ఇటీవల పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేసిన మాజీ మంత్రి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి కూడా క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. ఆయన చేసిన వ్యాఖ్యలపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. దీంతో ఒకేసారి ఇద్దరు ముఖ్య నేతలకు నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు పలువురు నేతలను వ్యక్తిగతంగా దూషించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎల్‌బినగర్ కాంగ్రెస్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. వ్యక్తిగత దూషణలు, బహిరంగ వ్యాఖ్యల విషయంలో పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కాంగ్రెస్ నాయకత్వం స్పష్టం చేసినట్లయింది.

# కొలంబో టెస్టుకు కొత్త అస్త్రం

## 33 ఏళ్ల ఆల్‌రౌండర్ అరంగేట్రం




టెస్టులో భారీ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియనిషిప్ ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకున్న భారత జట్టు.. సిరీస్‌పై కన్నేసింది. స్పిన్ అస్త్రంతో దెబ్బతీయానుకున్న శ్రీలంకను చిత్తుగా ఓడించిన టీమిండియా కొలంబోలోనూ చెలరేగాలని భావిస్తోంది. అరంగేట్రం మ్యాచ్‌లోనే మానవ్ సుతార్ 10 వికెట్లతో ఆకట్టుకోగా.. రెండో టెస్టులో ప్రయోగాలకు సిద్ధమవుతోంది భారత్. ఈసారి స్క్వాడ్‌లోని మరో ఆల్‌రౌండర్ డెబ్యూట్ క్యాప్ అందుకుంటాడని సమాచారం.

శ్రీలంక పర్యటనను విజయంతో ఆరంభించిన భారత జట్టు రెండో టెస్టుకు పక్కాగా సిద్ధమవుతోంది. దేవదత్ పడిక్కల్ శతక మోత, ఆపై మానవ్ సుతార్ తిప్పేయడంతో అలవోకగా గెలుపొందిన టీమిండియా.. కొలంబోలో మరో స్పిన్ అస్త్రాన్ని ఉపయోగించనుంది. ఎడమ చేతివాటం స్పిన్నరైన 33 ఏళ్ల సరాన్ష్ జైన్ ఈ మ్యాచ్‌తో టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. దేశవాళీలో క్రికెట్‌లో మధ్యప్రదేశ్ తరఫున అద్భుతంగా రాణించిన జైన్ గాయపడిన వాషింగ్టన్ సుందర్ స్థానంలో స్క్వాడ్‌లోకి వచ్చాడు. ప్రతిభావంతుడైన అతడికీ అవకాశం ఇవ్వాలని భారత్ క్రికెట్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. జైన్‌ను ఆడించాలనుకుంటే తుది జట్టు నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించాల్సి వస్తుంది. గాలే టెస్టులో ఈ చైనామన్ బౌలర్ 25 ఓవర్లలో 103 పరుగులు ఇచ్చి ఒకటే వికెట్ తీశాడు. దాంతో.. కుల్దీప్‌ను పక్కనపెట్టడం దాదాపు ఖాయం అనిపిస్తోంది. ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు జరుగనుంది.




## ఏడో సీడ్‌కు షాకిచ్చి.. 'చరిత్ర'కు అడుగు దూరంలో..

బిడబ్ల్యుఎఫ్ వరల్ ఛాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయిలు అదరగొట్టారు. మహిళల డబుల్స్‌లో సంచలన ఆటతో ఏడో సీడ్‌కు గాయత్రి గోపిచంద్, త్రీసా జాలీలు షాకిచ్చారు. గురువారం జరిగిన 16వ రౌండ్‌లో రిన్ ఇవనగా, కీ నకనిషి(జపాన్) ద్వయాన్ని భారత జంట వరస సెట్లలో చిత్తుగా ఓడించింది. దాంతో, చరిత్రాత్మక పతకానికి అడుగు దూరంలో నిలిచింది గాయత్రి, జాలీ జోడీ. మహిళల డబుల్స్‌లో అంచనాలకు తగ్గట్టు రాణిస్తున్న గాయత్రి గోపిచంద్, త్రిసా జాలీలు సంచలన విజయంతో ఏడో సీడ్‌ను ఇంటికి పంపారు. బిడబ్ల్యుఎఫ్ వరల్ ఛాంపియప్‌షిప్‌లో అదిరే ఆటతో రిన్ ఇవనగా, కీ నకనిశి(జపాన్) జంట కు షాకిచ్చిందీ 39వ సీడ్ అయిన భారత జంట. ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్లో ఫేవరెట్ జపాన్ ద్వయాన్ని అద్భుతంగా నిలువరించింది త్రిసా గాయత్రి జోడీ. తొలి సెట్‌ను 21–16తో నెగ్గిన భారత అమ్మాయిలు.. రెండో సెట్‌లో మరింత రెచ్చిపోయారు. 21–12తో సెట్‌ను గెలిచిన త్రిసా గాయత్రి మరొక్క విజయం సాధిస్తే పతకం ఒడిసిపట్టడం ఖాయం. ' ఈ విజయాన్ని ఆస్వాదించి.. తదుపరి మ్యాచ్‌పై దృష్టి సారిస్తాం' అని త్రీసా వెల్లడించింది. తర్వాతి రౌండ్‌లో నాలుగో సీడ్ జియా యీ ఫాన్ ఝాంగ్ షు గ్జియాన్(చైనా)తో భారత జోడీ తలపడనుంది.

## లసానే డైమండ్ లీగ్‌లో నీరజ్

ఇటీవలే కామన్వెల్త్ క్రీడల్లో రజతంతో మెరిసిన నీరజ్ చోప్రా మరో టోర్నీకి సిద్ధమవుతున్నాడు. గ్లాస్గోలో రెండో స్థానంతో సరిపెట్టుకున్న భారత బడిసె వీరుడు ఈసారి లసానే డైమండ్ లీగ్‌లో పాల్గొంటున్నాడు. అథ్లెటిసిస్మగానే పిలిచే ఈ ఈవెంట్ శుక్రవారం నుంచి మొదలవ్వనుంది. ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా మళ్లీ సత్తా చాటేందుకు రెడీ అవుతున్నాడు. కామన్వెల్త్ క్రీడల్లో వెండి వెలుగులు విరజిమ్మిన అతడు.. లసానే డైమండ్ లీగ్‌లోనూ అదరగొట్టాలని భావిస్తున్నాడు. ఈ వేదికపై రికార్డు మెరుగ్గా ఉండడంతో మనోడే ఫేవరెట్. అయితే.. ఇక్కడ భారత అథ్లెట్కు శ్రీలంక స్టార్ రుమేశ్ థరంగ పథిరంగే, అర్షద్ నదీమ్(పాకిస్థాన్)లు సవాల్ విసరనున్నారు. కామన్వెల్త్లో నీరజ్ 85.83 మీటర్లకే పరిమితమవ్వగా.. రుమేశ్ ఏకంగా 89.75 మీటర్ల దూరం ఈటెను విసిరి పసిడిని పట్టేశాడు. ఇక ఫౌల్ కారణంగా నదీమ్ పతకం గెలవలేదు. సో.. లసానే డైమండ్ లీగ్లో.. ఈ ఇద్దరు నీరజ్‌కు గట్టి పోటీదారులుగా మారారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో అథ్లెట్ ఖెషోర్న్ వాల్కాట్ కూడా పతకం గెలవగల సమర్థుడే. ప్రపంచ అథ్లెటిక్స్ ముందు జరుగుతున్న ఈ టోర్నీ అయినందున.. నీరజ్ చోప్రా అంచనాలకు తగ్గట్టు రాణించాలని భావిస్తున్నాడు.



## పోటీ కోసం జీకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## ప్రపంచంలో కెల్లా అతిపెద్ద ఉష్ణమండల ఎడారి

- ప్రపంచంలోని ఇసుక ఎడారులలోకెల్లా పెద్దది
  సహారా
- ఇస్లాం మతస్థుల అతి పుణ్యక్షేత్రం
  మక్కా
- కొంకణ్ రైలు మార్గం లేని రాష్ట్రం ఏది?
  కేరళ
- 'అద్వైత' భక్తి ఉద్యమాన్ని స్థాపించింది ఎవరు?
  శంకరాచార్యులు
- వాయు ఉష్ణమాపకాన్ని ఎవరు తయారుచేశారు?
  గెలీలియో
- ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
  జులై 11
- పత్తి, పొగాకు, చెరకు మొదలైన పంటలకు అత్యధిక దిగుబడిని అందించే నేలలు ఏవి?
  నల్లరేగడి నేలలు
- 'వింగ్స్ ఆఫ్ ఫైర్' పుస్తక రచయిత ఎవరు?
  ఎ.పి.జె. అబ్దుల్ కలాం
- నైజీరియాలో లభించే ఒక ఖనిజం
  తగరం
- ఆసియాఖండంలోని శీతల ఎడారి
  గోబీ ఎడారి
- ప్రపంచంలోకెల్ల అతి తక్కువ వయస్సు గల ముడత పర్వతాలు
  హిమాలయాలు
- పంచదార కర్మాగారాలు ఏ రాష్ట్రంలో ఎక్కువ ఉన్నాయి?
  ఉత్తరప్రదేశ్
- సహజీవనం గల మొక్క ?
  చిక్కుడు
- గాలి, నీరు, నేలలోని సూక్ష్మ జీవుల ఉనికిని రుజువు చేసిన శాస్త్రవేత్త?
  లూయీపాశ్చర్
- ప్రపంచంలో 'గొర్రెమాంసం' ఉత్పత్తిలో భారత దేశ స్థానం?
  7వ స్థానం
- 'పసుపు విప్లవం' దేనికి సంబంధించినది?
  నూనె గింజలు
- గడ్డం గీసుకొనుటకు వాడే సబ్బులో ఏ పదార్థం అధికంగా ఉంటుంది?
  సువాసన ద్రవ్యాలు
- 2011 జనాభా లెక్కల ప్రకారం మనదేశ అక్షరాస్యతా శాతం ఎంత?
  74%
- మొదటి ప్రపంచ యుద్ధ కాలం ఏది?
  1914–18
- 'నేషనల్ డైట్' అనే పేరుతో ఏ దేశ పార్లమెంటును పిలుస్తారు?
  జపాన్
- 2015 జనవరి 1 నాటికి 80 సంవత్సాలు చేసుకున్న బ్యాంకు?
  ఆర్‌బిఐ
- ఎక్కువ కెలోరిఫిక్ విలువ గల పదార్థం
  జున్ను
- ఈ గ్రహం మీద కూడా ప్రాణులు జీవించవచ్చునని నమ్ముతున్నారు:
  కుజుడు
- తుల యొక్క ఇంగ్లీషు పేరు.
  లిబ్రా
- దక్షిణ భారతదేశంలో జైనుల ప్రధాన కేంద్రం ఎక్కడ ఉంది?
  శ్రావణ బెళగొల
- BRICS బ్యాంక్ తొలి ఛైర్మన్ ?
  కె.వి. కామత్
- భారతీయులను స్వాతంత్రోద్యమము వైపు నడిపించినది ఏది?
  ఆంగ్ల విద్య
- ఆఫ్రికా ఖండంలో ప్రవహిస్తున్న నది?
  నైలు నది
- ప్రపంచంలో కెల్లా అతిపెద్ద ఉష్ణమండల ఎడారి
  సహారా



- జిల్లా పరిషత్ ఛైర్మన్ ఈ విధంగా ఎన్నుకోబడతాడు?
  జిల్లా పరిషత్‌కు ఎన్నుకోబడిన సభ్యులచే
- సర్పంచ్ పదవికి పోటీ చేయుటకు కనీస వయస్సు
  21 సంవత్సరాలు
- 'ప్రపంచ జీవవైవిధ్య సదస్సు 2012' ఏ నగరంలో జరిగింది?
  హైదరాబాద్
- భారతదేశం ఒక ....?
  అర్ధ సమాఖ్య
- మహల్ వ్యవస్థ ఇక్కడ అమలులో ఉండేది?
  పంజాబ్
- భూభ్రమణ వేగం గంటకు:
  1610 కి.మీ.
- ప్లాసీ యుద్ధం జరిగిన సంవత్సరం
  1757
- ప్రపంచ ఖండాలన్నింటిలో యూరప్ స్థానం
  రెండవ చిన్నది
- అంతర్జాతీయ యోగ దినోత్సవం?
  జూన్ 21
- వర్సయిల్స్ సంధి ఎప్పుడు జరిగింది?
  1919
- శ్రమకు ప్రతిఫలం
  వేతనం
- గోదావరి నది యొక్క ఉపనది
  మంజీరా
- ఆంగ్లేయ విప్లవం ఏ సంవత్సరంలో సంభవించింది?
  1688
- ఆధునిక రాజ్యం అనేది ఒక ..?
  సంక్షేమ రాజ్యం
- మొదటి జైనమత కౌన్సిల్ ఎక్కడ జరిగింది?
  పాటలీపుత్రం
- ఇంగ్లాండ్‌లో మొదటి చార్లెస్‌ను ఉరితీసిన సంవత్సరం?
  1649
- ప్రజాస్వామ్యానికి నిర్వచనాన్ని ఇచ్చినది
  అబ్రహాం లింకన్
- వాయు వాయిద్యము
  ఫ్లూట్
- ఉష్ణశక్తిని యాంత్రిక శక్తిగా మార్చునది?
  ఆవిరియంత్రం
- అత్యంత పొడవైన రైల్వే ప్లాట్ ఫామ్ ఎక్కడ ఉంది?
  ఖరగ్‌పూర్

# కార్మిక హక్కులు, చట్టాల రక్షణకు పోరాటాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కార్మిక హక్కుల చట్టాల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ పిలుపునిచ్చారు. గురువారం ఎఐటియుసి పెద్దపెల్లి జిల్లా నాలుగవ మహాసభలు సుల్తానాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఐబి గెస్ట్‌హౌస్ నుంచి భారీ కార్మిక ర్యాలీ ప్రదర్శన మహాసభ జరిగే యశోద నరహరి ఫంక్షన్‌హాల్ వరకు సాగింది. అమరవీరులను స్మరిస్తూ ఎర్రజెండాను ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభకు అధ్యక్ష వర్గంగా వైవి.రావు, పూసల రమేష్ వ్యవహరించగా ముఖ్య అతిథులుగా హాజరైన కలవేణ శంకర్, బాలరాజు హాజరై మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని దుయ్యబట్టారు. దేశంలో అనేక పోరాటాలు, అనేక త్యాగాలు చేసి కార్మికులకు హక్కులు, చట్టాలు, సంక్షేమ సౌకర్యాలు సాధించిపెట్టిన ఘనత ఎఐటియుసిదే అని అన్నారు. ప్రభుత్వాలు మారిన కార్మికుల బతుకులు మారడం లేదని పోరాడితే కానీ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఉద్యోగ భద్రత ఉపాధి హక్కుల సంక్షేమ సౌకర్యాలకు సమరశీల పోరాటాలు ఎఐటియుసి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుపతల పెట్టామని దీనికి అన్ని సంఘాలను, ఐక్యం చేసి ఐక్య పోరాటం చేస్తామని, కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహాసభలో ఎఐటియుసి పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు మారగోని ప్రవీణ్‌కుమార్, సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, గౌతమ్ గోవర్ధన్, సిపిఐ రామగుండం కార్పొరేటర్ మార్క్యాపూర్ సూర్య, నాయకులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్, నాంసాని శంకర్, రెడ్డపాక లక్ష్మణ్, కె.రాజరత్నం, ఎంఆర్‌సి.రెడ్డి, సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

# ధరల అదుపులో కేంద్రం విఫలం

### సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** వేలేరు : పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల అదుపులో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విఫలమయిందని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆరోపించారు. గురువారం సిపిఐ ధర్మసాగర్ మండల కౌన్సిల్ సమావేశం ధర్మసాగర్‌లో బట్టు మల్లయ్య జరిగింది. సమావేశానికి భిక్షపతి హాజరై మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దశాబ్ద కాలం అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. రైతులకు రెట్టింపు ఆదాయం చేస్తామని, నిరుద్యోగులకు ఒక సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, ఆకాశాన్నంటే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వరంగసంస్థలను ధ్వంసం చేస్తూ కార్పోరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తుందన్నారు. కార్మికులకు రక్షణగా ఉండే చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి హక్కులు హరిస్తుందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో లక్షల మంది విద్యార్థులు భవిష్యత్తు దెబ్బతిన్నదన్నారు. రాష్ట్రంలో ఎంసెట్ మాదిరిగా నెట్ నిర్వహించాలని, అప్పుడు విద్యార్థులకు ఇబ్బందులు తగ్గుతాయని భిక్షపతి తెలిపారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునగాల భిక్షపతి, మండల కార్యదర్శి కొట్టె వెంకటేష్, నాయకులు బట్టు మల్లయ్య, చిలుక బాబు, రాజరపు రత్నం, గోకల రాజయ్య, వెంకన్న, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు సర్కార్ హామీలు అమలు చేయాలి

### ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట అధ్యక్షుడు జమలయ్య

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆటో కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి 24న జరిగే ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం స్థానిక శేషగిరి భవన్ సిపిఐ కార్యాలయంలో జరిగిన ఆటో వర్కర్స్ జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నది ఆర్‌టిసి తర్వాత ఆటోలే అన్నారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంతగా ఉపాధి కోసం అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి అనేక మంది ప్రజలకు రవాణా సదుపాయాన్ని కల్పిస్తూ ఆటో కార్మికులు కుటుంబాలని పోషించుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని కార్మిక సంఘాలతో వివిధ సమస్యలపై సమావేశం కావడం జరిగిందని తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12000 ఇస్తామనే హామీని ఇచ్చారని, కానీ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేన్నరేళ్లు అవుతున్నా ఆ హామీ నెరవేర్చలేదన్నారు. ప్రక్క రాష్ట్రం ఎపిలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12వేలు ఇస్తున్నారని, ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆరో కార్మిక సంఘాలను పిలిపించి చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అబ్బులు దేశీ ఆర్యకృష్ణ బడుగు భాస్కర్ బాబు జానీ వెంకట్ గాబ్రేలు గౌస్ సత్యనారాయణ విజ్జి కిరణ్ ముక్కెర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# హక్కుల కోసం ప్రశ్నిస్తే యువతను అణచివేసే ప్రయత్నాలు




### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా.వలి ఉల్లా ఖాద్రి
### వరంగల్ జిల్లాలో ఘనంగా ఎఐవైఎఫ్ జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/వరంగల్:** యువత తమహక్కుల కోసం ప్రశ్నిస్తే పాలకులు వారిపై అణచివేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా.వలి ఉల్లా ఖాద్రి అన్నారు. విద్యార్థులు, యువత తమ సమస్యలపై ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని తుమ్మెర భవన్‌లో గురువారం ఎఐవైఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా జరిగాయి. మహాసభలకు ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు సాంబమూర్తి అధ్యక్షత వహించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా. వలి ఉల్లాహ్ ఖాద్రి జెండా ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్యారంగ సమస్యలు, ఉద్యోగాల కొరత, సామాజిక అసమానతలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. యువత తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిని అణిచివేసే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ప్రగతిశీల, ప్రజాస్వామ్యవాద శక్తులను లక్ష్యంగా చేసుకునేందుకు దిమాగీ నక్సల్స్ వంటి ముద్రలను ఉపయోగించే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు యువత సంఘటితంగా ఉద్యమించాలని కోరారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. మతం పేరుతో యువతను రెచ్చగొట్టడం కాకుండా వారికి నాణ్యమైన విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువత తమ సమస్యలపై ఐక్యంగా పోరాడాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని ఖాద్రి పిలుపునిచ్చారు. మహాసభలో ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మాస్కా షుదీర్ జిల్లా కార్యవర్గ నివేదికను ప్రవేశపెట్టారు. వరంగల్ జిల్లాలో ఎఐవైఎఫ్‌ను గ్రామస్థాయినుంచి బలోపేతం చేసి, విద్యార్థులు, యువత సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాలని మహాసభ తీర్మానించింది. మహాసభలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, సిపిఐ అసిస్టెంట్ కార్యదర్శి పానస ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాకుల రవి, డి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన కార్మికులకు జీవనభృతి అందేలా చర్యలు చేపట్టాలి

### కలెక్టరేట్ ఎదుట ఎఐటియుసి ధర్నా

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లాలోని బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, అర్హులైన ప్రతి కార్మికుడికి జీవన భృతి అందేలా చర్యలు తీసుకోవాలని గురువారం జగిత్యాల జిల్లా బీడీ కార్మిక సంఘం(ఎఐటియుసి) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ధర్నానుద్దేశించి సంఘం నాయకులు మాట్లాడుతూ బీడీ కార్మికులను మార్గదర్శకాల ప్రకారం గుర్తించి, వారి వివరాలను సేకరించి అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని కోరారు. అర్హత కలిగిన బీడీ కార్మికులకు నెలకు రూ.2,016 జీవన భృతి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2014 సంవత్సరంలో కటాఫ్ తేదీకి ముందు బీడీ కార్మికులకు జీవన భృతి అందించే విధానం అమల్లోకి వచ్చిందని, అయితే జగిత్యాల జిల్లాలో పలువురు అర్హులైన కార్మికులకు ఇప్పటికీ ప్రయోజనం అందడం లేదన్నారు. జీవన భృతి పొందుతున్న కార్మికులకు ప్రతి నెలా సకాలంలో భృతి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, జీవన భృతి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం(ఎఐటియుసి) జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత, ప్రధానకార్యదర్శి ఎండి.ముక్రం, కార్మిక నాయకులు మునుగురి హనుమంతు, ఇరుగురాల భూమేశ్వర్, వెన్న మహేష్, ఏసుమని గణేష్, శ్రీ గాద దేవదాస్, మాడిశెట్టి కిరణ్, అందే వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు బయటకొస్తున్నారు, ఇకవాళ్ళని ఆపలేం

యువశక్తిని మౌలిక మార్పుల ఆచరణ దిశగా మళ్ళించాలి
వ్యాపార గుత్తాధికారం చెలాయిస్తే ప్రజలకు స్వరాజ్యం దక్కదు
రాజీవ్‌గాంధీ జయంతి సభలో రాహుల్‌గాంధీ హెచ్చరిక




**న్యూఢిల్లీ :** దేశంలో విద్యార్థులు తమ భావాలు వ్యక్తం చేయడానికి బయటకు వస్తున్నారని, ఇక ఈ ప్రక్రియను ఆపలేమని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. తన తండ్రి, మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా న్యూఢిల్లీలోని జవహర్ భవన్‌లో ''హర భర స్వరాజ్‌:రాజీవ్ దార్శనికతకు నివాళి'' అనే కార్యక్రమంలో గురువారం రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ, ఇన్నాళ్ళుగా భావవ్యక్తీకరణకు అవకాశం ఇవ్వకపోవడంవల్ల తీవ్ర ఆవేదనకు గురయ్యామని దేశంలో లక్షలాదిమంది విద్యార్థులు గ్రహించారని, ఇప్పుడు అకస్మాత్తుగా వారిలో భావ వ్యక్తీకరణ బయటకు వచ్చిందని, ఇక దీనిని ఆపలేమన్నారు. విద్యార్థులు ఈ భావ వ్యక్తీకరణ హక్కును అర్థం చేసుకోవడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.ఈ భావ వ్యక్తీకరణ శక్తిని దేశ పరివర్తకు దోహదపడేవిధంగా తీర్చిదిద్దాలని అన్నారు. కేవలం భావ వ్యక్తీకరణ ఉన్నంతమాత్రాన సరిపోదని, దేశంలో పరివర్తన తీసుకువచ్చే దిశగా ఆ వ్యక్తీకరణను ఆచరణాత్మకంగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శక్తిని విద్యార్థులు దేశంలో మౌలిక మార్పులు తెచ్చేందుకు ఉపయోగించాలని కోరారు. ''ప్రతి వ్యకీ తాను ఒక ప్రత్యేకమైనవాడినని భావించాలి, అలాంటి భారతదేశాన్నే కాంగ్రెస్‌పార్టీ కోరుకుంటోంది'' అన్నారు. ''యువతరంలో ఉండే భావవ్యక్తీకరణ మన దేశ విద్యావ్యవస్థలో ఎలా పరివర్తన తీసుకువస్తుంది? విద్యార్థుల భావాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకోసం అనుకున్నవిధంగా మార్పులు తీసుకురావాలి?మనలో రగిలిన చైతన్యాన్ని వ్యవస్థ మార్పులకోసం ఎలా ఉపయోగించాలి?అసలైన ప్రశ్న ఇదే. ఇదే అసలైన పోరాటం. దేశంలో ఉన్న వ్యాపారాలన్నీ ఒకే వ్యక్తి చేతుల్లో ఉండిపోతే మనం ఏం చేయలేం, వ్యాపారాలు ఏకస్వామ్యంగా మారితే, విస్తారంగా ఉన్న భారతీయ ప్రజానీకానికి స్వరాజ్యం దక్కే అవకాశం ఉండదు,ఇలాంటి కొన్ని మౌలిక అంశాలు లేకుండా మహాత్మాగాంధీ చెప్పిన స్వరాజ్య దార్శనికతను ఉనికిలోకి తీసుకురాలేం,సాకారం చేయలేం'' అన్నారు. ''విద్య ఖరీదైన వస్తువుగా మారిపోతే విద్యావ్యవస్థ మనుగడ సాగించలేదు,అన్యాయపూరితమైన వ్యవస్థ ఉంటే స్వరాజ్యాన్ని సాకారం చేయలేం,కేవలం ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తుల చేతుల్లోనే దేశ ఆర్థిక వ్యాపార వ్యవస్థ మొత్తం చిక్కుకుపోయి గుత్తాధికారం చెలాయిస్తే,ఏకస్వామ్య విధానాలు కొనసాగితే ప్రజలకు స్వరాజ్యం దక్కదు,దేశంలో ప్రతి మారుమూల ప్రాంతానికీ,గ్రామస్థాయికి చేరుకుని ప్రజలకు అందుబాటులో ఉండే రాజకీయ వ్యవస్థ లేకపోతే స్వరాజ్యం ప్రజలకు లభించదు,పంచాయతీరాజ్ మొదలు ఎంఎల్ఎలు,ఎంపీలు వరకూ రాజకీయ వ్యవస్థ విస్తరించాలి, అప్పుడే స్వరాజ్యం సాకారమవుతుంది,వాస్తవానికి మనం చేయాల్సింది ఇదే'' అన్నారు. యువశక్తికి ప్రభుత్వం ద్వారాలు తెరచినప్పుడు,ఆ మార్గంలో ప్రయాణం చేసేందుకు దేశం వారికి సహకరించినప్పుడు మాత్రమే మహాత్మాగాంధీ కలలుగన్న ''స్వరాజ్యం'' సాధించగలమన్నారు. బిజెపి–ఆర్ఎస్ఎస్ మైనారిటీలపై దాడులు చేస్తున్నాయని, గిరిజనుల భూములను లాక్కుపోతున్నాయని, దళితులను అణచివేస్తున్నాయని ఈ పరిస్థితులలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ''యువకుల కలలకు దేశ పాలకులు ద్వారాలు తెరవాలి, అదే వారి ప్రధాన బాధ్యత,సత్యం వారికోసం సిద్ధంగా ఉందని వారిలో విశ్వాసం,నమ్మకం నింపాలి,ఆ సత్యమార్గంలో నడిచేందుకు దేశం యువతరానికి సహకరించాలి,భారతదేశం కోసం మహాత్మాగాంధీ కన్న కల ఇదే,ఆయన స్వరాజ్యమార్గం ఇదే'' అన్నారు. ఈ రోజు దేశంలో జరుగుతున్న రాజకీయ పోరాటం ఇదే, తమకు కొన్ని భావాలు ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు,వ్యక్తులుగా మాకు కొన్ని విషయాలపై విశ్వాసాలు ఉన్నాయంటున్నారు,లక్షలమంది విద్యార్థులు వారి అభిప్రాయాలను అర్థం చేసుకున్నారు, బయటకు చెప్పడానికి ముందుకు వస్తున్నారు, ఇదే నాకు గర్వకారణం''అన్నారు.

**బిజెపి ఏం చేసింది? స్వరాజ్యం అంటే ఏమిటి?**
బిజెపి–ఆర్ఎస్ఎస్ ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేశాయి,కానీ అధికారంలో ఉండీ ఆ పార్టీ ఏం చేసిందని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు.దేశంలో 16 శాతంగా ఉన్న ముస్లింలు,క్రైస్తవులు,సిక్కులు నోరు తెరిస్తే ఉనికే లేకుండా చేస్తామన్నారు, ఆ తర్వాత 10 శాతంగా ఉన్న ఆదివాసీల భూములను లాక్కున్నారు,వారికి ఎప్పుడు కావాలంటే అప్పుడే ఆ భూములు తీసేసుకున్నారు, తమ భూములు తమకు కావాలంటూ పోరాటం చేస్తే వాళ్ళని తుపాకులతో కాల్చి చంపారు,ఇక జనాభాలో 15 శాతంగా ఉన్న దళితులను గతంలో సాంఘిక అణచివేతకు గురిచేశారు,దేశంలో కుల వ్యవస్థ ఉంటే తప్పు ఏమిటి? అని వాళ్ళు ప్రశ్నిస్తున్నారు.బిజెపి–ఆర్ఎస్ఎస్‌లు అధికారంలో ఉండీ దేశానికి చేసింది ఇదే,భారత మాతకు వాళ్ళు చేసిన మేలు ఇదే, వీటన్నింటినీ మార్చాలి, మళ్ళీ అన్నీ వెనక్కు తిప్పాలి అని రాహుల్‌గాంధీ చెప్పారు. నేను ఈ దేశానికి చెందినవాణ్ణి,ఈ దేశం నాది, ఈ దేశంలో నాకు ప్రేమ,గౌరవం దొరుకుతాయి అని మతం,కులం,వయసు,స్త్రీ,పురుషుడు అనే భేదం లేకుండా దేశంలో ప్రతి ఒక్కరూ భావించాలి. సత్యంకోసం అన్వేషణ చేస్తాను అని భావించాలని మహాత్మాగాంధీ చెప్పారు అని గుర్తుచేశారు. మహాత్మాగాంధీ చెప్పిన ''స్వరాజ్యం'' అనే భావనకు పాశ్చాత్యదేశాలు చెప్పిన ''స్వేచ్ఛ''కు మధ్య అర్థాల్లో అప్పుడప్పుడు గందరగోళం ఏర్పడుతుంది, స్వరాజ్యం అంటే స్వేచ్ఛ అని ప్రజలు అనుకుంటారు, కానీ స్వరాజ్యం అంటే అర్థం ఏమిటంటే...''స్వ''అంటే మనం,''రాజ్'' అంటే పాలన, అంటే స్వయంపాలన అని అర్థం. మనల్ని మనమే పరిపాలించుకోవడం అని అర్థం. ఇది ఒక ఆలోచనావిధానం, స్వరాజ్యం అనే పదం హిందూస్థానీ పదం. అందువల్ల స్వరాజ్యం–స్వేచ్ఛ ఈ రెండు పదాలను ఏకం చేయకూడదు,కలగలిపపేయకూడదు అని రాహుల్ గాంధీ వివరణ ఇచ్చారు. ఒకరు మరొకరికి స్వేచ్ఛ ఇవ్వడం స్వరాజ్యం కాదని చెప్పారు. దేశంలో ప్రతి మనిషీ స్వరాజ్యమార్గంలో ప్రయాణం చేయాలని మహాత్మాగాంధీ కోరుకున్నారని గుర్తుచేశారు. మన చుట్టూ సరైన,మంచి వాతావరణం,అనుకూల పరిస్థితులు లేకుండా స్వరాజ్యం దక్కదని ఉద్ఘాటించారు. విద్యార్థులను క్షమిస్తున్నానని మోదీ చెప్పారని,దాని అర్థం అంతా తనకే తెలుసునని, విద్యార్థులకు ఏమీ తెలియదని అనుకున్నారని అందుకే విద్యార్థులను క్షమిస్తున్నానని చెప్పారని రాహుల్‌గాంధీ విమర్శించారు. అందువల్లనే దేశంలో ప్రతి రోజూ ప్రతి విద్యార్థిపైనా దాడులు జరుగుతున్నాయన్నారు. కానీ ఆకస్మికంగా మోహన్‌భగవత్ జీ వచ్చి విద్యార్థులపై దాడులు చేయకూడదన్నారని, అందుకే ఈ పోరాటం జరుగుతోందని రాహుల్‌గాంధీ చెప్పారు.

## ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒ.. ఆస్తులు
# రూ.100కోట్లకు పైనే



శ్రీనివాస్‌రెడ్డి ఇండ్లు, కార్యాలయాల్లో ఎసిబి సోదాలు

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో అవినీతి నిరోధక శాఖ(ఎసిబి) సోదాలతో ఒక్కసారిగా కలకలం రేగింది. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒగా పనిచేస్తున్న శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన ఇండ్లు ,కార్యాలయాలు సహా సుమారు పదిహేను ప్రాంతాల్లో ఏకకాలంలో ఎసిబి అధికారులు తనిఖీలు చేపట్టారు. గతంలో మహేశ్వరం, బాలాపూర్, శంషాబాద్ తహసీల్దార్ పనిచేసిన ఆయనకు సంబంధించి రంగారెడ్డి,హైదరాబాద్ జిల్లాల్లో భారీగా ఆస్తులు ఉన్నట్లు ఎసిబి అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ప్రారంభమైన దర్యాప్తులో ఒక్కొక్కటిగా బయటపడుతున్న ఆస్తుల వివరాలు చర్చనీయాంశంగా మారాయి.

**రూ.100 కోట్లకు పైగా ఆస్తులా..!?**
అవినీతి నిరోధక శాఖ అధికారులు నిర్వహించిన సోదాల్లో శ్రీనివాస్ రెడ్డికి సంబంధించి ఆస్తుల విలువ సుమారు వంద కోట్లకు పైగా ఉండవచ్చని అధికారులు గుర్తించినట్లు సమాచారం. అయితే ఈ ఆస్తుల పూర్తి విలువ, వాటి చట్టబద్ధత, ఆదాయ వనరులపై అధికారికంగా తుది నిర్ధారణ వెల్లడించవలసి ఉంది. ఎసిబి సోదాలలో బయటపడి ఆస్తుల పత్రాలు,ఇతర ఆధారాలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**10 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి :**
రంగారెడ్డి జిల్లాలో శ్రీనివాస్ రెడ్డికి పది ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నట్లు ఎసిబి గుర్తించినట్లు తెలిసింది. హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ భూములు, ఇళ్ల స్థలాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం తెలుస్తోంది. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు,లావాదేవీల వివరాలను ఎసిబి అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**హైదరాబాద్ చుట్టూ భారీగా ఆస్తులు :** ఉద్యోగ జీవితంలో వివిధ రెవెన్యూ హోదాల్లో పనిచేసిన శ్రీనివాస్ రెడ్డికి హైదరాబాద్,రంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో భవనాలు, ఇండ్ల స్థలాలు ఉన్నట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఆస్తుల కొనుగోలుకు ఉపయోగించిన డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది...? వాటిని ఏ ఆదాయ వనరులతో సమకూర్చుకున్నారు...? అనే కోణంలోనూ ఎసిబి అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

**కేజిన్నర బంగారం గుర్తింపు :**
భూములు,ఇళ్ల స్థలాలతో పాటు శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి సంబంధించి సుమారు కేజిన్నర బంగారం కూడా ఎసిబి సోదాల్లో గుర్తించినట్లు సమాచారం. నగలు, ఇతర విలువైన వస్తువులకు సంబంధించి వివరాలను అధికారులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. పత్రాలు,బ్యాంకు లావాదేవీలపై ఫోకస్ ఆస్తుల పత్రాలతో పాటు బ్యాంకు ఖాతాలు,ఆర్థిక లావాదేవీలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇతర కీలక ఆధారాలను ఎసిబి అధికారులు పరిశీలిస్తున్నారు. శ్రీనివాస్ రెడ్డి గతంలో మహేశ్వరం,బాలాపూర్, శంషాబాద్ తహసీల్దార్గా పనిచేశారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఎఒగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన పనిచేసిన ప్రాంతాల్లో జరిగిన భూముల లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లకు సంబంధించిన వివరాలు కూడా దర్యాప్తులో భాగంగా మారే అవకాశం ఉంది.

**పూర్తి లెక్క తేల్చనున్న ఎసిబి అధికారులు :**
ప్రస్తుతం గుర్తించిన ఆస్తులన్నింటినీ విలువ కట్టి,శ్రీనివాస్ రెడ్డి అధికారిక ఆదాయం,ఖర్చులు,ఆస్తులతో పోల్చి చూడనున్నారు. అనంతరం అక్రమ ఆస్తుల విలువపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రూ. 100 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు నిజమేనా? ఈ ఆస్తుల వెనుక ఉన్న ఆదాయ మార్గాలేంటి? ఇంకా ఎలాంటి ఆస్తులు బయటపడనున్నాయి?అనే అంశాలపై ఎసిబి దర్యాప్తు కొనసాగుతోంది. అధికారుల తుది ప్రకటన వెలువడి తర్వాత శ్రీనివాస్ రెడ్డికి సంబంధించి ఆస్తులు,స్వాధీనం చేసుకున్న పత్రాలు, బంగారం, ఇతర విలువైన వస్తువులపై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## సామాన్యులకు అన్యాయం జరిగితే..
## గాంధీ భవన్ తలుపులు తట్టవచ్చు

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 22ఎ అంశంపై బిఆర్ఎస్ అనవసరంగా రాద్ధాంతం చేస్తోందని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. బిఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావు రాసిన లేఖపై మహేశ్ కుమార్ గౌడ్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఘాటుగా స్పందించారు. క్రింది స్థాయిలో జరిగిన సాంకేతిక లేదా పరిపాలనాపరమైన తప్పిదం తమ దృష్టికి రాగానే, వెంటనే ఆ లోపాలను సరిదిద్దాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. స్వయంగా సంబంధిత మంత్రి కూడా తప్పిదం జరిగిందని అంగీకరించి, దానిని సరిదిద్దడం జరిగిందన్నారు. 22ఎ పరిధిలో ఉన్న భూముల విషయంలో ఎలాంటి భూదందా లేదా అన్యాక్రాంతానికి అవకాశం లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క సామాన్యుడికి అన్యాయం జరిగినా ధైర్యంగా గాంధీ భవన్ తలుపులు తట్టవచ్చని ఆయన హామీ ఇచ్చారు. మాజీ స్పీకర్, సీనియర్ నాయకుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ, ఆయనతో మాట్లాడి ఆవేదనను అర్థం చేసుకున్నామని తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలో పాత, కొత్త నేతలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని చెప్పారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు పూర్తి మద్దతుగా ఉన్నారన్నారు. త్వరలో భర్తీ చేయబోయే నామినేటెడ్ పదవుల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలకు 70 శాతం పదవులు కేటాయించనున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు.

## కృష్ణా జలాలతో హుజూర్‌నగర్
# నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా


భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/చింతలపాలెం :** కృష్ణా జలాలతో హుజూర్‌నగర్ నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని రాష్ట్ర భారీ నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పాతవెల్లటూరు వద్ద రూ.1,648 కోట్లతో 53వేల ఎకరాలకు నీరు అందించే మహాత్మాగాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ముందుగా అండర్ గ్రౌండ్ నందు పంపుహౌస్ పనులను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా నది మీద నిర్మిస్తున్న మహాత్మాగాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మొత్తం ఖర్చు రూ.1648 కోట్లు కాగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ 16 మెగావాట్ల 4 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేయడం జరుగుతుందన్నారు. మట్టంపల్లి మండలంలో 9 గ్రామాల్లో 20,466 ఎకరాలకు, మేళ్లచెరువు మండలంలో 5 గ్రామాల్లో 15,829 ఎకరాలకు, చింతలపాలెం మండలంలో 9 గ్రామాలలో 16,705 ఎకరాలకు మొత్తం 53వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా 5080 ఎస్‌టి, 3540 ఎస్‌సి, 8470 బిసి, 2205 ఓసి కుటుంబాలు మొత్తంగా 19,295 కుటుంబాలు లబ్ధి పొందుతాయన్నారు. దీని కొరకు 191 ఎకరాల రైతుల భూములను కొనుగోలు చేసి వారికి నష్టపరిహారంగా రూ.60కోట్లు చెల్లించడం జరిగిందని వివరించారు. నాగార్జున సాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న సమయంలో పులిచింతల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌ను వినియోగించుకుని ఈ ప్రాంతంలోని గ్రామాలను సస్యశ్యామలం చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ నాటికి ప్రాజెక్టు రూఫ్ టాప్ లెవల్, పంప్ హౌస్ పనులు పూర్తి అవుతాయన్నారు. వీలైనంత తొందరగా ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని గుత్తందారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె. నరసింహ, ఇరిగేషన్ సిఈ నాగభూషణం, ఆర్‌డిఓ శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్ 'పొలిటికల్ గార్బేజ్'గా మారింది

ప్రభుత్వ విప్ విజయరమణరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రజలను గందరగోళపరిచి, ఆందోళనలు రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని బిఆర్ఎస్, బిజెపిలు ఆరాటపడుతున్నాయని ప్రభుత్వ విప్ విజయరమణరావు ఆరోపించారు. అధికారం కోసం ఆ రెండు పార్టీలు అడ్డదారులు తొక్కడానికైనా సిద్ధపడుతున్నాయని విమర్శించారు. తెలంగాణ భవన్‌ను 'జనతా గ్యారేజ్' అని బిఆర్ఎస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని, అధికారం పోయాక అది జనతా గ్యారేజ్ కాదని, కేవలం ఒక పొలిటికల్ గార్బేజ్‌గా మారిందని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ భవన్ గేట్లు ప్రజలకు ఎందుకు మూతపడ్డాయని, ప్రగతి భవన్ చుట్టూ ఇనుప కంచెలు, ఉక్కు గేట్లు ఎందుకు ఏర్పాటు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ భవన్ ఇప్పుడు నిత్యం విషం చిమ్మడానికి, ఈర్ష్య, ద్వేషాలను కక్కడానికి వేదికగా మారిందన్నారు. 22ఎ అంశంపై ప్రభుత్వం ఇప్పటికే పూర్తి స్పష్టత ఇచ్చిందని, తప్పులు ఉంటే సరిదిద్ది రిజిస్ట్రేషన్లు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయినా బిఆర్ఎస్ నాయకులు నీచ రాజకీయాలు చేస్తూ రాహుల్ గాంధీకి లేఖలు రాస్తూ శునకానందం పొందుతున్నారని మండిపడ్డారు. బిజెపి నాయకుడు మహేశ్వర్ రెడ్డి తీరును తప్పుబడుతూ ఆయనది బ్లాక్‌మెయిల్ రాజకీయం అని విమర్శించారు. రెండు వారాల్లో ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఎవరు ఏమిటో తేల్చుకుందామని విజయరమణరావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రిపై తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు నమ్మరని, తెలంగాణ ప్రజలకు అన్ని విషయాలపైనా పూర్తి స్పష్టత ఉందన్నారు.

## నేడు ప్రైవేట్ పాఠశాలల బంద్

రూపారెడ్డి హత్యను ఖండిస్తూ ట్రస్మా పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నల్గొండ జిల్లాలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యను తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) తీవ్రంగా ఖండించింది. హత్యకు నిరసనగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల బంద్ పాటించాలని ట్రస్మా పిలుపునిచ్చింది. ఈ మేరకు ట్రస్మా అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో స్పందించారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలలను మూసివేసి బంద్‌కు మద్దతు తెలపాలని కోరారు. ఇలాంటి అమానవీయ ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ సమిష్టి బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు లోనుకాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లల ప్రవర్తనకు సంబంధించిన పూర్తి బాధ్యతను పాఠశాలలపై మాత్రమే నెట్టివేయకుండా తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయులు విద్యార్థులను మందలించినా కొందరు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ఇతర సంఘాల పేరుతో ఉపాధ్యాయుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## రాష్ట్రంలో మూడు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వచ్చే రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందన్నారు. గురువారం నుంచి శనివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం నుంచి బుధవారం వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, ఈ కాలంలో ప్రత్యేక వాతావరణ హెచ్చరికలు జారీ చేయలేదన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద నిలబడకూడదని, బహిరంగ ప్రదేశాల్లో అవసరం లేకుండా సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు.

## మంత్రి పొంగులేటి క్షమాపణ చెప్పడం సిగ్గుచేటు

బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బిజెపి ఎంపి డాక్టర్ కె. లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ప్రజాపాలన కాదని, దోపిడీ పాలన సాగుతోందని ఆరోపించారు. 22ఎ నిషేధిత జాబితాలో సిఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా చేరిందని, ప్రజల భూములను లూటీ చేస్తున్నారని విమర్శించారు. మంత్రి పొంగులేటి క్షమాపణలు చెప్పడమే స్కామ్ జరిగినట్లు ఒప్పుకోవడమేనని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను ఆ జాబితాలోకి నెట్టిందని ఆరోపించారు. 22ఎ జాబితాను బహిర్గతం చేయాలని, ఈ భూములపై సిబిఐ విచారణకు ఆదేశించాలని కేంద్ర నేతలను కోరారు. ప్రజల ఆస్తుల భద్రత కోసం సైన్యాన్ని దింపాలని హైకోర్టు వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రజల పక్షాన బిజెపి పోరాటం కొనసాగిస్తుందని లక్ష్మణ్ అన్నారు.

## కులగణనపై కేంద్ర వైఖరికి వ్యతిరేకంగా
# 24న దేశవ్యాప్త నిరసనలు

సెప్టెంబర్ 20న హైదరాబాద్‌లో బిసిల జాతీయ ప్లీనరీ
జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి కులగణనపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఈ నెల 24న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. కులగణన చేపడతామని కేంద్రం ఇచ్చిన హామీని అమలు చేయకుండా బిసిలను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో గురువారం బిసి కుల సంఘాల జెఎసి ఛైర్మన్ కుందారం గణేషాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రెండో దశ జనగణన ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ బిసి కులాల గణనపై స్పష్టమైన విధివిధానాలు లేకపోవడం ఆందోళనకరమన్నారు. తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో చేపట్టిన తరహాలో దేశవ్యాప్తంగా శాస్త్రీయంగా బిసి కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. బిసి కులాల వారీగా గణన చేపట్టకుండా, జాబితాపై స్పష్టత ఇవ్వకుండా కులగణన చేస్తామని చెప్పడం ఎవరినీ నమ్మించదని అన్నారు. వెంటనే జాతీయ జనగణన ప్రక్రియను నిలిపివేసి, కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయ నిపుణులు, బిసి సంఘాలతో చర్చించి స్పష్టమైన విధివిధానాలు రూపొందించిన తర్వాతే కులగణన చేపట్టాలని కోరారు. సమావేశంలో బిసి జెఎసి వర్కింగ్ ఛైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్‌తో పాటు పిట్ల శ్రీధర్, కనకాల శ్యాంకుర్మా, తారకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఆధారాలతో వస్తే మంత్రి పొంగులేటి చర్చకు హాజరుకాలేదు

బిజెఎల్‌పి నేత మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు
రూ.15,000 కోట్ల ఫీనిక్స్ భూముల స్కామ్‌పై బహిరంగ చర్చకు సవాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై చేసిన అవినీతి ఆరోపణలకు సంబంధించి బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నా, ఆయన భయపడి తప్పించుకున్నారని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గురువారం ఎమ్మెల్సీలు ఎవిఎన్ రెడ్డి, మల్కా కొమురయ్యలతో కలిసి మాట్లాడారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గురువారం మధ్యాహ్నం 12 గంటల నుండి 2గంటల వరకు బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి పూర్తి ఆధారాలతో ఎదురుచూసినా, మంత్రి పొంగులేటి చర్చకు హాజరుకాలేదన్నారు. తన అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే మంత్రి పారిపోయారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం, గౌరవం ఉంటే పొంగులేటి బహిరంగ చర్చకు వచ్చేవారని, తప్పు చేయనప్పుడు ఆధారాలతో సమాధానం చెప్పేవారన్నారు. ఎందరో అమరవీరుల త్యాగాలు, బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ సంపదను పొంగులేటి వంటి కాంగ్రెస్ మంత్రులు దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోబోమని ఏలేటి హెచ్చరించారు. 22ఎ పేరుతో ప్రైవేట్ పట్టాభూములను నిషేధిత జాబితాలో చేర్చడం, పేదలు, దళితుల భూములను లాక్కోవడం, వేల కోట్ల రూపాయల విలువైన భూముల అక్రమ బదిలీలు, కమిషన్ల వ్యవహారాలపై బహిరంగ చర్చకు రావాలని మంత్రికి ఆయన సవాల్ విసిరారు. 22ఎ భూమి ఎవరికి బదిలీ అయింది, కమిషన్‌లు ఎంత వసూలు చేశారనే అంశాలతో పాటు మంత్రి ఆస్తుల పెరుగుదలపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూభారతి పేరుతో ప్రజల భూములను ప్రభుత్వం కబ్జా చేస్తోందని ఆరోపించిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి, గత ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో జరిగిన భూదోపిడీని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మరో పేరుతో కొనసాగిస్తోందని విమర్శించారు. ఫీనిక్స్ సంస్థ నుంచి సుమారు రూ.15వేల కోట్ల విలువైన ఆస్తులు పొంగులేటికి సంబంధించిన సంస్థలకు బదిలీ అయ్యాయని ఆరోపిస్తూ, వాటిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలతో సమాధానం చెప్పలేకపోతే మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఏలేటి డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని సిబిఐ, ఈడి దర్యాప్తునకు అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమేనా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. అవసరమైతే ఈడి, సిబిఐ, లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామని, సమగ్ర విచారణ జరిగే వరకు బిజెపి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## సివిల్ ఇంజినీరింగ్‌లో అవకాశాల వెల్లువ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మౌలిక వసతుల అభివృద్ధి నిర్మాణ రంగంలో సివిల్ ఇంజినీర్ల పాత్ర కీలకమని నిపుణులు పేర్కొన్నారు. అనురాగ్ యూని వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వ ర్యంలో మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న పరిచయ కార్యక్రమంలో భాగంగా కెరీర్ అవకాశాలు సివిల్ ఇంజినీర్ల బాధ్యతలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేఎల్ ఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్‌రావు హాజరై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. నిర్మాణ రంగం మౌలిక వసతులు; ప్రాజెక్టు నిర్వహణ రూపకల్పన తదితర రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు. సురక్షిత భవనా లు రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల రూపకల్పన నిర్మాణం, నిర్వహణలో సివిల్ ఇంజినీర్లు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తారని తెలిపారు. విద్యార్థులు పాఠ్య పరిజ్ఞానంతో పాటు ప్రాయోగిక సాంకేతిక సంభాషణా నైపుణ్యాలు వృత్తి నైతికతను పెంపొందించుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. పల్లవి బాద్రి, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డా.వి.విజయ్ కుమార్ పాల్గొన్నారు. విద్యా ర్థులకు విలువైన మార్గదర్శకత్వం అందించిన ఎ.శ్రీనివాస్‌రావుకు అనురాగ్ యూనివర్సిటీ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది,



## ప్రజలను విద్యా కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలి

### అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజలు అక్షరాస్యత దిశగా అడుగులు వేయడా నికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. గురువారం అలియాబాద్ మున్సిపల్ లో టాస్‌లో భాగంగా ఉల్లాస్ అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని నిర్వ హించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అక్ష రాస్యతను పెంపొందించడం, ప్రజలందరిని విద్యలో భాగస్వాములను చేయడం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు. అర్హులైన వారికి విద్యా అవకాశాలు అందేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉల్లాస్ అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని విజయవంతం గా అమలు చేసేందుకు సంబంధిత సిబ్బంది చురుకుగా పనిచేయాలని అధి కారులు కోరారు. ఈ కార్యక్రమంలో పిడి సాంబశివరావు, డిడి అడల్ట్ ఎడ్యుకేషన్ అనిత, కమిషనర్ వెంకట్‌రెడ్డి, టాస్ కోఆర్డినేటర్ సత్యనారా యణ, టిఎల్ఎఫ్ అధ్యక్షురాలు లావణ్య, ఎడిఎంసి ఉమేష్, సిసి నాగశ్రీ, ఆర్‌పిలు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి విజ్ఞప్తి

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని గాగిల్లాపూర్‌లో ఉన్న టెక్నో ఇండస్ట్రియల్ పార్క్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిం చాలని కోరుతూ టెక్నో ఇండస్ట్రియల్ పార్క్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం కుత్బు ల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు.



టెక్నో ఇండస్ట్రియల్ పార్క్ ప్రాంతంలో ప్రస్తు తం సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పరిశ్రమల యజమానులు, కార్మికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నా రని అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వీలైనంత త్వరగా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ నాయక్, మాజీ వార్డు అధ్యక్షులు అమర్ సింగ్ నాయక్ బోగిరెడ్డి ఎస్ఆర్వి సుబ్బారావు, తుంపాలా వెంకటేశ్వర రావు, మనోహర్ వి.రవీందర్ శంకర్, వెంకట రెడ్డి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ పోగొట్టుకున్నా, చోరీ అయినా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి

### పోలీస్ కమిషనర్ బి.సుమతి

**ప్రజాపక్షం/ఉప్పల్:** ఫోన్ పోగొట్టుకున్నా, చోరీ అయినా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, దీంతో పాటు సీఈఐఆర్ పోర్టల్‌లో తమ ఫోన్ వివరాలను నమోదు చేయాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి సూచించారు.



ఉప్పల్ డిసిపి కార్యాలయంలో గురు వారం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో మాట్లాడుతూ కమిషరేట్ పరిధిలో చోరీ అయిన 1834 మొబైల్ ఫోన్లను సిఈఐ ఔఆర్ పోర్టల్ సాయంతో గుర్తించి వాటిని స్వాధీనం చేసుకొన్నా మని తెలిపారు. కమిషనరేట్ పరిధి లోని 29 పోలీస్‌స్టేషన్లలో నమోదైన మిస్సింగ్, చోరీ కేసులకు సంబంధించి రికవరీ అయ్యాయన్నారు. గత ఏడు నెలల కాలంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో వీటిని సంబంధిత యజమానులకు అప్పగిస్తున్నామన్నారు. జోన్‌ల వారీగా ఎల్‌బినగర్‌లో 753, ఉప్పల్‌లో 594, మల్కాజిగిరిలో 243, కంటోన్మెంట్‌లో 244 ఫోన్లను రికవరీ చేసామన్నారు.

**కల్తీ మసాలాల గుట్టు రట్టు :** ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుట్టుచప్పుడు కాకుండా కల్తీ మసాలాలు, కారం పొడి తయారు చేసి ప్యాకింగ్ చేస్తున్న రెండు యూనిట్ల గుట్టు బండారం బయటపడింది.



మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసు లు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహిం చి రూ. 1.25 కోట్ల విలువైన నకిలీ మసాలాలు, ముడి సరుకు, యంత్రా లు, ప్యాకింగ్ సామ గ్రిలను స్వాధీనం చేసుకొన్నారు. కమిషనర్ సుమతి వివరాల ప్రకారం రామంతాపూర్ సమీపంలోని లక్ష్మీనారాయణ నగర్‌లో నిర్వాహకుడు దేవనేని భూపేష్ కేవలం మున్సిపల్ లైసెన్సు తీసుకొని కల్తీ మసాలా తయారు చేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. గడువు ముగిసిన మసాలా ప్యాకెట్ల నుండి మసాలాలను బయటకు తీసి వాటిని కొత్త ప్యాకెట్లలో తిరిగి నింపి కొత్త గడువు తేదీలతో అమ్మి సొమ్ము చేసు కొంటున్నట్లు విచారణలో తేలింది. ఎలాంటి అనుమతులు లేకుండానే ఆ ప్యాకెట్లపై ఐఎస్ఐ, అగ్‌మార్కు గుర్తులను ముద్రిస్తున్నారని తెలిపారు. నిర్వాహకుడు మేడిపల్లిలోని సాయి దుర్మన్న అనే వ్యక్తికి ప్యాకింగ్ సంబంధించి జాబ్ వర్కు ఇస్తున్నానని విచారణలో చెప్పటంతో ఆ యూని ట్‌పై సైతం దాడులు నిర్వహించారు. అక్కడ కల్తీ మసాలా పొడులతోపాటు కారం పొడి, ధనియాల పొడి, పసుపు తయారీ చేస్తున్న విషయాన్ని గుర్తించి భారీగా స్వాధీనం చేసుకొన్నారు. ఈ యూనిట్ సంబంధించి నిందితులు సత్యనారాయణ, రుద్రశేఖర్‌లను అదుపులోకి తీసుకొన్నారు.

# నిషేధిత భూముల పరిష్కారానికి కసరత్తు

### రాష్ట్రంలోనే 511 అర్జీలతో మేడ్చల్ జిల్లా ప్రథమ స్థానం

### క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన, పొరపాట్లకు దిద్దుబాట్లు




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 22 ఏ నిషేధిత భూముల జాబితాకు వివాదాంశం సంబంధించి పరిష్క రించాలన్న దరఖాస్తుల సంఖ్య రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో 511 అర్జీలు జిల్లా యంత్రాంగానికి చేరాయి. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రైవేట్ ఆస్తులు, ఇళ్లు, లేఅవుట్లు నిషేధిత జాబితాలో చేరటం వల్ల తీవ్ర గందరగోళం, రాజకీయ దుమారం చెలరేగింది. ఇప్పటికే పలుసార్లు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు 22ఏ నిషేధిత భూజాబితాను వెనక్కు తీసుకోవాలని ప్రకటన లు చేస్తుండటంతో పాటు బాధితుల పక్షాన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి రెండు రోజుల క్రితం బాధితులతో కల్సి ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో పాల్గొన్న బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ టంతో పాటు రెవెన్యూ మంత్రి పొంగులేటి రాజీ నామా చేయాలంటూ డిమాండ్ చేసారు. నిషేధిత భూబాధితులకు బిఆర్ఎస్ అండగా ఉంటుందని బహిరంగంగా ప్రకటించారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులో ఉన్న భూ వివరాలన్నింటిని కూలం కుషంగా పరిశీలించాలని, పరిష్కారానికి ఆన్‌లై న్‌లో అప్‌లోడ్ చేసిన 335 జిఓలను ప్రమాణి కంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఏళ్ల తర బడి కాయకష్టం చేసుకొని కొనుగోలు చేసుకొని స్థిరనివాసాలు ఏర్పరచుకొని ఇంటి పన్ను, నీటి పన్నులు చెల్లిస్తూ ప్రశాతంగా ఉంటూ సొంత ఆస్తే కదాని అమ్మి పిల్లల పెళ్లిల్లో, ఉన్నత విద్య కోసమో అమ్ముదామనుకొని రిజిస్ట్రేషన్ చేద్దా మని వెళితే అక్కడి అధికారులు తమ స్థలం నిషే ధిత జాబితాలో ఉందని, రిజిస్ట్రేషన్ చేయటానికి వీల్లేదని చెబుతుండటంతో సమస్య మొదలైంది.

కనీసం తమ సొంత ఇంటిపై బ్యాంకు రుణాలు తీసుకోవాలన్న, నిర్మాణాలు చేయాలన్నా నిషేధిత జాబితా అన్న అంశం భయాందోళనలకు దారి తీసింది. ప్రభుత్వం తమ ప్రయివేట్ భూము లను 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చటం ఏమిటని ప్రశ్నిస్తూ రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లి ప్రశ్నించగా ధర ఖాస్తు చేస్తే పరిశీలిస్తామని నింపాదిగా జవాబివ్వటం అయోమయాలకు గురి చేసింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యు ఎల్సి), అసైన్డ్, మూల సర్వే నంబర్లలో తలెత్తిన సాంకేతిక, రికార్డుల లోపల వల్లే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో సుమారు 6000 పై చిలుకు ప్రైవేట్ ఆస్తులు పొరపాటున 22ఏ జాబితాలోకి వెళ్లాయని జిల్లా యంత్రాంగం గుర్తించారు. ఫలితంగా జిల్లాలో ఒక్కరొక్కరుగా 22ఏ నిషేధిత జాబితాలో తమ భూములు రెవెన్యూ అధికారులకు అర్జీలిచ్చిన భూ బాధితుల సంఖ్య 511కు చేరింది. రోజు రోజుకు నిషేధిత భూ బాధితుల సంఖ్య పెరిగి పోతుండటం, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ వారికి అండ గా నిలిచి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన దరి మిలా చివరికి 15 రోజుల్లోగా క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ బాధితుల సమస్య పరిష్కరిం చేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ భూములను పరిరక్షించటం తో పాటు నిజమైన ప్రయివేట్ భూ యజమానులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకో వాలంటూ సూచించటంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నిషేధిత భూబాధితుల ధరఖాస్తుల పరిష్కా రానికి మార్గం సుగమమైంది.

**పరిష్కార దిశగా అధికారులు**

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్22ఏ కింద నిషే ధిత జాబితాలో ఉన్న అసైన్డ్ భూములు, గ్రామకంఠం ఇళ్లు, వక్ఫ్ బోర్డు, దేవాలయ, మిగులు భూములు, నివాస స్థలాల సమ స్యల పరిష్కారదిశగా అడుగులు వేస్తున్నా రు. ఇప్పటి వరకు చేరిన 511 దరఖాస్తులను రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలిం చి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ధర ఖాస్తును పారదర్శకంగా పరిశీలించి న్యాయం



చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

**రాత్రంతా కలెక్టరేట్‌లో ఉండి పరిష్కార పనులు పూర్తి చేయాలి : కలెక్టర్ మనుచౌదరి ఆదేశం**

22ఏ నిషేధిత భూములు, అర్బన్ ల్యాండ్ సీలి ంగ్ పరిధిలోని ధరఖాస్తుల పరిష్కారానికి రీటైనే బుల్ భూముల వివరాలను పరిశీలించి ప్రభుత్వ జివోలకు అనుగుణంగా అప్‌లోడింగ్ చేయా లంటూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదే శించారు. గురువారం యుఎల్‌సి విభాగాన్ని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కల్సి పరిశీ లించి నిషేధిత భూ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేసారు. నిర్ణీత గడువులోగా అన్ని ధరఖాస్తులను పరిష్క రించేందుకు జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చే సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, డిఐలు, కంప్యూటర్ ఆపరేటర్లు రాత్రి సమయా ల్లో సైతం కలెక్టరేట్ కార్యాలయంలోనే ఉండా ల్సిందే అని ఆదేశించారు.

## నాగారం డివిజన్ అభివృద్ధి పనులకు రూ.25 కోట్లు ఇవ్వండి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నాగారం డివి జన్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు గురు వారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరే షన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని కలసి 25 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు కోసం కాంగ్రెస్ నాయకు లతో కలసి డిసిసి ప్రెసిడెంట్ తోట కూర వజ్రేష్‌యాదవ్‌తో కలసి వినతి పత్రం సమర్పించారు.





నాగారం డివి జన్‌లో రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, మౌలిక వస తుల వంటి ప్రజా అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వా లని కోరడం జరిగింది. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ నాగారం డివిజ న్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్య మని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయ కులు భూమయ్య యాదవ్, ముప్పు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**జవహర్‌నగర్‌లో అభివృద్ధి పనులకు 20 కోట్లు**

జవహర్‌నగర్: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరే షన్ పరిధిలోని కీసర సర్కిల్, జవహర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ. 20 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యం లో జవ హర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు, మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ బుధవారం కమి షనర్‌ను కలిశారు.

**సమగ్ర అభివృద్ధికి విజ్ఞప్తి**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జవహర్ నగర్ డివిజన్‌లోని పలు కాలనీలలో భూగర్భ డ్రైనేజీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజ్) వ్యవస్థ దెబ్బతిన్నదని, సిసి రోడ్లు శిథిలావస్థకు చేరా యని వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ. 20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు గ్రామకంఠ పరిధిలో ఉన్న పాత ఇళ్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణ అను మతులు ఇవ్వాలని కోరారు.

**కమిషనర్ సానుకూల స్పందన**

నాయకుల విజ్ఞప్తిపై కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారు. అందిన ప్రతిపా దనలను త్వరలోనే పరిశీలించి, నిధుల మంజూ రుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామకంఠం పరిధిలోని అర్హులైన ప్రజలకు నిర్మాణ అనుమతులు ఇచ్చేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బల్లి శ్రీని వాస్, చింతల శ్రీనివాస్, మాట్లా వినయ్, బొబ్బిలి మంజుల, విజయరాయ్, గజ్వేల్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, బాలికలపై నేరాలకు చెక్....'సంస్కార్'పై కౌన్సిలింగ్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మహిళలను వేధించడం, వారి స్వేచ్ఛను నియంత్రియంచడం ఎవరికి హక్కు లేదని మల్కాజ్‌గిరి సిపి సుమతి అన్నారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ మహిళ భద్రత విభాగం ఆధ్వర్యంలో సంస్కార్ మెగా కౌన్సి లింగ్ కార్యక్రమం ఏఎస్ రావు నగర్ అనుపురం కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. షీ టీమ్స్ పట్టుకున్న మహళలు, బాలికలపై నేరాలకు పాల్పడిన వారికి కౌన్సిలింగ్, వేధింపులు, స్టాకింగ్ ఈవ్‌టీజింగ్, సైబర్ వేధింపులు, పబ్లిక్ న్యూసెన్స్ తదితర కేసుల్లో పట్టుబడిని వారికి అవగాహన కల్పించారు.





నిందితుల్లో ప్రవర్తనలో మార్పు చట్టాలపై అవ గాహన, మహిళల పట్ల గౌరవం పెంపొందించ డమే లక్ష్మ మన్నారు. జూన్ 1 నుండి జులై 31 వరకు 228 మంది పట్టుబడ్డారని, మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్‌బి నగర్ జోన్లలో 30 ఎఫ్ఐఆ ర్‌లు,71 కేసులు నమోదై పట్టుబడిన వారిలో 20 మంది మైనర్లు, 50 ఏళ్లు నిండిన వారు నలు గురు, 24 ఏళ్లలోపు యువకులు152 మంది ఉండడం ఆందోళన కల్గిస్తుందని అన్నారు. ఆరు గురు రిపీటెడ్ అఫెండర్లు కాగా ఒక వ్యక్తి ఏకంగా ఆరు కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు వెల్లడించారు. మహిళల భద్రత,సైబర్ సేఫ్టీ పోక్సో చట్టం, చట్టపరమైన అంశాలపై 29,740 మందికి పైగా అవగాహన కల్పించా మని, షీటీమ్స్ 1500కు పైగా డికాయ్ ఆపరే షన్లు నిర్వహించామని ప్రతి సోమవారం బస్ డికాయ్ ఆపరేషన్లు 126,మెట్రో డికాయ్ అపరే షన్లు 120 నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డిసిపి కె సురేష్‌కుమార్, మహిళ భద్రత డిసిపి ఉషారాణి, ఏసిపి వెంకటే శ్వర్లు, మనోజాగృతి సైకాలజిస్టులు, ఇన్స్‌పె క్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు



కీసర చౌరస్తాలో



జవహర్ నగర్‌లో



నవాబుపేట మండల కేంద్రంలో



శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్‌లో



అలియాబాద్ మున్సిపల్‌లో



మూడుచింతలపల్లి మున్సిపల్‌లో



## రోడ్డు పనులు పూర్తి చేయాలి

### సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్‌లో రోడ్డు వెడల్పు పనుల పేరిట రోడ్లను తొలగించి, నూతన రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయకుండా అధికారు లు, కాంట్రాక్టర్లు తీవ్ర తాత్సారం చేస్తున్నారని నిరసిస్తూ సిపిఐ కాప్రా మండలం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, రోడ్డు పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్న ప్పటికీ నిర్మాణం పూర్తి కాకపోవడం కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమ న్నారు. ఇదే రోడ్డుపై ప్రతినిత్యం అధికారులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం వారి బాధ్యతారాహిత్యాన్ని కొట్టొచ్చినట్లు చూపిస్తోందని మండిపడ్డారు. అరకొరగా మిగిలిన రోడ్డు వల్ల విపరీతంగా దుమ్ము, ధూళి లేచి స్థానిక ప్రజలు తీవ్ర రోగాల బారిన పడుతున్నారని, తరచూ ప్రమాదాలు జరు గుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, కాంట్రాక్టర్‌ను హెచ్చరించి నిలిచిపోయిన రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అధికారుల వైఖ రికి వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యులు సిహెచ్.దశరథ, సహాయ కార్యదర్శి మోతే రాజేశ్వరి, ఎఐటియుసి నాయకులు ఎల్లయ్య, పి.నరసింహ, గిరిజన సమాఖ్య నాయకురాలు లత, కురుమయ్య, కిరణ్, మహిళా సమాఖ్య నాయకురాలు కె.జయమ్మ, ఎమ్.అశోక్ చారి, మల్లిక, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధుల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం

**ప్రజాపక్షం/కీసర :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్కిల్ నంబ ర్1గా ఉన్న కీసర అభివృద్ధికి నిధుల మంజూరులో అధికారులు, ప్రభుత్వం తీవ్ర జాప్యం వహిస్తున్నారని ప్రజా ప్రతినిధులు తుడుం శ్రీనివాస్, రాగుల రమేష్ ముదిరాజ్ ఆరోపించారు. కీసర సర్కిల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేసిన అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లా డారు.




పక్కనే ఉన్న ఘట్కేసర్ సర్కిల్‌కు నిధు లు వేగంగా మంజూరవుతూ అభివృద్ధి పనులు ఊపందుకుంటుంటే, కీసరలో మాత్రం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న ట్టుగా తయారైందని వారు మండిపడ్డారు.

**అధికారుల జాప్యమా? రాజకీయ కుట్రా?**

కీసర సర్కిల్‌కు నిధులు ఎందుకు రావడం లేదు? ప్రభుత్వం నుంచి నిధుల విడు దల ప్రక్రియలో జాప్యం జరుగుతోందా లేదా కావాలనే రాజకీయ కారణాలతో పక్కన పెడుతున్నారా అనే అంశంపై అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలి.

**నిలిచిపోయిన పనులు :** నిధుల కొరత కారణంగా కీసర పరిధిలో అనేక కీలక అభివృద్ధి పనులు పెండింగ్‌లోనే ఉండిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కార్యాచరణ హెచ్చరిక :** వెంటనే కీసర అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేసి, నిలిచిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. అధికా రు లు ఈ వినతిపత్రంపై తక్షణమే స్పందించకపోతే, బాధ్యుల నిర్లక్ష్యాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు కీసరలో త్వరలోనే భారీ ప్రెస్ మీట్ నిర్వహి స్తామని, నిధుల నిలిపివేతపై పూర్తి ఆధారాలతో అధికారుల వైఫల్యాలను ఎండ గడతామని వారు తీవ్రంగా హెచ్చరించారు.



## టిడిపి నాయకుడి మాతృమూర్తికి నివాళులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఉప్పల్ టిడిపి సీనియర్ నాయకలు, టిటిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరకొండ సతీష్‌బాబు మాతృమూర్తి సుశీలమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె దశదినకర్మ ఖమ్మం జిల్లా మధిర పరిధిలోని ఇల్లెందుపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీలమ్మ చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, టిడిపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు టిజికె మూర్తి, రాష్ట్ర యువజన నాయకులు సతీష్‌రెడ్డి, సాయినాగార్జున, కుమారస్వామి, ముదిగొండ పాండు, తదితరులు నివాళులర్పించారు.




## నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ

### కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రత్యేకసమగ్ర సవరణలో భాగంగా నో మ్యాంపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ దీప క్‌తివారీ అన్నారు. ఓటరు జాబితా భాతర ఎన్నికల సంఘం నిబంధనలప్ర కారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటరు జాబితా , మండలాల వారీగా గుర్తించినమ్యాంపింగ్ కాని ఓటర్లు ,అనామీలీస్ వివరాలు , నోటీసులు జారీ చేసి చెక్ చేయాలనీ 7రోజులు టైమించ్చి పూర్తిచేయాలని అధి కారులను అదేశించారు. జిల్లావ్యాప్తంగా నోమ్యాంపింగ్, అనామలిన్ ప్రక్రి యను సమర్థవంతంగా నిర్వహించేందుకు తహసీల్దార్ లను కేటియించి ,వారికి కొత్త లాగిన్లు ఏర్పాటు చేసి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని , నోమ్యాంపింగ్, అనామలీస్ఓటర్లకు నోటీసులుజారీ చేసి, నిర్ణీత విధానంలో విచారణ నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పెన్షన్లు దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ వెంకటచారి, జెడ్పిసిఈఓ సుధీర్, డిఆర్ఓ స్వర్ణలత, ఆర్‌డిఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

**బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలి :** గురువారం కలె క్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమా వేశనికి ముఖ్యఅతిధిగా వచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కు ప్రాధాన్యత కల్పిస్తు బ్యాంకర్లు ముందుగా సాగాలన్నారు. ప్రతి రంగంలో సామాజిక న్యాయం జరిగేలా రుణాలను అందజేయాలని ఆయన రుణాలను అందజేయాలనిబ్యాంకర్లకు సూచించారు. 2026–27ఆర్థిక సవత్సరం సమా వేశం నిర్వహించారు. రైతులకు క్రాప్ లోన్ రుణాలు అందజేయాలనీ, పంట రుణాలకు సంబందించి రెన్యువల్ చేయాలనీ బ్యాంకర్లకు ఆదేశించారు. ఈ స మావేశంలో లాడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి,రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జ నరల్ మేనేజర్ శ్రీకంత్ ,అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జి స్టూడియోస్ సమర్పిస్తున్నాయి.

## రీల్

## మిస్సింగ్ మేఘన టీజర్ లాంచ్

రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రలో గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులు ముందుకు వస్తున్న చిత్రం 'మిస్సింగ్ మేఘన' ఇటీవల ఈ సినిమాకి సంబంధించిన ఫస్ట్ లుక్, టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ సెన్సేషనల్ డైరెక్టర్ వి. వి. వినాయక్ చేతుల మీదుగా జరగగా ఇప్పుడు ఈ సినిమా నుంచి ఫస్ట్'సింగిల్ పిల్ల పిల్ల పిల్ల లెజెండరీ ప్రొడ్యూసర్ సురేష్ బాబు చేతుల మీదుగా లాంచ్ అయ్యింది. అలాగే టీజర్ ఎస్ కె ఎన్ రిలీజ్ చేయడం జరిగింది.శామ్. కె. నాయుడు సినిమాటోగ్రాఫర్ గా పనిచేసిన ఈ చిత్రానికి ఆర్.ఆర్. ధృవన్ సంగీతం అందించారు. దర్శకుడు వాచస్పతి, నిర్మాత నరేష్, హీరో రామ్ కార్తీక్, సంగీత దర్శకుడు ఆర్. ఆర్. ధృవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి

**ప్రొడ్యూసర్:** పంచుమర్తి నరేష్ బాబు,
**దర్శకత్వం:** వాచస్పతి ,
**కథ - స్క్రీన్‌ప్లే:** వనరాజ్,
**సంభాషణలు:** వెంకట్ బద్దిగం,
**సంగీతం:** ఆర్.ఆర్.ధృవన్,
**ఛాయాగ్రహణం:** శామ్. కె. నాయుడు,
**ఎడిటింగ్:** బసవా,
**కొరియోగ్రాఫర్:** జేడీ, ఈశ్వర్ పెంటి,
**ఫైట్స్:** రామకృష్ణ, స్టంట్ శంకర్లి,
**లిరిక్స్:** ఆర్.ఆర్. ధృవన్, అలరాజు
**ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్:** మద్దినేని హరి కృష్ణ, కిషోర్ తోకల.



## 'మనసా వాచా' ఆనంద్ దేవరకొండ

యువతను ఆకట్టుకునే యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'ఎపిక్‌ఫస్ట్ సెమిస్టర్' నుంచి మూడో పాట 'మనసా వాచా' విడుదలైంది. ప్రేమ, విరహం, అనురాగం వంటి సున్నితమైన భావోద్వేగాలను హృదయాన్ని హత్తుకునేలా ఆవిష్కరించే ఈ గీతం శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది.ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరప రిచిన ఈ పాటకు దిగ్గజ గాయనీమణి కె. ఎస్. చిత్ర, ప్రముఖ గాయకుడు ఎస్. పి. చరణ్ తన గాత్రంతో ప్రాణం పోశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ మధురమైన స్వరకల్పనకు చిత్ర, చరణ్‌ల భావోద్వేగభరితమైన గానం తోడవడంతో 'మనసా వాచా' ఓ అద్భుతమైన సంగీత అనుభూతిగా నిలిచింది.శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించిన ఈ పాటలో కథానాయకులు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య పోషించిన పాత్రల మధ్య ప్రేమ, అనుబంధం, వారి మనసుల్లో చోటుచేసుకునే భావోద్వేగాలను ఎంతో అందంగా ఆవిష్కరించారు. పాటకు అనుగుణంగా తెరకెక్కించిన విజువల్స్ కూడా ఆ భావోద్వేగాలకు మరింత బలాన్ని చేకూరుస్తూ, వారి ప్రేమ ప్రయాణం లోని సున్నితమైన కోణాలను ఆవిష్కరిస్తున్నాయి.ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదల కానుంది.



## ప్రకాష్ రాజ్ ప్రధాన పాత్రలో జగమే సంగీతం

ప్రైమ్ వీడియోస్ తాజాగా తెలుగు ప్రైమ్ ఒరిజినల్ సిరీస్ 'జగమే సంగీతం'వరల్డ్ వైడ్ ప్రీమియర్ డేట్‌ను ప్రకటించింది. ఈ నూతన సిరీస్ సెప్టెంబర్ 4న స్ట్రీమింగ్ కానున్నట్లు ప్రకటించింది. ప్రైమ్ వీడియో ఒరిజినల్ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో రూపొందిన 'జగమే సంగీతం'ను పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ఎ.ఆర్. ప్రభావ్ రచించిన ఈ మ్యూజికల్ డ్రామాకు విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు. కర్ణాటక సంగీత నేపథ్యంలో సాగే ఈ సిరీస్ లో ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల, అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి ప్రధాన పాత్రల్ని పోషించారు. ఈ ధారావాహికలో సుమన్, సిజ్జు మీనన్, షఫీ, ఝాన్సీ, రఘు బాబు యెర్రా, రాకెట్ రాఘవ, నాగి జబర్దస్త్, మిర్చి నాకిరణ్, ప్రకావ్ కిరణ్, ప్రకావ్ కిరణ్, ప్రకావ్ కిరణ్, కేస్కావ్ రెడ్డి, రూప లక్ష్మి తదితరులు ఇతర పాత్రలను పోషించారు. 'జగమే సంగీతం' భారతదేశంలోని ప్రైమ్ వీడియోలో ప్రపంచవ్యాప్తంగా 240 దేశాలు, ఇతర భూభాగాల్లో ప్రత్యేకంగా తెలుగులో ఆంగ్ల ఉపశీర్షికలు, తమిళంలో డబ్‌లతో ప్రసారం చేయబడుతుంది.కర్ణాటక సంగీతపు గొప్ప ప్రపంచ నేపథ్యంలో సాగే కథతో 'జగమే సంగీతం'రాబోతోంది. తన తాత శాస్త్రి ప్రఖ్యాత సంగీత వారసత్వానికి వారసుడైన బాలు, సంప్రదాయ భారం, విచ్ఛిన్నమైన కుటుంబ బంధాలు, చిరకాలంగా దాచిపెట్టిన రహస్యాలతో సతమతమవడాన్ని చూపిస్తుంది. పాత వైరుధ్యాలు మళ్లీ తలెత్తి, తరతరాల వారసత్వాన్ని నాశనం చేసే ప్రమాదం ఏర్పడినప్పుడు, బాలు తన కుటుంబం నిర్మించిన దానిని కాపాడుకోవడానికీ, తన సొంత కళాత్మక స్వరాన్ని కనుగొనడానికీ మధ్య నలిగిపోతాడు. ఈ కథకు సంగీతమే ప్రాణం. శాస్త్రి తన జీవితాన్ని అంకితం చేసిన కర్ణాటక సంప్రదాయంలో పాతుకుపోయిన ఈ ధారావాహిక, బాలు సంప్రదాయపు సరిహద్దులకు అవతల ఉన్న ప్రపంచాన్ని కనుగొన్న కొద్దీ తన సంగీత పరిధిని క్రమంగా విస్తరిస్తుంది. ఇక్కడ పాట ఆ కుటుంబానికి రెండవ భాషగా మారుతుంది. కళ పట్ల వారిలో తపించే భక్తి, అసంతృప్తి, ఆరాటం, భావోద్వేగాలను వ్యక్తపరుస్తుంది.



## అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా 'మహాకాళి'

'హనుమాన్' విజయం తర్వాత ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోతున్న మరో ఆసక్తికరమైన చిత్రం 'మహాకాళి'. 'మహాకాళి – ది వ్రేండ బిగిన్స్'కు సంబంధించిన కీలక అప్‌డేట్ ఆగస్టు 24న రానున్నట్లు ప్రకటించారు.ఆ రోజు ఏ అప్‌డేట్ ఇవ్వబోతున్నారనే విషయాన్ని మాత్రం మేకర్స్ సస్పెన్స్‌లో ఉంచారు. దీంతో అసలు ఆ రోజు ఏం రివీల్ చేయబోతున్నారనే ఆసక్తి మూవీ లవర్స్‌లో మరింత పెరిగింది.పూజా కొల్లూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఆర్‌కే దుగ్గల్ సమర్పిస్తున్నారు. రిజ్వాన్ దుగ్గల్ నిర్మిస్తుండగా, ప్రశాంత్ వర్మ షోరన్నర్‌గా ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. ఆర్ కె డి స్టూడియోస్ బ్యానర్‌పై సినిమా తెరకెక్కుతోంది.భూమి శెట్టి మహాకాళిగా, అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా కనిపించే ఫస్ట్ లుక్స్‌కు మంచి స్పందన వచ్చింది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం.. ఈ చిత్రానికి స్మరణ్ సాయి సంగీతం అందిస్తుండగా, సురేష్ రగుతు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు.



## 'విలేజ్ స్టార్స్' షూటింగ్ షురూ

ఎన్‌ఎస్‌వీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న నూతన చిత్రం 'విలేజ్ స్టార్స్' పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. వెంకటగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నటుడు సమీర్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర బృందాన్ని ఆశీర్వదించారు.నరేంద్ర, లిల్లీ బళ్ళు హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనివాస్, సయ్యద్ అబ్జాల్, విజయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ. నరేంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి నాగూర్ ఎన్‌జీఆర్ కథ అందిస్తున్నారు. హీరో, దర్శకుడు నరేంద్ర మాట్లాడుతూ చిన్న చిన్న ప్రాజెక్టులు చేసుకుంటూ ఇక్కడి వరకు వచ్చాం. ఇప్పుడు పూర్తి స్థాయి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను అన్నారు.హీరోయిన్ లిల్లీ బళ్ళు మాట్లాడుతూ నేను ఒడిశాకు చెందిన అమ్మాయిని. నాకు 'విలేజ్ స్టార్స్' చిత్రంలో అవకాశం ఇచ్చిన నరేంద్రకి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ అవకాశం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రేక్షకుల ఆదరణ కోరుకుంటున్నాను అన్నారు.జబర్దస్త్ నటుడు వాసు మాట్లాడుతూ విలేజ్ స్టార్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం చాలా గ్రాండ్‌గా జరిగింది. సినిమా తొలి అడుగే విజయానికి సంకేతంగా నిలిచింది. ఎంతో ఎనర్జిటిక్‌గా ఉన్న ఈ చిత్ర బృందానికి శుభాకాంక్షలు అన్నారు.



## 'బెటర్ బీ ఏ మిస్సమ్మ పాట విడుదల

లాస్య అండ మిధున క్రియేషన్స్ బ్యానర్స్‌పై చిరంజీవి పమిడి, శివ పమిడి, కిరణ్ కుమార్ నల్లూరి, స్రవంతి నంబూరి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మోడ్రన్ మిస్మమ్మ'. సాయిబాబా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. హర్ష నర్రా, తన్మయి ఖుషి, సిజు ఏఆర్, ప్రమోదిని, హారిక, డా.భద్రం, శివన్నారాయణ, రాకేష్ రాచకొండ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి శేషు రాజ్ దడ్డాల, విజయ్ పిడపా సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఆదిత్య పాపిశెట్టి ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, బాలకృష్ణ కొరియోగ్రఫీ చేస్తున్నారు. హరికృష్ణ జగురోతి స్క్రిప్ట్ డిపార్ట్‌మెంట్‌ను పర్యవేక్షిస్తున్నారు. సోమేష్ ఎరిపల్లి వీఎఫ్ఎక్స్ డైరెక్టర్‌గా, జి. పవన్ కళ్యాణ్ సౌండ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రానికి ఉప్పుతొల్ల బాబు (బాబీ) ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ సింగిల్‌ను హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో విడుదల చేశారు. సంగీత దర్శకుడు గోపీ సుందర్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు కిట్టు విస్సప్రగడ ఆకట్టుకునే సాహిత్యం అందించారు. 'బెటర్ బీ ఏ మిస్సమ్మ' అంటూ సాగిన పాటలో హీరో సంప్రదాయ పంచెకట్టులో కనిపిస్తుండగా, హీరోయిన్ తన్మయి ట్రెడిషనల్ డ్రెస్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. హీరోయిన్ పెళ్లి వద్దంటూ పాడుకునే ఈ పాట మహిళకు నచ్చేలా ఉంటుంది. 'వదల' చిత్ర నిర్మాత కిశోర్ నాయుడు, హీరో హర్ష నర్రా, హీరోయిన్ తన్మయి ఖుషి, డైరెక్టర్ సాయి బాబా, నిర్మాత చిరంజీవి పమిడి, డివోపీ శేషు పాల్గొన్నారు.



## సుస్మితపై కాంగ్రెస్ మహిళా నేతలు ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మహిళా నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వడ్డెర కాంగ్రెస్ కార్పొరేషన్ చైర్మన్ గుంజా రేణుక , కాంగ్రెస్ మహిళా నేతలు కాల్వ సుజాత,ఇందిరా శోభన్ మాట్లాడారు. ముందుగా గుంజా రేణుకమాట్లాడుతూ సుస్మిత తన స్థాయిని తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. రేవంత్‌రెడ్డిపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తెలంగాణలో ఇంకా పటేల్–పట్వారీ వ్యవస్థ ఉందని సుస్మిత భావిస్తున్నట్టుందని రేణుక విమర్శించారు. ముందుగా వార్డు మెంబర్‌గా గెలిచి తన సత్తా నిరూపించుకోవాలని, వార్డు మెంబర్‌గా గెలవలేని సుస్మిత రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయిలో లేరన్నారు. కొండా సురేఖ తన కుమార్తెను అదుపులో పెట్టుకోవాలని సూచించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు కాంగ్రెస్‌లో సాగవని స్పష్టం చేశారు.కాల్వ సుజాత మాట్లాడుతూ.. సుస్మిత తండ్రికి ఎమ్మెల్సీ కావాలన్నా, ఆమెకు టికెట్ కావాలన్నా కొండా సురేఖ సహకారం అవసరమని అన్నారు. రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో సంబోధించే స్థాయి సుస్మితకు లేదన్నారు. ''అవసరానికి, అవకాశానికి టైమ్ వస్తుంది'' అంటూ హెచ్చరించారు. సుస్మిత ఎప్పుడైనా గాంధీభవన్ మెట్లు ఎక్కారా అని ప్రశ్నించారు. గతంలో రేవంత్‌రెడ్డిని ''మా మేనమామ రేవంత్‌రెడ్డి'' అని చెప్పింది సుస్మితే కదా అని గుర్తుచేశారు. ఇప్పుడు ఆయనపైనే విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు.ఇందిరా శోభన్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు సుస్మితకు ఉందా అని ప్రశ్నించారు. ముందుగా ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. సుస్మిత వ్యాఖ్యల వల్ల ఆమె తల్లి కొండా సురేఖ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కుటుంబ సభ్యులకు ఇబ్బందులు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్న ఆమె ఎలా నాయకురాలు అవుతారని ప్రశ్నించారు.

## అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ఆసరా పెన్షన్లు ఇవ్వాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో రిటైర్డ్ అయిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి డిమాండ్ చేశారు. 2024లో రిటైర్డ్ అయిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ఇప్పటి వరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడంతో వారి పేర్లు ఆన్‌లైన్ నుంచి తొలగించలేదని తెలిపారు. దీంతో వారు ఇప్పటికీ గౌరవ వేతనం పొందుతున్నట్లు అధికారులు భావిస్తూ ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. 2025 మే 30న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నంబర్ 8లో 65 ఏళ్ల వయసులో రిటైర్డ్ అయిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ఆసరా పెన్షన్‌కు అర్హులని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్పష్టం చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఆసరా పెన్షన్ దరఖాస్తులకు ఆగస్టు 31 చివరి తేదీగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, రిటైర్డ్ అయిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అందించి, వారి పేర్లను ఆన్‌లైన్ నుంచి తొలగించాలని కోరారు. తద్వారా వారు ఆసరా పెన్షన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కుటుంబంలో ఒకరికి ఇప్పటికే ప్రభుత్వ పెన్షన్ వస్తున్న కారణంగా అంగన్వాడీ టీచర్లు, ఆసరా పెన్షన్ వర్తించదని అధికారులు చెబుతున్నారని ఆమె అన్నారు. ఈ నిబంధనపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇచ్చి, అంగన్వాడీ ఉద్యోగులకు అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు.

## గల్ఫ్‌లో ఉంటున్న తెలంగాణ వాసులకు పాలసీ రూపకల్పన

### తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : గల్ఫ్ దేశాల్లో నివాసం ఉంటున్న తెలంగాణ రాష్ట్రానికి సుమారు 15 లక్షల మంది కార్మికులకు అండగా ఉండేందుకు త్వరలో ఒక విధానాన్ని రూపొందించే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి తెలిపారు.ఫిలిప్పీన్స్ దేశ రాజధాని మనీలా లోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యుల బృందం గురువారం సందర్శించింది.బృందానికి సారథ్యం వహిస్తున్న కమిటీ ఛైర్మన్ డా. బి.ఎం. వినోద్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి గల్ఫ్ కార్మికులకు ఎలా అండగా ఉండాలి అన్న అంశాలపై ఫిలిప్పీన్స్ అధికారులతో విపులంగా చర్చించారు. ఫిలిప్పీన్స్ దేశం విదేశాలలో పనిచేసే ప్రవాసుల కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను అత్యుత్తమ విధానాలను తెలంగాణ బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

## 'సుప్రీం' దర్యాప్తు కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మాట్లాడుతూ ఈ కమిటీలో పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రవిశంకర్ ఝా. పూర్వ ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ శైలేందర్ కౌర్, పూర్వ సిబిఐ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, మేఘాలయ రిటైర్డ్ డిజిపి ఎల్‌ఆర్.బిష్ణోయ్‌లు ఉంటారని తెలిపింది. నిరసనకారులపై పోలీసులు పెల్లెట్ గన్‌లను ప్రయోగించడం సహా, మితిమీరిన బలప్రయోగం, హింసను ఉపయోగించడంపై,అలాగే నిరసనకారులు పోలీసు అధికారులు,ఇతర భద్రతా సిబ్బందిపై బలప్రయోగం, హింసకు పాల్పడ్డారనే ఆరోపణలపై విచారణ జరపాలని కమిటీని కోరారు.ఈ హెచ్‌పిఇసి (హైపవర్డ్ ఎంక్వైరీ కమిటీ)ని, దాని సభ్యులలో ప్రతీ ఒక్కరి వ్యక్తిగత నైపుణ్యం, అనుభవం, అలాగే కమిటీలోని వైవిధ్యం వంటి అనేక అంశాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేయడం జరిగింది. 'హెచ్‌పిఇసి సిఫార్సులు ఈ కోర్టుకు అమూల్యమైన సహాయాన్ని అందిస్తాయి. తగిన పరిశీలనకు అర్హమైన అన్ని అంశాలపై కమిటీ సమగ్ర అంచనాను చేపట్టగలదని మేం విశ్వసిస్తున్నాం' అని ఆగస్టు 18నాటి ఉత్తర్వులో, గురువారం అప్‌లోడ్ చేసిన దానిలో ధర్మాసనం పేర్కొంది. అత్యంత జాగ్రత్త చర్యగా, హెచ్‌పిఇసి చేపట్టే విచారణ ఒక్కసారి జరిగే ప్రక్రియగా ఉండకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సమస్యలపై నిరంతర, ఆవర్తన మూల్యాంకనం చేపట్టాలని, అలాగే, తన మధ్యంతర పరిశోధనలను క్రమానుగతంగా సమర్పించాలని అది కమిటీని కోరింది. లక్షిత హింస, వేధింపులు, ఇతర ఆరోపణలకు సంబంధించిన సంఘటనలతో సహా కొన్ని సమస్యలను హెచ్‌పిఇసి ప్రాధాన్యత ప్రాతిపదికన పరిష్కరించాలని సుప్రీంకోర్టు సిఫార్సు చేసింది.

## మోగుతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తి ఆదేశించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుకు సంబంధించి ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 162ను తప్పుగా ఉటంకించడంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆర్టికల్ 162 కింద ప్రభుత్వం తన కార్యనిర్వాహక అధికారాలను వినియోగించి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొనగా, ఆ అధికరణానికి భిన్నమైన వివరణను అందులో పొందుపరిచినట్లు న్యాయమూర్తి గుర్తించారు. ఇది సాధారణ ముద్రారాక్షస పొరపాటు కాదని, రాజ్యాంగంలోని అధికరణాన్ని అధికారిక అఫిడవిట్‌లో తప్పుగా ఎలా పేర్కొంటారని ప్రశ్నించారు. అఫిడవిట్‌పై సంతకం చేసే ముందు కనీసం పరిశీలించరా అని నిలదీశారు. రాజ్యాంగ కోర్టులు ఇలాంటి విషయాలను తీవ్రంగా పరిగణిస్తాయని స్పష్టం చేశారు. ఏఏజీ స్పందిస్తూ ఆర్టికల్ 162ను తప్పుగా పేర్కొన్నామని, అది పొరపాటేనని, సరిదిద్దే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే ఆ అంశాన్ని పక్కనపెట్టి మిగిలిన వాదనలు వినాలని కోరగా న్యాయమూర్తి నిరాకరించారు. ఇది తీవ్రమైన అంశమని, సరిచేసిన అఫిడవిట్ దాఖలు చేసిన తర్వాతే తదుపరి విచారణ చేపడతామని స్పష్టం చేశారు. పిటిషనర్ విజయ్‌గోపాల్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులు, కార్మికులు తమ బకాయిలపై ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ బకాయిలు అందలేదని పేర్కొన్నారు. అయితే ఈ అంశాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుకు సంబంధం ఏమిటో చూపకుండా ప్రస్తావించడాన్ని పరిగణనలోకి తీసుకోలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. సంబంధం ఉన్నట్లు భావిస్తే ఆ విషయాన్ని అఫిడవిట్‌లో వివరించాలని ఆదేశించారు. ఎల్‌బీనగర్‌లో కాంట్రాక్ట్ బిల్లు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటనను కూడా పిటిషనర్ ప్రస్తావించారు. దీనిపై ఏఏజీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టులను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించవద్దని, న్యాయస్థానాలను రాజకీయ వేదికలుగా మార్చరాదని కోరారు. రాజకీయ ప్రసంగాలు టీవీలు, సామాజిక మాధ్యమాలు, రాజకీయ వేదికల్లో చేసుకోవచ్చని, కోర్టులో మాత్రం చేయరాదని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ విచారణ కేవలం పథకాల అమలుపైనే పరిమితం కాలేదని స్పష్టం చేశారు. 2014 నుంచి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుతీరును పరిశీలిస్తున్నామని తెలిపారు. ఇది రాజకీయ చర్చ కాదని, పార్టీలు, వ్యక్తులతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. చట్టబద్ధమైన అంశాలు, ప్రజల హక్కులకు సంబంధించిన విషయాలపైనే విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు. ప్రజల హక్కులకు భంగం కలుగుతోందని ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే న్యాయస్థానం జోక్యం చేసుకుంటుందని పేర్కొన్నారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కొనసాగింపునకు ప్రభుత్వం రుణాలు తీసుకుందా? రాష్ట్రానికి ఉన్న మొత్తం అప్పు ఎంత? సంక్షేమ పథకాల అమలుకు తీసుకున్న రుణాల వివరాలేమిటి? తదితర అంశాలను అఫిడవిట్‌లో వెల్లడించాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. బీసీ సంక్షేమశాఖ, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులు సమగ్ర అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేశారు.

## ఎన్నికల్లో రెఫరెండం

(మొదటి పేజీ తరువాయి)

దారులను తప్పనిసరిగా పరిరక్షించాలని, వాటిని పట్టాదారు భూములుగా నమోదు చేయవద్దని అధికారులను ఆదేశించారు. చెరువుల హద్దులను కాపాడి, ఆక్రమణలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బేతుపల్లి పరిధిలో సుమారు 2,026 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా, అందులో సుమారు 980 ఎకరాలు పేదలకు పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. అర్హులైన రైతుల భూ హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. నాగార్జునసాగర్ పైలట్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహించిన సర్వేలో సుమారు 3,400 నకిలీ పట్టాదారు పాస్‌బుక్‌లు గుర్తించినట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టామని, వచ్చే ఏడాదిన్నరలో వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయడమే లక్ష్యమని మంత్రి వెల్లడించారు. రైతుల భూ సమస్యలు లేని రాష్ట్రాన్ని నిర్మించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.భూ ఆక్రమణదారులు అమాయక ప్రజలను అడ్డుపెట్టుకుని 22ఏ భూములను క్రమబద్ధీకరించుకునే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని మంత్రి స్పష్టం చేశారు. భూభారతి చట్టంపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పనిచేసి రైతుల సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తుందని తెలిపారు.

## తలవంచరు : డి.రాజా

(మొదటి పేజీ తరువాయి)

జయప్రదం చేయాలని కోరుతూ డి.రాజా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'నేడు దేశం సవాళ్ల సుడిగుండంలో చిక్కుకొని ఉంది. దిగిరాని ధరలు... పెరగని ఆదాయాలతో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యువతను నిరుద్యోగం వేధిస్తుంటే... విద్యార్థులను పేప్ లీక్‌లు వెంటాడుతున్నాయి. విద్యా వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకుంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కోసం రైతుల డిమాండ్ కొనసాగుతోంది. ఉద్యోగ భద్రత, హక్కుల కోసం కార్మిక వర్గం పోరాడుతోంది. ప్రభుత్వ విద్య, ఆరోగ్య సంరక్షణ నీరుగారిపోతుండగా, సమాజంలో అసమానత్వం పెరిగిపోతోంది' అని డి.రాజా వ్యాఖ్యానించారు. ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి రాజకీయాలే ఈ సంక్షోభానికి కారణమన్నారు. 12 ఏళ్ల మోదీషా పాలనలో కార్పొరేట్లకు పెద్ద పీట వేస్తూ, సామాన్యులపై భారాలు మోపారని విమర్శించారు. హిందూముస్లిం, కులం పేరిట విభజన రాజకీయాలు... ఉద్యోగాలు, జీవనోపాధి, విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక న్యాయం వంటి వాస్తవ సమస్యల నుంచి దృష్టి మళ్లించే చర్యలను డి.రాజా ఆక్షేపించారు. ప్రస్తుతం దేశంలో పరిస్థితులు మారాయని, పాలక పక్షం గురించి ప్రజల్లో భయం పోతోందని, మోదీషా ప్రభుత్వాన్ని సవాల్ చేయొచ్చని విద్యార్థి ఉద్యమం నిరూపించిందని అన్నారు. జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసిన యువతరం బారికేడ్లు, లాఠీలు, బాష్పవాయువు, అణచివేతను ఎదుర్కొన్నప్పటికీ వెనకడుగు వేయలేదంటూ జెన్ జీ ఉద్యమాన్ని మెచ్చుకున్నారు. ఈ ప్రభుత్వం ఓ అజేయశక్తి అనే అపోహ తొలగిపోయిందన్నారు. కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, ఉద్యోగులు, చిరు వర్తకులు, వృత్తిదారులు, పింఛన్‌దారులు, యువతరం ఇలా అన్ని వర్గాలు తమ సమస్యలపై ఐక్య పోరాటాలు చేసే పరిస్థితి ఏర్పడిందని డి.రాజా తెలిపారు. ఇందుకోసమే మార్పు అనివార్యమనే సందేశాన్ని ప్రతి ఇంటికి, పని ప్రదేశానికి, క్యాంపస్‌కు, గ్రామానికి సిపిఐ చేర్చిందని అన్నారు. మార్పు కోరిక కాదు అత్యవసరమని సిపిఐ ప్రధాన కార్యదర్శి స్పష్టంచేశారు.

ఢిల్లీ ర్యాలీ, సభను రద్దు చేయించేందుకు బీజేపీ అన్ని విధాలా ప్రయత్నిస్తోందని, ఇదే క్రమంలో సిపిఐ కేరళం, తమిళనాడు శాఖలు ముందస్తుగానే డబ్బులు చెల్లించి బుక్ చేసిన రైళ్లు రద్దు చేయించిందని డి.రాజా తెలిపారు. బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు అర్ధరాత్రి సమయాల్లో కమ్యూనిస్టు శ్రేణుల ఇళ్లకు వెళ్లి, వారి నుంచి పత్రాలు డిమాండ్ చేస్తూ వేధిస్తున్నారని, వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు. ఎర్ర జెండా కింద ప్రజలు ఏకమవ్వకుండా, అరుణ సైన్యం కదం తొక్కకుండా అడ్డుకునేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తుండటం వల్ల బద్లావ్ జరూరీ హై ర్యాలీ ఏర్పాట్లకు అంతరాయం కలుగుతున్నదని డి.రాజా తెలిపారు. అయితే తాము పట్టుదలతో ముందుకెళుతున్నామని చెప్పారు. నిరంకుశత్వానికి తలొగ్గడం కమ్యూనిస్టుల చరిత్రలో లేదని డి.రాజా తేల్చిచెప్పారు. సెప్టెంబరు 1న ఢిల్లీ ర్యాలీకి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని అన్ని వర్గాల ప్రజలను కోరారు. ఉద్యోగాలు, ఎంఎస్‌పీ, కార్మికుల హక్కులు, మహిళల రిజర్వేషన్, అందరికీ విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ హక్కులు, ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం కోసం డిమాండ్ చేస్తూ బిగ్గరగా గళం వినిపించాలని పిలుపునిచ్చారు. మార్పు కోసం ఢిల్లీ ర్యాలీ సాక్షి కావాలని... ఇది చరిత్రలో నిలిచిపోవాలని డి.రాజా ఆకాంక్షించారు.

అదే సమయంలో ప్రజల గొంతుకను పాలకులకు వినిపించేలా మార్పు నినాదంతో చేపట్టిన సీపీఐ ప్రచారోద్యమానికి తోడ్పాటు అందించాలని, సిపిఐ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తోచిన సాయం చేయాలని పిలుపునిచ్చారు. 'పాలకులు మన రైళ్లను ఆపగలరు, మన ఇంటి తలుపులు తట్టగలరు. మనల్ని భయపెట్టగలరు. కానీ ప్రజల గొంతుకను అణచివేయలేరు. బీజేపీ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించడం ద్వారా చరిత్రను మార్చడంలో వారి పాత్రను మార్చలేరు' అని డి.రాజా స్పష్టంచేశారు. సిపిఐ ఎల్లప్పుడు సామాన్యుల పక్షానే నిలిచిందని, బడా కార్పొరేట్ల అండదండలతో పార్టీ నడవడం లేదన్నారు. సిద్ధాంతాలకు కట్టుబడి ఎన్నికల బాండ్లను వ్యతిరేకించడాన్ని గుర్తుచేశారు. కార్మికులు, రైతులు, ఉద్యోగులు, చిరు వర్తకులు, దేశ ప్రజలే సీపీఐకి బలమన్నారు. మెరుగైన భారత్, ప్రజాస్వామ్యం, న్యాయంపై నమ్మకంతో ప్రలు అందించే సహకారంతో సిపిఐ పోరాటాలు సాగిస్తున్నదని, ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తూ, వారి సంక్షేమం కోసం పాటుపడుతోందని వెల్లడించారు. సిపిఐకి విరాళాలు విరివిగా అందించాలని డి.రాజా పిలుపునిచ్చారు.

**బ్యాంకు ఖాతా వివరాలు: కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా,**
**సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,**
**అకౌంట్ నంబర్: 1033004545,**
**ఐఎఫ్ఎస్‌సి : సిబిఐఎన్0280306,**
**బ్రాంచ్: ప్రెస్ ఏరియా, న్యూఢిల్లీ.**

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com